ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

RNI NO.TELTEL / 2013 /50370

సోమవారం 16.11.2026 | సంపుటి:13 సంచిక:116 | పేజీలు:12 వెల:రూ.4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తుమ్మిడిహట్టి నిర్మాణంపై మహారాష్ట్రను ఒప్పించండి



తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులకు సహకరించండి

ప్రధానమంత్రి మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతి

- ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026కు ప్రధానమంత్రికి ఆహ్వానం
- హాజరైన మంత్రులు ఉత్తమ్,వాకిటి శ్రీహరి

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అనుమతులు, అంతరాష్ట్ర వివాదాల పరిష్కారానికి సహకరించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ప్రాజెక్టుల పనులు వేగవంతం చేశామని, భూ నిర్వాసితులకు పరిహారం వేగంగా అందజేస్తున్నామని ప్రధానమంత్రికి సీఎం తెలియజేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి అధికారిక నివాసంలో ఆదివారం సమావేశం అయ్యారు. సమావేశంలో కేంద్ర క్రీడా, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్ సుఖ్ మాండవీయ, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర క్రీడా, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి ప్రాజెక్టును +152 మీటర్ల వద్ద నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి

మిగతా 2లో..

ఇరిగేషన్ విషయాలకు సంబంధించి ప్రధాని మోదీతో చర్చించాం. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై ప్రధాని సహకారం కోరాం. పర్యావరణ అనుమతుల విషయంలో ఎదురైన ఇబ్బందులపై చర్చించాం. పర్యావరణ అనుమతులు లేకపోవడం వల్ల ప్రాజెక్టుల పనులు ఆగిపోయాయి. అనుమతుల కోసం పర్యావరణ మంత్రిత్వశాఖ జాప్యం చేస్తోందని వివరించాం. తుమ్మిడిహెట్టి- ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు ప్రాముఖ్యతను ప్రధానికి వివరించాం. మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి ఒప్పించాలని ప్రధానిని కోరాం. సమ్మక్క-సారక్క బ్యారేజీపై ప్రధాని మోదీతో చర్చించి, అనుమతులపై వేగం పెంచేలా చూడాని విజ్ఞప్తి చేశాం. పరిహారం ఎంతైనా చెల్లిస్తామని ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి ఇప్పటికే తెలిపాం"

- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

'ఖేలో ఇండియా' లోగో, మస్కట్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ(జనంసాక్షి): తెలంగాణ వేదికగా వచ్చే డిసెంబరు 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న 8వ 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026' అధికారిక లోగో, మస్కట్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ ఆదివారం దిల్లీలో ఆవిష్కరించారు. కేంద్ర మంత్రి అధికారిక నివాసంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర క్రీడా,

మిగతా 2లో..





మ్యాచూ..సిరీసూ.. రెండూ మనవే

- కివీస్‌తో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకున్న టీమ్‌ఇండియా
- ఐదో వన్డేలో 22 పరుగుల తేడాతో భారత్ విజయం
- ఏడేళ్ల తరువాత సొంతగడ్డపై సిరీస్ కోల్పోయిన న్యూజిలాండ్

న్యూజిలాండ్ పర్యటనలో టీమ్‌ఇండియా ఇప్పటికే టీ20 సిరీస్‌ను కైవసం చేసుకోగా.. ఇప్పుడు ఐదు వన్డేల సిరీస్‌ను కూడా దక్కించుకుంది. ఆదివారం జరిగిన ఐదో వన్డేలో భారత్ 22 పరుగుల తేడాతో విజయం సాధించింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను టీమ్‌ఇండియా 3-1తో కైవసం చేసుకుంది. తొలి రెండు వన్డేల్లో భారత్ గెలవగా.. మూడో వన్డే వర్షం కారణంగా రద్దయింది. నాలుగో మ్యాచ్‌లో కివీస్ గెలిచిన విషయం తెలిసిందే.ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన టీమ్‌ఇండియా 42.1 ఓవర్లలో 209 పరుగులకు ఆలౌటైంది. లక్ష్యఛేదనలో కివీస్ 48.1 ఓవర్లలో 187 పరుగులకు ఆలౌటైంది. డీన్ ఫాక్స్‌క్రాఫ్ట్ (31) టాప్ స్కోరర్. నిక్ కెల్లీ (24), మిచెల్ శాంటర్న్ (24), విల్ యంగ్ (22), మైకేల్ బ్రాస్‌వెల్ (19), క్రిస్టియన్ క్లార్క్ (16) పరుగులు చేశారు. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్ 3, అక్షర్ పటేల్ 2, సిరాజ్ 2, అకిబ్ నబీ, యశ్ ఠాకూర్, నమన్ ధిర్ ఒక్కో వికెట్ పడగొట్టారు.టీమ్‌ఇండియా బ్యాటర్లలో అక్షర్ పటేల్ (46; 55 బంతుల్లో), ఇషాన్ కిషన్ (46; 58 బంతుల్లో) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. రోహిత్ శర్మ (7), విరాట్ కోహ్లీ (5) నిరాశపర్చారు. శ్రేయస్ అయ్యర్ (22), రుతురాజ్ గైక్వాడ్ (18) రన్స్ చేశారు. చివర్లో మహ్మద్ సిరాజ్ (14x; 20 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్), అర్ష్‌దీప్ (14; 4 బంతుల్లో 2 సిక్స్‌లు) విలువైన పరుగులు రాబట్టారు.



బ్రేకులు పనిచేయకుండానే

వందే భారత్‌ను 463 కి.మీ నడిపించి..

- సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్‌లో ఘోరతప్పిదం
- ఘటనపై విచారణ జరపాలని రాంచీ డీఆర్‌ఎంకు ఆదేశం

న్యూఢిల్లీ(జనంసాక్షి): సరైన బ్రేకింగ్ వ్యవస్థ లేకుండానే ఓ ఖాళీ వందే భారత్ రైలును ఏకంగా 463 కిలోమీటర్ల మేర నడపడం చర్చనీయాంశమైంది. ఈ ఘటనను సౌత్ ఈస్టర్న్ రైల్వే జోన్ తీవ్రంగా పరిగణించింది. తగినంత బ్రేక్ పవర్ లేకుండా రైలును నడపడం అనేది తీవ్రమైన భద్రతాపరమైన లోపమని.. ఇది ఇతర రైళ్లకు ముప్పుగా పరిణమించడంతోపాటు సిబ్బంది ప్రాణాలనూ ప్రమాదంలో పడేస్తుందని పేర్కొంది. అక్టోబరు 24నాటి ఈ ఘటనపై విచారణ జరపాలని రాంచీ డీఆర్‌ఎంను ఆదేశించింది.ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఝార్ఖండ్‌లోని హతియా నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ వరకు ఓ ఖాళీ వందే భారత్ రైలును గూడ్స్ ఇంజిన్

మిగతా 2లో..

తాగునీటికే పెద్దపీట



గోదావరి జలాలపై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి అవసరాలను తీర్చడం అత్యంత కీలకం :మంత్రి తుమ్మల

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం

భద్రాద్రి(జనంసాక్షి):

వేసవిలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు చేపట్టిన పనులను వేగవంతం చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వర్షాలు తక్కువగా కురవడం వల్ల గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో గోదావరి జలాలపై ఆధారపడిన జిల్లాల్లో తాగునీటి అవసరాలను తీర్చడం అత్యంత కీలకమన్నారు. నీటి నిల్వకు సిద్ధం చేస్తున్న ఇసుక బస్తాల నుంచి నీరు లీకేజీ కాకుండా ప్రత్యేక రక్షణ షీట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు.



భారత్‌సమిట్‌లో రాహుల్‌వి జాతివ్యతిరేక వ్యాఖ్యలు

- 12ఏళ్లలో మోదీపై నాలుగు అణాల అవినీతి ఆరోపణ కూడా లేదు
- కాంగ్రెస్‌పై అమిత్‌షా తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ(జనంసాక్షి):

భారత్ సమిట్‌లో ప్రజాస్వామ్యంపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా కౌంటర్ ఇచ్చారు. ఈ క్రమంలో కాంగ్రెస్ అవినీతిపై ఆరోపణలు చేశారు.కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన 'భారత సమిట్- 2026' వేదికగా రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై అమిత్ షా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ సమావేశానికి దేశ విదేశాల నుంచి వామపక్ష భావజాలాన్ని ప్రచారం

మిగతా 2లో..

నెహ్రూ వారసత్వాన్ని కించపరిచేందుకు బీజేపీ, ఆరెస్సెస్ వ్యూహాలు

ఆయన లేకపోతే రాజ్యాంగం సాధ్యమయ్యేది కాదు:కాంగ్రెస్



న్యూఢిల్లీ(జనంసాక్షి): భారతదేశం అనే భావనలో నెహ్రూ అంతర్భాగమని, ఆ రెండింటినీ ఎవరూ వేరు చేయలేరని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ స్పష్టం చేశారు.భారత తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ వారసత్వాన్ని కించపరిచేందుకు బీజేపీ, ఆరెస్సెస్ ఒక పథకం ప్రకారం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. అయితే, భారతదేశం

మిగతా 2లో..

గాంధీ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి బానిసగా మారారు



- రాహుల్ గాంధీ బైక్ వెంట కాంగ్రెస్ మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పరుగులు తీయడం అవమానకరం
- గతంలో కేంద్రమంత్రి బండి సంజయ్.. అమిత్ షా చెప్పులు మోశారు
- తెలంగాణ ఆత్మగౌరవం ఉన్న గడ్డ... ఈ రెండు జాతీయ పార్టీలు ఇప్పటికీ దాన్ని అర్థం చేసుకోవడం లేదు:కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ కాంగ్రెస్, భాజపా నేతల పదవులకు గౌరవం లేనట్లుందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో గిగ్ వర్కర్ల ర్యాలీ సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. గాంధీ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి బానిసగా మారారని విమర్శించారు. "హైదరాబాద్ పర్యటనకు వచ్చిన రాహుల్‌గాంధీ బైక్ వెంట మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పరుగులు తీశారు. రాహుల్ వెంట అలా పరుగులు తీయడమేంటి? గతంలో కేంద్రమంత్రి బండి సంజయ్.. అమిత్ షా చెప్పులు మోశారు. తెలంగాణ ఆత్మగౌరవం ఉన్న గడ్డ. ఈ రెండు జాతీయ పార్టీలు ఇప్పటికీ దాన్ని అర్థం చేసుకోవడం లేదు" అని కేటీఆర్ అన్నారు.రాహుల్ గాంధీకి సీఎం రేవంత్‌తోపాటు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి పర్సనల్ బాడీ గార్డులుగా మారిపోయారంటూ ఇప్పటికే నెట్టింట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఈ ఘటనపై బీఆర్ ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.హైదరాబాద్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బైక్ ర్యాలీ సందర్భంగా

మిగతా 2లో..



మళ్లీ తెరపైకి మహిళా రిజర్వేషన్ బిల్లు!

డిసెంబర్ మొదటి వారంలో శీతాకాల సమావేశాలు ప్రారంభం

మనము(జనంసాక్షి): ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ పై రాజకీయ వాతావరణం అంతకంతకూ ఘర్షణపూరితంగా మా రుతున్న నేపథ్యంలో, డీలిమిటేషన్‌కు సంబంధించిన ప్రతిపాదిత మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రభుత్వానికి అ తిపెద్ద శాసనపరమైన ప్రాధాన్యంగా మారింది. ఈ నేపథ్యంలో పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెం బర్ మొదటి వారంలో ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ ద్వారా లోక్‌సభ బలాన్ని ప్రస్తుతమున్న 543 సీట్ల నుంచి గరిష్ఠంగా 850కి విస్తరించాలని కోరుతున్న ఈ రాజ్యాంగ సవరణ బిల్లును ఆమోదింపజేయడానికి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోంది. ఇది 2029 సార్వత్రిక ఎన్నికలకు ముందు పార్లమెంట్, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు మార్గం సుగమం చేయనుంది.

స్టార్‌షిప్ 'క్యాచ్' విజయవంతం

చరిత్ర సృష్టించిన స్పేస్‌ఎక్స్..



వాషింగ్టన్(జనంసాక్షి): ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ సంస్థ చరిత్ర సృష్టించింది. భారత కాలమానం ప్రకారం శనివారం.. టెక్సాస్‌లోని లాంచ్ ప్యాడ్ నుంచి నింగిలోకి దూసుకెళ్లన స్టార్‌షిప్ రాకెట్ ఆదివారం తెల్లవారుజామున తిరిగి ప్రయోగ స్థలానికి చేరుకుంది. లాంచ్ టవర్ వద్ద ఉన్న చాప్‌స్టిక్స్ అనే భారీ యాంత్రిక

మిగతా 2లో..

బహ్రెయిన్‌పై నిప్పుల వర్షం

- పేలుళ్లు,సైరన్లతో దద్దరిల్లిన నగరం
- అమెరికా సైనిక స్థావరంపై దాడి చేసినట్లు ప్రకటించిన ఐఆర్‌జీసీ
- అమెరికా మరో తప్పు చేస్తే..పరిస్థితులు చేయి దాటుతాయి: ఇరాన్



టెహ్రాన్(జనంసాక్షి): పేలుళ్లు, సైరన్లతో గల్ఫ్ దేశమైన బహ్రెయిన్‌లో మోతమోగింది. అల్-రిఫా హెలికాప్టర్ స్థావరం వద్ద ఉన్న అమెరికా సైనిక స్థావరంపై తాము దాడి చేసినట్లు ఆదివారం ఇరాన్‌కు చెందిన

మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org | సోమవారం 16.11.2026

బహ్రెయిన్‌పై నిప్పుల వర్షం

ఐఆర్‌జీసీ ప్రకటించింది. ఆ లక్ష్యంపై ఆరు డ్రోన్లు ప్రయోగించినట్లు తెలిపింది. అమెరికా చేసే ఎలాంటి దురాక్రమణకైనా కఠినమైన, మరింత తీవ్రమైన ప్రతిస్పందన ఉంటుందని హెచ్చరించింది. దీంతో అప్రమత్తమైన బహ్రెయిన్ ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేసింది.. వరుస పేలుళ్లు, సైరన్‌ల శబ్దాలతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. ఎత్తైన ప్రదేశాలను వదిలి, వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు ప్రజలకు సూచించారు. ఇరాన్‌పై దాడులు చేస్తామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేస్తున్న ప్రకటనలపై ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ ఘాలిబాఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అగ్రరాజ్యం మరో తప్పు చేస్తే..పరిస్థితులు చేయి దాటుతాయని హెచ్చరించారు. 'అమెరికా చర్చల మార్గాన్ని ఎంచుకుంటుందా లేక యుద్ధ మార్గాన్ని ఎంచుకుంటుందా అనేది మేము పట్టించుకోము. మేము పెట్టిన ఏడు షరతులను అంగీకరిస్తేనే ఆ దేశంతో ఒప్పందానికి ద్వారాలు తెరుచుకుంటాయి. అలా కాదని మళ్లీ దాడులకు తెర లేపితే శక్తిమంతమైన ఇరాన్ సాయుధ దళాలు యుద్ధ క్షేత్రాన్ని నిర్దేశిస్తాయి' అని హెచ్చరించారు.

మరో తుపాను ముప్పు

కోస్తాంధ్రలోనే తీరం దాటే అవకాశం

అమరావతి(జనంసాక్షి): ఆగ్నేయ, నైరుతి బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోంది. ప్రస్తుతం చెన్నైకి 840 కి.మీ, విశాఖకు 1,010 కి.మీ దూరంలో వాయుగుండం కేంద్రీకృతమైంది. వాయుగుండం తీవ్రత పెరిగి ఉత్తర-వాయవ్య దిశగా కదిలే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. గంటకు 10 కి.మీ వేగంతో ఉత్తర దిశగా కదిలిన వాయుగుండం.. రేపు తెల్లవారుజామున దక్షిణ, మధ్య పశ్చిమ బంగాళాఖాతంలో తుపానుగా మారే అవకాశముందని పేర్కొన్నారు. తుపానుగా బలపడిన తర్వాత ఏపీ తీర ప్రాంతం వైపు వచ్చే అవకాశముందని తెలిపారు. దీంతో ఏపీ, దక్షిణ ఒడిశా తీర ప్రాంతాలకు అధికారులు తుపాను ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. తుపాను మరింత బలపడి ఈనెల 17న తీవ్ర తుపానుగా, 18న అతి తీవ్ర తుపానుగా మారే అవకాశముందన్నారు. దీని ప్రభావంతో 19 అతి భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొన్నారు. ప్రస్తుతం కోస్తాంధ్రలోనే అతి తీవ్ర తుపానుగా తీరం దాటే అవకాశముందని అధికారులు స్పష్టం చేశారు. దీంతో కళింగపట్నం మినహా రాష్ట్రంలోని అన్ని పోర్టులకూ ఒకటో నెంబరు ప్రమాద హెచ్చరిక జారీ చేశారు.

ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం!

హైదరాబాద్(జనంసాక్షి):హైదరాబాద్‌లో యువత, టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. రాయదుర్గంలోని ఓ అవుట్‌లెట్‌పై దాడిచేసి భారీగా నిషేధిత వేప్స్, విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పన్నులు ఎగ్గొట్టి చైనా నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటూ ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి యాప్‌ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేస్తున్నట్లు గుర్తించామని ఈగల్ డీఎస్పీ మధు మోహన్ రెడ్డి తెలిపారు. ఈ అక్రమ దందాపై ఈటీవీ భారత్ ముఖాముఖిలో అనేక వివరాలు వెల్లడించారు. 2019 లో కేంద్ర ప్రభుత్వం వేప్స్, ఈ-సిగరెట్లపై నిషేధం విధించింది. ఈజీ మనీ కోసం కొంతమంది వ్యక్తులు వీటిని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్, రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో కేరళంకు చెందిన వ్యక్తులు కూల్‌డ్రింక్‌లు, పెర్‌ఫ్యూమ్ షాపుల మాటున వేప్స్, ఈ-సిగరెట్ల దందా పకడ్బందీగా నడుపుతున్నట్లుగా గుర్తించాం. ఆయా షాపులకు సంబంధించి ప్రత్యేక వాట్సప్ గ్రూప్‌ను క్రియేట్ చేసుకొని, ఆ గ్రూపులో కస్టమర్లను యాడ్ చేసుకుంటున్నారు. వేప్స్, ఈ-సిగరెట్ల కొత్త స్టాక్ వివరాలు ఆ గ్రూప్‌లో పోస్ట్ చేస్తారు. రోజుకో ఫ్లేవర్ ఉందంటూ ఆ గ్రూప్‌లో ఎక్కువగా ఉన్న టీనేజర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని షాపులోనే అమ్మకాలు చేస్తుండగా, మరికొన్ని వాట్సప్ ద్వారా ఆర్డర్ తీసుకుని కస్టమర్ లొకేషన్‌కు పోర్టర్ ద్వారా, ర్యాపిడో, ఉబర్‌ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిసింది. పన్నులు చెల్లించకుండా అక్రమమార్గంలో దందా చేస్తున్నారు.

తుమ్మిడిహట్టి నిర్మాణంపై మహారాష్ట్రను ఒప్పించండి



రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌తో భేటీ అయిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మహారాష్ట్ర లో ముంపునకు అవసరమైన పరిహారం ఇచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని తెలిపారు. తెలంగాణ సాగు నీటి అవసరాల దృష్ట్యా తుమ్మిడిహెట్టికి మహారాష్ట్రను ఒప్పించాలని ప్రధానమంత్రి మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు. తుమ్మిడిహెట్టి ప్రాజెక్టుతో తెలంగాణలోని వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగు నీటి అవసరాలకు గ్రావిటీ ద్వారా నీటిని వినియోగించుకునే అవకాశం కలుగుతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి మోదీకి తెలియజేశారు. డాక్టర్ ఎస్.జైపాల్‌రెడ్డి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం (పీఆర్ఎల్ఐఎస్), సీతమ్మ సాగర్ బహుళార్థసాధక ప్రాజెక్టు (ఎస్ఎస్ఎంపీ), డిండి ఎత్తిపోతల పథకం (డీఎల్ఐఎస్)లపై రాష్ట్ర ప్రభుత్వం భారీగా వ్యయం చేసినా పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో తాగు నీటి ప్రయోజనాలు అందడం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చినందున ఏమాత్రం ఆలస్యం లేకుండా పర్యావరణ, ఇతర అనుమతులు ఇచ్చేలా చూడాలని పీఎం మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సాస్కీ (గ్రాఇష్ట్రవఎవ టనీతీ రాజూవఇఃతిజీశ్రీ ంబబతిబబిజీనిఇవ బినీ రాబిజీబివబ టనీతీ అజీజూతిబిజీశ్రీ ఎనిలవబబిఎవనిబి) కింద తెలంగాణకు అదనంగా రూ.5,000 కోట్లు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

తెలంగాణలో 70 నుంచి 90 శాతం మేర పూర్తయిన ప్రాజెక్టులకు ఈ నిధులు వినియోగించుకుంటామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలోనే ఈ నిధులు మంజూరు చేస్తే కొత్త ఆయకట్టుతో పాటు స్థిరీకరించిన ఆయకట్టుకు సాగు నీరు సరఫరా చేసేందుకు వీలవుతుందని తెలిపారు. ఫలితంగా రైతుల ఆదాయం, గ్రామీణ ఉపాధి అవకాశాలు, ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ను ఇప్పటికే కేంద్ర జల సంఘానికి (సీడబ్ల్యూసీ) సమర్పించామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి సీఎం రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఈ ప్రాజెక్టుతో ఛత్తీస్‌గఢ్ లో ముంపునకు గురయ్యే భూమి, గ్రామాల వివరాలను అంచనాకు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్ఆర్ఎల్), బ్యాక్ వాటర్ స్థాయి గుర్తింపుతో కూడిన సమగ్ర సర్వేకు రూ.9.88 కోట్లు చెల్లించిన విషయాన్ని ప్రధానమంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. ఛత్తీస్‌గఢ్‌కు భూ పరిహారం చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, ఆ రాష్ట్రం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఓసీ) త్వరగా జారీ అయ్యేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి కృషి సించాయీ యోజన (పీఎంకేఎస్‌వై) కింద ఇంటిగ్రేటెడ్ సమ్మక్క సాగర్ ప్రాజెక్టు-సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకా-కొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు మంజూరు చేయాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని సీఎం రేవంత్ రెడ్డి కోరారు.

హైదరాబాద్‌లో డిసెంబరు నెలలో నిర్వహించనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ - 2026' ప్రారంభ, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. ఆహ్వాన పత్రికను పీఎంకు సీఎం అందజేసి, గేమ్స్ లోగో, మస్కట్‌ల గురించి వివరించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో దేశవ్యాప్తంగా ఉన్న 7,000 మందికి పైగా అత్యుత్తమ యువ క్రీడాకారులు పాల్గొననున్నారని, భవిష్యత్తులో ఆసియా క్రీడలు, ఒలింపిక్స్ వంటి ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పోటీల్లో భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు వారికి ఇదొక చక్కని వేదిక కానుందని సీఎం ప్రధానమంత్రికి తెలియజేశారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన చరిత్ర తెలంగాణకు ఉందని పీఎంకు సీఎం తెలిపారు.

బ్రేకులు పనిచేయకుండానే వందే భారత్‌ను 463 కి.మీ నడిపించి..

సాయంతో నడపాల్సి వచ్చింది. హతియా నుంచి బయల్దేరాక నిబంధనల ప్రకారం లోకోపైలట్ బ్రేక్ ఫీల్, బ్రేక్ పవర్ టెస్టు నిర్వహించారు. అది సరిగ్గా పనిచేయడం లేదని గుర్తించి.. రాంచీ స్టేషన్ చేరుకున్నాక అక్కడి సిబ్బందికి ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ.. రైలును అలాగే వెళ్లనిచ్చేందుకు వారు అనుమతించారు. ఆ తర్వాత మురి స్టేషన్ నుంచి రైలును నడిపిన మరో లోకోపైలట్ కూడా బ్రేకింగ్ పనితీరు సరిగా లేదని కంట్రోలర్లకు తెలియజేశారు.చివరకు ఉత్తర్‌ప్రదేశ్‌లోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్ సిబ్బంది రైలును తనిఖీ చేయగా.. వందే భారత్ అన్ని కోచ్‌లలో బ్రేకింగ్ వ్యవస్థలను నిలిపివేసినట్లు (ఐసొలేట్ చేసినట్లు) గుర్తించారు. వందే భారత్ బ్రేకింగ్ వ్యవస్థను గూడ్స్ ఇంజిన్‌తో అనుసంధానించకపోవడంతో బ్రేకులు పనిచేయలేదని తేల్చారు. కేవలం ఇంజిన్ బ్రేకులు, రీజనరేటివ్ బ్రేకింగ్‌పై ఆధారపడి రైలు సుమారు 463 కి.మీ ప్రయాణించిందని.. ఈ వ్యవహారంలో సంబంధిత సిబ్బంది అందరూ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రాథమిక విచారణలో తేలింది. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సౌత్ ఈస్టర్న్ రైల్వే ఆదేశించింది.



'ఖేలో ఇండియా' లోగో, మస్కట్ ఆవిష్కరణ

యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, క్రీడా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, స్పోర్ట్స్ అథారిటీ ఎండీ సోనీబాలా దేవి తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లా కేంద్రాల్లో గేమ్స్ నిర్వహణకు స్టేడియాలు సిద్ధం చేసినట్లు కేంద్ర మంత్రి మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 27 క్రీడాంశాల్లో 7,000 మందికి పైగా క్రీడాకారులు తలపడనున్నారని తెలిపారు. మూడేళ్లలోనే రాష్ట్ర క్రీడా బడ్జెట్‌ను రూ.113 కోట్ల నుంచి రూ.465 కోట్లకు పెంచినట్లు సీఎం కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ఇప్పటికే 61 మినీ స్టేడియాల నిర్మాణం పూర్తి కాగా, మరో 15 స్టేడియాల పనులు వివిధ దశల్లో ఉన్నాయని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

గాంధీ కుటుంబానికి సీఎం రేవంత్‌రెడ్డి బాడీగార్డుగా మారారు

ముందు స్కూటీపై రాహుల్ గాంధీ వెళ్తుంటే.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామితోపాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఆయన వెనుక పరిగెడుతూ వెళ్తున్న దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయని తెలిసిందే. రాహుల్ గాంధీకి సీఎం రేవంత్‌తోపాటు మహేష్ కుమార్ గౌడ్, మంత్రి వివేక్ వెంకటస్వామి పర్సనల్ బాడీ గార్డులుగా మారిపోయారంటూ ఇప్పటికే నెట్టింట విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా ఈ ఘటనపై బీఆర్ ఎస్ వర్కింగ్ కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.తెలంగాణ కాంగ్రెస్, బీజేపీ నేతల్లో వారి పదవులకు తగ్గట్లు ఉండాల్సిన హుందాతనం, గౌరవం కరువయ్యాయని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి గాంధీలకు బాడీగార్డుల్లా వ్యవహరిస్తున్నాడు. రాహుల్ గాంధీ బైక్ వెంట కాంగ్రెస్ మంత్రులు, పీసీసీ అధ్యక్షుడు పరుగులు తీయడం అవమానకరమన్నారు. తెలంగాణకు చెందిన ఒక కేంద్ర మంత్రి అమిత్ షా చెప్పులను మోస్తే, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆయన కాళ్లు మొక్కుతున్నాడని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్, బీజేపీ నేతలు ప్రజలు ఇచ్చిన పదవుల గౌరవాన్ని దిగజార్చేలా ప్రవర్తిస్తున్నారని.. కాంగ్రెస్, బీజేపీ నేతల తీరు అత్యంత సిగ్గుచేటు, అవమానకరమని ట్వీట్ చేశారు. జాతీయ పార్టీల నేతల వ్యవహారశైలి తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా కొనసాగుతోంది. తెలంగాణ ఆవిర్భావమే ఆత్మగౌరవ పునాదులపై జరిగింది. ఈ రెండు జాతీయ పార్టీలకు ఆ విలువ ఎప్పటికీ అర్థం కాదని కేటీఆర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

అమెరికాలో ఇటీవల వేలాది విమానాలు నిలిచిపోయిన వ్యవహారంపై ట్రంప్ తన మౌనాన్ని వీడారు. అమెరికా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థను పూర్తిస్థాయిలో ఆధునికీకరించేందుకు కాంగ్రెస్ అవసరమైన నిధులు విడుదల చేయాలన్నారు. ఏటీసీ వ్యవస్థ ఆధునికీకరణకు అవసరమైన నిధులను కాంగ్రెస్ ఆమోదిస్తే.. ఈ పనిని వేగంగా, సమర్థంగా పూర్తి చేయొచ్చు. దీంతో అమెరికా ఏటీసీ ప్రపంచంలోనే అత్యుత్తమంగా మారుతుందన్నారు.

భారత్‌సమిట్‌లో రాహుల్‌వి జాతివ్యతిరేకవ్యాఖ్యలు

చేసే వారిని కాంగ్రెస్ ఆహ్వానించిందని విమర్శలు గుప్పించారు. భారత్ సమిట్ పేరుతో నిర్వహించిన సదస్సులో రాహుల్ గాంధీ భారత వ్యతిరేక అభిప్రాయాలను వ్యక్తం చేశారని షా ఆరోపించారు. భారత్ సమిట్‌లో మాట్లాడిన రాహుల్ 2014 ఎన్నికల ప్రక్రియలో గతంలో ఎన్నడూ చూడని మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. అప్పుడే భారత రాజకీయ వ్యవస్థలోకి కోట్లాది మొత్తం నగదు ప్రవహించి ఎన్నికల స్వరూపాన్నే మార్చివేసిందని అన్నారు. అసలు ఈ ప్రభావాన్ని ప్రతిపక్షాలు తొలుత అర్థం చేసుకోలేక షాక్‌కు గురైనట్లు రాహుల్ పేర్కొన్నారు. తర్వాత దేశ రాజకీయాల్లో చోటు చేసుకున్న సంక్షోభాలకు కారణాలను గుర్తించినట్లు తెలిపారు. అంతేకాకుండా 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేసిన సుమారు 14 కోట్ల మంది ప్రజలను కొన్ని నెలల కిందటే ఉనికిలో లేని ఓటర్లుగా లేదా ఓటర్లు కానివారిగా ప్రకటించారంటూ ఎన్నికల ప్రక్రియ విశ్వసనీయతపై రాహుల్ ప్రశ్నలు లేవనెత్తారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే అమిత్ షా తాజాగా తీవ్ర స్థాయిలో స్పందించారు.కాంగ్రెస్ పార్టీపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. మహారాష్ట్రలోని పుణెలో ఆదివారం జరిగిన బహిరంగ సభలో మాట్లాడిన ఆయన కాంగ్రెస్ గత పాలనలో రూ. 12 లక్షల కోట్ల విలువైన కుంభకోణాలు జరిగాయని ఆరోపిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ మచ్చలేని పాలనతో పోలుస్తూ విమర్శలు గుప్పించారు. గత 12 సంవత్సరాల తమ పాలనలో ప్రధాని మోదీపై కనీసం నాలుగణాల అవినీతి ఆరోపణ కూడా రాలేదని ఆయన స్పష్టం చేశారు. వరుసగా 3 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత కాంగ్రెస్ పార్టీ తన అసహనాన్ని వివిధ మార్గాల్లో బయట పెడుతోందని అమిత్ షా ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన భారత్ సమిట్ -2026లో '2014లోనే భారత ప్రజాస్వామ్యం ధ్వంసమైందని, ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయని' కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో అమిత్ షా దీనికి కౌంటర్ ఇచ్చారు. దేశాన్ని అంతర్జాతీయ వేదికలపై విమర్శించడం ద్వారా అధికారంలోకి రాలేరని వ్యాఖ్యానించారు. "ఎన్నికల్లో పోరాడటం, గెలవడం, ఓడిపోవడం అనేవి ఆయా పార్టీల నాయకుల పనితీరుపై ఆధారపడి ఉంటాయి. వరుసగా మూడు సార్లు ఓడిపోవడంతో కాంగ్రెస్ తీవ్ర అసహనంతో ఉంది. దేశ ప్రజలు మీకు (కాంగ్రెస్) పదేళ్ల పాటు అవకాశం ఇచ్చారు. ఆ సమయంలో మీరు ఏకంగా రూ. 12 లక్షల కోట్ల విలువైన కుంభకోణాలు, అవినీతికి పాల్పడ్డారు. అందుకే దేశ ప్రజలు మిమ్మల్ని దిల్లీ గద్దె నుంచి దించి, నరేంద్ర మోదీని ప్రధాన మంత్రిని చేశారు. మోదీ గత 12 ఏళ్లుగా పాలిస్తున్నారు. కానీ ఇప్పటివరకు ఆయనపై కనీసం నాలుగు అణాల ఆరోపణ కూడా నమోదు కాలేదు."అని అన్నారు

రాహుల్ గాంధీకి అమిత్ షా సూచనలు

రాహుల్ గాంధీపై విమర్శలు చేస్తూ- అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠను దిగజార్చడం ద్వారా అధికారం దక్కదని అమిత్ షా అన్నారు. 'రాహుల్ గాంధీకి నేను ఒక సలహా ఇస్తున్నాను. అంతర్జాతీయ వేదికలపై భారత్‌ను అప్రతిష్టపాలు చేయడం వల్ల మీకు అధికారం రాదు. మీకు నిజంగా అధికారం కావాలంటే విదేశీ పర్యటనలు ఆపి, భారతదేశంలోని గ్రామాల్ని సందర్శించండి. అప్పుడు ఏదో ఒక రోజు మీ వంతు రావొచ్చు.' అని పేర్కొన్నారు. ప్రపంచమంతా కొనియాడుతున్న మోదీ నాయకత్వాన్ని, భారత అభివృద్ధి ప్రయాణాన్ని దెబ్బతీయాలని రాహుల్ చూస్తున్నారని ఆరోపించారు. రాహుల్ తన మాట వినరని, కానీ కాంగ్రెస్ కార్యకర్తలు ఇదే దారిలో ఆయన్ను అనుసరిస్తే మరో 30 ఏళ్ల పాటు ఆ పార్టీ అధికారంలోకి రాదని షా జోస్యం చెప్పారు.

ఒక్కో మహిళకు రూ.65 వేలు!

అక్రమ అండాల సేకరణ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరం

హైదరాబాద్(జనంసాక్షి):

అక్రమంగా అండాల సేకరణ కేసులో పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తున్నారు. అండాల సేకరణ కోసం ఒక్కోమహిళకు రూ.65 వేల వరకు చెల్లించాలని చేసుకున్న ఒప్పందాలు వెలుగులోకి వస్తున్నాయి.హైదరాబాద్‌లో అండాల సేకరణ అక్రమ వ్యవహారంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్?వోల ఫిర్యాదుల మేరకు జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, మియాపూర్, మహంకాళి, మలక్‌పేట పోలీసు స్టేషన్లలో 5 ఐఎఫ్ఆర్‌లు నమోదు చేశారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినిక్స్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మహిళలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి అండాల దానానికి ప్రలోభపెట్టినట్లు విచారణలో గుర్తించారు.

ఒక్కో మహిళ ద్వారా రూ.65 వేలు చెల్లింపు

ఒక్కో మహిళకు రూ.30 వేల ఇస్తామని ఆశ చూపి ఈ ప్రక్రియకు ఒప్పించినట్లు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా వైద్యుల పర్యవేక్షణ లేకుండానే మహిళలకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మహిళలను తీసుకొచ్చే ఫెసిలిటేటర్లతోనూ ప్రత్యేక ఒప్పందాలు చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఒక్కో మహిళను తీసుకొస్తే రూ.65 వేల వరకు చెల్లించేలా ఒప్పందాలు చేసుకోగా అండాల సంఖ్య, నాణ్యత తగ్గితే ఫెసిలిటేటర్లకు చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం కోత విధించేలా నిబంధనలు పెట్టినట్లు గుర్తించారు.

ఏఆర్‌టీ చట్టం కింద కేసు నమోదు

మొత్తం 66 మంది మహిళల నుంచి అండాల సేకరణ చేసినట్లుగా తెలుస్తున్నా, అధికారులకు మాత్రం 47 మంది మహిళలకు సంబంధించిన రికార్డులే లభించాయి. మిగిలిన 19 మంది మహిళల వివరాలను ఏఆర్‌టీ బ్యాంక్ దాచిపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో మల్కాజిగిరి పోలీసులు మూడు కేసులు నమోదు చేసి, ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. భారతీయ న్యాయ సంహితతోపాటు ఏఆర్‌టీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. తాజాగా మరో ఐదు కేసులు నమోదుకావడంతో ఈ అక్రమ దందాలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మహిళా కమిషన్ విచారణ వాయిదా అక్రమ అండాల సేకరణ వ్యవహారాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ విచారణను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మహిళా కమిషన్ ఎదుట హాజరు కావాలని 8 ఏఆర్‌టీ కేంద్రాలు, అండాల బ్యాంకులకు నోటీసులు జారీ చేయగా, ఆయా సంస్థల ప్రతినిధులు విచారణకు హాజరయ్యారు. ఆ సంస్థల యాజమాన్యాలు స్వయంగా విచారణకు హాజరుకావాలని కమిషన్ స్పష్టంగా ఆదేశించినప్పటికీ, కొన్ని కేంద్రాల నుంచి కేవలం ప్రతినిధులు, సిబ్బంది మాత్రమే హాజరుకావడంపై చైర్‌పర్సన్ నేరెళ్ల శారద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి విచారణ తేదీన తప్పనిసరిగా యాజమాన్యాలు వ్యక్తిగతంగా హాజరవుతామని హామీ ఇవ్వడంతో విచారణను వాయిదా వేశారు.

స్టార్‌షిప్ 'క్యాచ్' విజయవంతం

హస్తాలు స్టార్‌షిప్‌ను విజయవంతంగా ఒడిసిపట్టాయి స్పేస్‌ఎక్స్ గతంలో సూపర్ హెవీ బూస్టర్‌లను తిరిగి పొంది పునర్వినియోగించింది. కానీ స్టార్‌షిప్ వ్యోమనౌకను ఎప్పుడూ ఒడిసిపట్టుకోలేదు. కక్ష్యలోకి ప్రయాణించి భూమికి తిరిగి వచ్చిన తర్వాత.. దీనిని ప్రయోగ స్థలంలో తిరిగి పొందడం ఇదే మొదటిసారి. దీంతో రాకెట్లను పునర్వినియోగించేలా మార్చాలనే స్పేస్‌ఎక్స్ లక్ష్యం దిశగా కీలక ముందడుగు పడింది.ఈ స్టార్ షిప్‌లో 2 భాగాలు ఉన్నాయి. ఒకటి.. సూపర్ హెవీ అనే బూస్టర్. రెండోది స్టార్‌షిప్ వ్యోమనౌక. టెక్సాస్‌లోని స్టార్‌బేస్ అంతరిక్ష కేంద్రం నుంచి ఇది నింగిలోకి దూసుకెళ్లింది. కొద్దిసేపటికి వ్యోమనౌక నుంచి బూస్టర్ విడిపోయింది. లాంచ్ ప్యాడ్‌కు తిరిగి రావాల్సిన సూపర్ హెవీ బూస్టర్ సాంకేతిక లోపంతో పేలిపోయి గల్ఫ్ ఆఫ్ మెక్సికో సముద్రంలో పడిపోయింది. దీంతో ఈ ప్రయోగం పాక్షికంగా విఫలమైంది. అయినప్పటికీ వ్యోమనౌక మాత్రం అంతరిక్షంలో 22గంటలకు పైగా తన ప్రయాణాన్ని కొనసాగించి, తిరిగి విజయవంతంగా చాప్‌స్టిక్స్ పైకి చేరుకుంది. బూస్టర్‌ను కోల్పోవడం వల్ల.. రెండు దశలనూ తిరిగి సేకరించే 'డబుల్ క్యాచ్' అవకాశాన్ని స్పేస్‌ఎక్స్ కోల్పోయింది.

నెహ్రూ వారసత్వాన్ని కించపరిచేందుకు బీజేపీ,ఆరెస్సెస్ వ్యూహాలు

అనే భావనలో నెహ్రూ అంతర్భాగమని, ఆ రెండింటినీ ఎవరూ వేరు చేయలేరని స్పష్టం చేసింది. దిల్లీలో జరిగిన 'నెహ్రూ మెమోరియల్ యూత్ ఫెస్టివల్ 2026' ముగింపు సమావేశంలో సీనియర్ నేత జైరాం రమేశ్ ప్రసంగించారు.నెహ్రూ చారిత్రక సేవలను తుడిచిపెట్టేందుకు ఉద్దేశపూర్వకంగా విషప్రచారం జరుగుతోందని జైరాం రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం భావోద్వేగాలతో కాకుండా, తార్కికత, జ్ఞానం, వాస్తవాలతో ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని ఆయన ప్రజలను కోరారు. చారిత్రక పత్రాలను ఆనాటి పరిస్థితులు, నేపథ్యాలకు అనుగుణంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందన్నారు. యువ పరిశోధకులు, విద్యార్థులు 'నెహ్రూ ఆర్కైవ్' వంటి ప్రామాణిక ఆధారాలను పరిశీలించాలని సూచించారు. చరిత్ర రచనలోని కీలక అంశాలు, చారిత్రక ఆధారాల ప్రామాణికత, అవగాహన, వాస్తవ ఆధారిత విశ్లేషణపై దృష్టి పెట్టాలని కోరారు. నెహ్రూ కేవలం ఒక గొప్ప ప్రధాని మాత్రమే కాదని,

సిరిసిల్లలో కేటీఆర్‌కు చుక్కలు చూపించాం

- ఇక సిద్దిపేటలో హరీశ్‌రావు వంతు
- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్ (జనంసాక్షి) : సిరిసిల్లలో కేటీఆర్‌కు భయం ఏమిటో చూపించామని, ఇక ఇప్పుడు సిద్దిపేటలో హరీశ్‌రావు వంతు వచ్చిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు వస్తున్నారని, అక్కడి నుంచే 'ఇందిరమ్మ బీమా' కార్యక్రమాన్ని ప్రారంభించబోతున్నారని వెల్లడించారు. ఆదివారం సీఎల్పీ మీడియా సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు రూ.5 లక్షల ఇందిరమ్మ బీమా కల్పించి పేదలకు ధీమా ఇవ్వబోతున్నామని తెలిపారు. తమ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకు కట్టుబడి ఉందని, కొత్తగా నాలుగున్నర లక్షల మందికి పింఛన్లు అందిస్తున్నామని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట పర్యటన వార్తతోనే హరీశ్‌రావు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని ఆది శ్రీనివాస్ విమర్శించారు. సిరిసిల్ల ర్యాలీలో కాంగ్రెస్ కార్యకర్తలు సునామీ సృష్టించారని, అక్కడ కేటీఆర్ ఫామ్‌హౌస్‌లు, స్టార్ హోటళ్ల భాగోతాలను సీఎం బయటపెట్టారని గుర్తుచేశారు.

మామ కేసీఆర్‌ను అడ్డం పెట్టుకుని, ఇతర పార్టీల నాయకులను ప్రలోభపెడుతూ కుమ్మక్కు రాజకీయాలతో సిద్దిపేటలో గెలుస్తూ వస్తున్న హరీశ్‌రావు ఆటలు ఈసారి సాగవన్నారు. ఇప్పటికే హరీశ్‌రావు ఫామ్‌హౌస్‌లు, గెస్ట్‌హౌస్‌లు, రంగనాయక సాగర్ భూముల వ్యవహారాలతో పాటు 'మిల్చి మిల్క్' డెయిరీ పెట్టి ఆంధ్రా విద్యా సంస్థలు, ఆస్పత్రులకు ఎలా పాలు సప్లయ్ చేస్తున్నారో బయటపెట్టామని తెలిపారు. 19వ తేదీ సభతో హరీశ్‌రావు పతనానికి కౌంట్‌డౌన్ మొదలవుతుందని, ఆ సభలో ఆయన మరిన్ని భాగోతాలను బయటపెట్టి సిద్దిపేట ప్రజలకు నిజస్వరూపం చూపిస్తామని అన్నారు. కల్వకుంట్ల కుటుంబంలో ఆస్తులు, వాటాల పంపకాల్లో తేడా రావడంతోనే కవిత బయటకు వచ్చి ప్రత్యేకంగా 'టీఆర్ఎస్' అనే పార్టీ పెట్టుకున్నారని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడానికి మూలకారణం హరీశ్‌రావు, సంతోష్‌రావులేనని, హరీశ్‌రావు గుంటనక్క అని కవిత స్వయంగా అభివర్ణిస్తూ వారి అవినీతి వ్యవహారాలను పూసగుచ్చినట్లు వివరించారన్నారు. కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు అక్రమంగా నీళ్లు ఎలా తీసుకుపోతున్నారో కూడా ఆమె బయటపెట్టారని చెప్పారు. కవిత నిజాలు చెప్పడాన్ని తట్టుకోలేక బీఆర్ఎస్ నేతలు ఆమెపై విరుచుకుపడుతూ, ఆమె వెనుక రేవంత్‌రెడ్డి ఉన్నారని మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు.

ప్రగతి భవన్, ఫామ్‌హౌస్‌లలో పదేళ్లలో జరిగిన వేషాలకు కవిత ప్రత్యక్ష సాక్షి అని, అన్నీ స్వయంగా చూసిన ఆమెకు రేవంత్‌రెడ్డి స్క్రిప్ట్ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. కవిత పార్టీని 'రేవంత్ రక్షణ సేన'గా అభివర్ణించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను చూస్తే జాలేస్తోందని, ఆయన బీఆర్ఎస్ పార్టీలో 'బలికా బకరా' అన్న విషయం ఆయనకు తెలియడం లేదని ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు. కవిత ఎందుకు పార్టీ పెట్టిందో మరిచిపోయి, హరీశ్‌రావు, సంతోష్‌రావుల మెప్పు కోసం ప్రవీణ్‌కుమార్ హడావుడి చేస్తున్నారని అన్నారు. కవిత చేసిన అవినీతి ఆరోపణలపై ఇప్పటివరకు నోరు మెదపని హరీశ్‌రావుకు దమ్ము, ధైర్యం ఉంటే ప్రెస్‌మీట్ పెట్టి సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు. ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పలేని వాళ్లు తమ భారత్ సమ్మిట్, గిగ్ వర్కర్స్ మీటింగ్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. "అది మీ రెండు పార్టీల విషయం. మీరిద్దరూ తిట్టుకోండి.. అవసరమైతే తన్నుకోండి.. మాకు అభ్యంతరం లేదు. కానీ మాపై పడితే మాత్రం మర్యాదగా ఉండదు" అని హెచ్చరించారు. కవిత కూడా ఒట్టి ఆరోపణలు చేయకుండా దర్యాప్తు సంస్థల దగ్గరకు వెళ్లి ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

బిర్సా ముండా ఆశయాల సాధనకు కృషి

- ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేశ్, కలెక్టర్ రాజర్షిషా



ఉట్నూర్, నవంబర్15 (జనంసాక్షి) : గిరిజనుల ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలకులపై అలుపెరగని పోరాటం చేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజనుల ఆరాధ్య దైవం భగవాన్ బిర్సా ముండా ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ గిరిజన సమాజ అభ్యున్నతికి కృషి చేయాలని ఆదిలాబాద్ ఎంపీ గోడం నాగేష్,జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. ఆదివారం భగవాన్ బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఉట్నూర్‌లోని కే బి కాంప్లెక్స్ హాల్ లో కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'గిరిజన గౌరవ దినోత్సవం' వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపీ గోడం నాగేష్, కలెక్టర్ రాజర్షి షా, ఐటీడీఏ పీఓ మంద మకరంద్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ గోడం నాగేష్ మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల దోపిడీకి వ్యతిరేకంగా ఆదివాసీల హక్కులు, ఆత్మగౌరవం, జల్-జంగల్-జమీన్ పరిరక్షణ కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. ఆయన జయంతిని జన జాతీయ గౌరవ దివస్‌గా నిర్వహించడం ద్వారా గిరిజన వీరుల త్యాగాలను దేశవ్యాప్తంగా స్మరించుకునే అవకాశం కలిగిందన్నారు. గిరిజన సంక్షేమం,ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యతనిస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం, ఆదివాసీల హక్కుల పరిరక్షణ కోసం భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం, త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపో తాయన్నారు. బిర్సా ముండా ఆశయాలను ఆదర్శంగా తీసుకుని గిరిజన యువత విద్య, వైద్యం, క్రీడలు, ఉపాధి తదితర రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. త్వరలో అమలు కానున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19 నుంచి ప్రత్యేక నమోదు శిబిరాలు నిర్వహించి అర్హులైన కుటుంబాలను పథకంలో నమోదు చేస్తామని వెల్లడిం చారు. ప్రస్తుత పరిస్థితుల్లో నీటిని పొదుపుగా వినియోగిస్తూ నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరంద్ మాట్లాడుతూ భగవాన్ బిర్సా ముండా గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక అని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకు నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ నిరంతరం కృషి చేస్తోందన్నారు.బిర్సా ముండా ఆశయాలకు అనుగుణంగా గిరిజనుల సర్వతోము ఖాభివృద్ధికి మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీడీ అశోక్, ఈఈ తనాజీ, డీఈఓ జి. చందన్, క్రీడల అధికారి పార్థసారథి, సందీప్, సిడం భీంరావు, దుర్గు పటేల్, ఐటీడీఏ అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, విద్యార్థులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాదులో ప్రమాదం.. భూపాలపల్లిలో విషాదం..

- బస్సు ఢీకొని ప్రైవేటు ఉద్యోగి ప్రశాంత్ మృతి..
- దీపావళికి స్వగ్రామానికి వచ్చి వెళ్లిన కొద్ది రోజులకే మృతి





జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదం భూపాలపల్లిలో విషాదాన్ని నింపింది. నగరంలోని బంజారాహిల్స్‌లో ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న భూపాలపల్లికి చెందిన కొండ ప్రశాంత్ (ప్రశాంత్) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. స్కూటీపై వెళ్తున్న ప్రశాంత్‌ను బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలిసింది. భూపాలపల్లికి చెందిన ప్రశాంత్ గత ఎనిమిదేళ్లుగా హైదరాబాద్‌లో నివాసముంటూ ఓ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శనివారం సాయంత్రం సుమారు ఐదు గంటల సమయంలో నాగోల్ నుంచి ఎల్బీనగర్ వైపు వెళ్తుండగా బస్సు ఢీకొని ప్రమాదానికి గురయ్యాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయ పడిన ఆయన మృతి చెందాడు. ఇటీవల దీపావళి పండుగ సందర్భంగా ప్రశాంత్ భూపాలపల్లిలోని తన స్వగ్రామానికి వచ్చి కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపి తిరిగి హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంతలోనే ప్రమాదంలో మృతి చెందాడన్న వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. చేతికి అందివచ్చిన కొడుకు అకాల మరణంతో తల్లిదండ్రులు స్వామి, భాగ్యలక్ష్మి దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతునికి భార్య, రెండేళ్ల పాప ఉన్నారు. తండ్రి కొండ స్వామి భూపాలపల్లిలోని ఎల్‌బీనగర్‌లో నివాసముంటూ సింగరేణి ఓసీ-3లో ఉద్యోగం చేస్తున్నారు. కుటుంబానికి అండగా నిలవాల్సిన కుమారుడు అర్ధాంతరంగా మృతి చెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రశాంత్ మృతితో ఎల్‌బీనగర్ కాలనీవాసులు సైతం తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కన్నీటిపర్యంతమయ్యారు.

కలెక్టర్ పేరు, ఫొటోతో సైబర్ మోసాలకు యత్నం

- నకిలీ వాట్సాప్ ఖాతాలతో డబ్బుల కోసం సందేశాలు
- 97398 11309 నంబర్‌తో అప్రమత్తంగా ఉండాలి
- డబ్బులు పంపవద్దు.. సైబర్ పోలీసులకు సమాచారం ఇవ్వాలి
- ప్రజలు, అధికారులు, సిబ్బందికి కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పేరు, ఫొటోను దుర్వినియోగం చేస్తూ సైబర్ నేరగాళ్లు నకిలీ సోషల్ మీడియా, వాట్సాప్ ఖాతాలను సృష్టించి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ తరహా సైబర్ మోసాల పట్ల ప్రజలు, అధికారులు, ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.

నకిలీ నంబర్‌తో డబ్బుల కోసం సందేశాలు..

97398 11309 అనే మొబైల్ నంబర్ నుంచి తన పేరు, ఫొటోను ఉపయోగించి పలువురు అధికారులు, ప్రజలకు సందేశాలు పంపుతూ డబ్బులు పంపాలని కోరుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. సదరు నంబర్‌తో పాటు తన పేరుతో ఇతర అనుమానాస్పద నంబర్ల నుంచి సందేశాలు వచ్చినా ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించవద్దని స్పష్టం చేశారు. ఎవరూ డబ్బులు పంపి మోసపోవద్దని హెచ్చరించారు.

సైబర్ పోలీసులకు ఫిర్యాదు..

ఈ వ్యవహారంపై ఇప్పటికే సైబర్ పోలీసులకు కేసు నమోదు చేయాలని సమాచారం అందించినట్లు కలెక్టర్ తెలిపారు. ఇలాంటి నకిలీ సందేశాలు వచ్చినట్లయితే వెంటనే సంబంధిత నంబర్‌ను బ్లాక్ చేసి సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చే డబ్బుల అభ్యర్థనలను నమ్మవద్దని, వ్యక్తిగత వివరాలు ఏ వ్యక్తి ఇవ్వకూడదని తెలిపారు.

మియాపూర్ ధర్మపురి క్షేత్రంలో ఘనంగా కార్తీక మాస వనభోజనాలు

కూకట్‌పల్లి (జనంసాక్షి) : కూకట్‌పల్లిలోని కన్యకా పరమేశ్వరి టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, ట్రస్ట్ చైర్మన్ కుమారస్వామి నేతృత్వంలో నిర్వహించిన కార్తీక మాస వనభోజనాల కార్యక్రమం మియాపూర్‌లోని శ్రీ ధర్మపురి క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సందర్శించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్తీక మాసంలో వనభోజనాలు నిర్వహించడం మన హిందూ సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలు, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబిస్తుందని శ్రీనివాస్ గుప్త పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయుల మధ్య స్నేహసంబంధాలు, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చక్కగా నిర్వహించిన కన్యకా పరమేశ్వరి టెంపుల్ ట్రస్ట్ చైర్మన్ కుమారస్వామి గారికి, ట్రస్ట్ సభ్యులకు, నిర్వాహకులకు ఆయన అభినందనలు తెలియజేశారు. 2000 మంది ఆర్య వైశ్య సోదరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బండారు సుబ్బారావు, ఐవీఎఫ్ యూత్ అధ్యక్షుడు రవి కుమార్, కోశాధికారి నరేష్ గుప్త, ట్రస్ట్ సభ్యులు, భక్తులు, పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్ డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్ చెప్పటమంటే దెయ్యాలు వేదాలు వల్లించడమే!

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్



హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్ చెప్పటమంటే దెయ్యాలు వేదాలు వల్లించడమేనని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల తీరుపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాధనాన్ని దోచుకోవడం, భార్యాభర్తల వ్యక్తిగత సంభాషణలను కూడా వినడమేనా 'డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్' అని ఆయన బీఆర్ఎస్‌ను నిలదీశారు. తెలంగాణ ప్రజలకు 'డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్' ఏమిటో బాగా తెలుసని, అందుకే గత ఎన్నికల్లో ఆ పార్టీని ఫామ్‌హౌస్‌కే పరిమితం చేశారని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ పాలనను ఉద్దేశించి బండి సంజయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇంటర్ విద్యార్థులు, ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసి ఆత్మహత్యలు చేసుకునేలా చేయడం, సర్పంచులు, కాంట్రాక్టర్లకు రావాల్సిన బిల్లులు ఇవ్వకుండా వారిని చావుబాట పట్టించడం, ప్రభుత్వ వ్యవస్థలను దుర్వినియోగం చేయడమేనా డిగ్నిటీ ఆఫ్ ఆఫీస్ అని ప్రశ్నించారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలి దోచుకోవడానికే అధికారాన్ని వాడారని బండి సంజయ్ విమర్శించారు.

తాను తన గురువుల కాళ్లు మొక్కడంపై వస్తున్న విమర్శలకు బండి సంజయ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'నేను బరాబర్ మా గురువుల కాళ్లు మొక్కుతా.. మీ లెక్క చెప్పులు ఎత్తుకుపోయే వాడిని కాదు.. గురువు కాళ్లను గుంజేవాళ్లం కాదు, మీ లెక్క మంది కొంపలు ముంచే విలువలు మాకు మా గురువులు నేర్పలేదు' అని స్పష్టం చేశారు. సంస్కారం, విలువలతో కూడిన రాజకీయాలు తమవి అని ఆయన తేల్చిచెప్పారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై బండి సంజయ్ విరుచుకుపడ్డారు. రాహుల్ గాంధీని 'చెల్లని రూపాయి'గా అభివర్ణించిన ఆయన, విదేశాల నుంచి చెల్లని రూపాయలను తీసుకొచ్చి సమ్మిట్ పెడితే ఒరిగేదేమిటని ప్రశ్నించారు. రాహుల్ గాంధీకి దేశ ప్రధాని అయ్యే అర్హతే లేదని, పొరపాటున ఆయన గనుక పీఎం అయితే దేశం ముక్కలవడం తథ్యమని బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు.

మహబూబాబాద్ యువతి ఆత్మహత్య కేసులో ఆరుగురి అరెస్ట్



మహబూబాబాద్ (జనం సాక్షి) : మహబూబాద్ యవతి ఆత్మహత్య కేసులో పోలీసులు ఆరుగురిని అరెస్ట్ చేశారు. రెండేళ్లు ప్రేమించి కులం సాకు చెప్పి ప్రియుడు పెళ్లికి నిరాకరించడంతో సుస్మిత అనే యువతి మనస్తాపంతో ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మహబూబాబాద్ మండలం నడివాడ గ్రామంలో చోటు చేసుకుంది. కుమారస్వామి సుకన్య దంపతుల కుమార్తె సుస్మిత డిగ్రీ పూర్తి చేసి ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతుండగా అదే గ్రామానికి చెందిన అనిల్ అనే యువకుడితో రెండేళ్లుగా ప్రేమలో ఉంది. ఈ క్రమంలో యవతి పెళ్లి చేసుకోవాలని కోరడంతో కులం వేరని సాకు చెబుతూ అనిల్ పెళ్లికి నిరాకరించాడు. తమ ఇంట్లో ఒప్పుకోరని పెళ్లిని వాయిదా వేస్తూ వచ్చాడు. దీంతో తీవ్రమనోవేదనకు గురైన సుస్మిత 18 పేజీల సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకుంది. యువతి ఆత్మహత్యకు యువకుడి కుటుంబ సభ్యులతో పాటు అతడి వేదింపులే కారణం అని విచారణలో తేలింది. దీంతో ప్రియుడు అనిల్, అతని తల్లిదండ్రులు, తమ్ముడు, అక్క, స్నేహితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

సజ్జనార్ పై సీబీఐ, జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

- సీఎంకు ఎమ్మెల్యే రాజా సింగ్ సంచలన లేఖ



హైదరాబాద్ (జనంసాక్షి()) : గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ పదవీ కాలంలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలు, పెండింగ్ కేసులపై స్వతంత్ర సీబీఐ విచారణ లేదా జ్యుడీషియల్ విచారణ జరిపించాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి సంచలన లేఖ రాశారు. ఈ లేఖలో ఆయన పలు కీలక అంశాలను ప్రస్తావించారు. జనార్ధన్‌పై తీవ్ర ఆరోపణలు చేస్తూ సజ్జనార్ చేసిన ఇటీవలి ట్వీట్ తర్వాత ఆయన ప్రవర్తన పై పలు ప్రశ్నలు, అనుమానాలు మరింత బలపడ్డాయని రాజా సింగ్ పేర్కొన్నారు. ఈ పరిణామాలు ఆయన హయాంలో జరిగిన కొన్ని దర్యాప్తుల పారదర్శకత, నిష్పక్షపాతతపై ఆందోళన కలిగిస్తున్నాయని తెలిపారు. అలాగే సజ్జనార్ పదవీకాలంలో నమోదైన గోల్డ్ తెఫ్ట్ (బంగారం చోరీ) కేసులో ఎలాంటి గణనీయమైన పురోగతి లేదని, ఇప్పటివరకు అరెస్టులు ఎందుకు జరగలేదని రాజా సింగ్ ప్రశ్నించారు. దర్యాప్తును ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేయడానికి, వాస్తవాలను తొక్కు పెట్టడానికి ఏవైనా ప్రయత్నాలు జరిగాయా అనేది తేల్చాలని రాజాసింగ్ కోరారు. అలాగే ఆయన హయాంలో నమోదైన హామ్‌వే కేసులో కూడా తీవ్రమైన ఆరోపణలు ఉన్నప్పటికీ, దర్యాప్తులో ఆశించిన పురోగతి లేదని లేఖలో ఎత్తిచూపారు.

ఈ కేసు విచారణలో జాప్యానికి గల కారణాలను స్వతంత్రంగా పరిశీలించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చిన తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కుంభకోణం దర్యాప్తు దారి మళ్లిందనే తీవ్ర ఆందోళనలు ఉన్నాయని రాజా సింగ్ పేర్కొన్నారు. సజ్జల రామకృష్ణారెడ్డితో సహా ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరోపణలు, ఎఫ్ఐఆర్ నమోదైనప్పటికీ విచారణ పురోగతిపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని, అప్పటి సీపీ సజ్జనార్ పాత్రపై కూడా స్వతంత్ర విచారణ అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

అలాగే మాజీ సీబీఐ డైరెక్టర్ ఎం. నాగేశ్వరరావు ఇటీవల సజ్జనార్‌పై తీవ్రమైన బహిరంగ ఆరోపణలు చేశారని, చట్టపరమైన చర్యలు తీసుకోకుండా కేవలం బదిలీ ఎందుకు చేశారని ఆయన ప్రశ్నించిన విషయాన్ని రాజా సింగ్ గుర్తు చేశారు. సజ్జనార్ కర్ణాటకలోని తన స్వగ్రామం, దాని పరిసరాల్లో సుమారు 100 ఎకరాల భూమిని కొనుగోలు చేసినట్లు వస్తున్న ఆరోపణలు, ఆర్థిక లావాదేవీలు, ఆదాయ వనరులపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని ఎమ్మెల్యే రాజా సింగ్ తన లేఖలో ముఖ్యమంత్రిని కోరారు.

రాహుల్ నాయకత్వంలో కాంగ్రెస్ అధికారంలోకి రాదు

- బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్



హైదరాబాద్ (జనం సాక్షి) : దేశ ప్రజల హృదయాల నుంచి కాంగ్రెస్ పార్టీ ఎప్పుడో తొల గిపోయిందని, రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేతగా ఉన్నంత కాలం ఆ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని బీజేపీ నేత ఈటల రాజేందర్ కామెంట్ చేశారు. ఇవాళ నగరంలో ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశ ప్రతిష్ట, గౌరవం, కీర్తి మరింత పెరగాలంటే నరేంద్ర మోడీ ప్రధానమంత్రిగా కొనసాగాల్సిన అవసరం ఉందని దేశ ప్రజలు బలంగా విశ్వసిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దేశ అభివృద్ధి, అంతర్జాతీయ స్థాయిలో భారత్ గౌరవాన్ని నిలబెట్టే విషయంలో ప్రజలకు పూర్తి స్పష్టత ఉందని, మోడీ నాయకత్వం కొనసాగాలన్నదే యావత్ దేశ ప్రజల ఆకాంక్ష అని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై ప్రజలకు నమ్మకం లేదని, అందుకే ఆ పార్టీకి దేశవ్యాప్తంగా ఆదరణ కరువైందని ఆయన

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 నవంబర్ 2026

463 కిలోమీటర్లు గాలిలో ప్రాణాలు..

ఎందుకీ నిర్లక్ష్యం?

సంపాదకీయం

బ్రేకులు లేని రైలును ఏకంగా 463 కిలోమీటర్లు నడపడం పొరపాటు కాదు, నేరపూరిత నిర్లక్ష్యం. జార్ఖండ్‌లోని హతియా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ వరకు ఖాళీ వందే భారత్ రైలు గూడ్స్ ఇంజిన్ సాయంతో పరుగెత్తింది. కానీ దాని బ్రేకింగ్ వ్యవస్థ గూడ్స్ ఇంజిన్‌తో అనుసంధానమే కాలేదు. అంటే ఇంజిన్ బ్రేకులు, రీజనరేటివ్ బ్రేకింగ్ మీదే ఆధారపడి వందలాది కిలోమీటర్లు ప్రయాణించిందన్నమాట. మార్గమధ్యంలో ఏ ఆటంకం ఎదురైనా, ఏ సిగ్నల్ దగ్గరైనా అత్యవసరంగా ఆపాల్సి వస్తే ఏమయ్యేదో ఊహించడానికే భయమేస్తుంది. రైలు కదిలిన ప్రతి కిలోమీటరూ ఒక జూదమే. అందులో పందెం కాసింది అధికారుల ఆస్తి కాదు, ప్రజల, సిబ్బంది ప్రాణాలు.

అన్నింటికన్నా దారుణం, లోపం బయటపడిన తర్వాతా ఈ వ్యవస్థ మేల్కోకపోవడం. హతియా నుంచి బయల్దేరే ముందు నిబంధనల ప్రకారం లోకో పైలట్ బ్రేక్ ఫీల్, బ్రేక్ పవర్ టెస్టు చేశారు. అది సరిగా పనిచేయడం లేదని తెలిసింది. రాంచీ స్టేషన్ చేరాక అక్కడి సిబ్బందికి ఫిర్యాదు కూడా చేశారు. అయినా రైలును అలాగే వెళ్లనిచ్చారు. ఫిర్యాదు చేసిన వారిదే బాధ్యత అనుకోవాలా, ఫిర్యాదు విని కూడా వదిలేసిన వారిదా? ప్రమాదం గురించి ముందే చెప్పినా పట్టించుకోని వ్యవస్థ, ప్రమాదం జరిగాకే కళ్లు తెరుస్తుందా? ఆ తర్వాత మురి స్టేషన్ నుంచి రైలును నడిపిన మరో లోకో పైలట్ కూడా బ్రేకింగ్ పనితీరు సరిగా లేదని కంట్రోలర్లకు తెలియజేశారు. అంటే ఒకటి కాదు, రెండు చోట్ల హెచ్చరికలు వచ్చాయి. రెండుసార్లూ అవి గాలిలో కలిశాయి.

ఈ ప్రయాణం ముగిసేసరికి ఉత్తరప్రదేశ్‌లోని దీన్ దయాళ్ ఉపాధ్యాయ స్టేషన్ సిబ్బంది రైలును తనిఖీ చేశాకే అసలు నిజం బయటపడింది. బ్రేకింగ్ వ్యవస్థ అనుసంధానమే కాలేదని తేలింది. అంటే వందల కిలోమీటర్లు ఎవరూ ఈ కీలక అంశాన్ని సరిగా చూడలేదు. తనిఖీలు, కాగితాలపై సంతకాలు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఏమయ్యాయి? రైలు బయల్దేరేముందు చేయాల్సిన ప్రాథమిక పరీక్షలు ఎందుకు జరగలేదు? ఇవన్నీ తేల్చాల్సిన ప్రశ్నలు. ఖాళీ రైలే కదా, ప్రయాణికులు లేరు కదా అనే నిర్లక్ష్యం ఇందులో దాగి ఉందా? ఒకవేళ అదే కారణమైతే అంతకన్నా సిగ్గుచేటు మరొకటి లేదు. ఖాళీ రైలైనా దాన్ని నడిపే లోకో పైలట్లు, గార్డులు ఉంటారు. పట్టాల పక్కన ఉండే గ్రామాలు, గేట్ల వద్ద వేచి ఉండే వాహనదారులు, ఎదురుగా వచ్చే ఇతర రైళ్లు, వాటిలోని ప్రయాణికులు ఉంటారు. బ్రేకుల్లేని రైలు వాళ్లందరికీ ముప్పే.

సౌత్ ఈస్టర్న్ రైల్వే ఈ ఘటనను తీవ్రంగా పరిగణించామని చెప్పింది. తగినంత బ్రేక్ పవర్ లేకుండా రైలు నడపడం తీవ్రమైన భద్రతాపరమైన లోపమని, ఇది ఇతర రైళ్లకూ, సిబ్బంది ప్రాణాలకూ ముప్పు తెస్తుందని పేర్కొంది. అక్టోబరు 24 నాటి ఈ ఘటనపై విచారణ జరపాలని రాంచీ డీఆర్ఎంను ఆదేశించింది. మంచిదే. కానీ రైల్వేలో విచారణలు, ఆదేశాలు మనకు కొత్త కాదు. ప్రతి ప్రమాదం తర్వాతా కమిటీలు వేస్తారు, నివేదికలు వస్తాయి, కొందరిపై చర్యలు, కొందరికి బదిలీలు, ఆపై అంతా మామూలే. ఈసారి అలా జరగకూడదు. హతియా నుంచి మురి, రాంచీ వరకు ఏ స్థాయిలో ఎవరెవరు లోపాన్ని చూసీ చూడనట్లు వదిలేశారో గుర్తించాలి. ఫిర్యాదులను తొక్కిపెట్టిన వారిని బాధ్యులను చేయాలి. కిందిస్థాయి సిబ్బందిని బలిపశువులను చేసి పైస్థాయి అధికారులు తప్పించుకునే పాత పద్ధతికి ఈసారి తావివ్వకూడదు.

వందే భారత్ అంటే దేశం గర్వంగా చెప్పుకునే ఆధునిక రైలు. వేగం, సౌకర్యం, భద్రత దాని ప్రత్యేకతలుగా ప్రచారం చేస్తారు. కానీ భద్రతే లేకపోతే మిగతావన్నీ అలంకారాలే. రైల్వే సిబ్బంది హెచ్చరికలు చేసినప్పుడు వాటికి విలువ ఇచ్చే సంస్కృతి లేకపోతే, ఎంత అత్యాధునిక రైలైనా ప్రమాదం అంచున పరుగెడుతున్నట్టే. ఈ ఘటన నుంచి నేర్చుకోకపోతే, రేపు ఇదే నిర్లక్ష్యం ప్రయాణికులతో నిండిన రైలుకు జరగదన్న హామీ ఎవరిస్తారు? ప్రాణాలు పణంగా పెట్టి నడిపే ఈ పరుగు ఇక్కడితో ఆగాలి.

కిసాన్ సమ్మేళన్

పిలుస్తుంది పిలుస్తుంది నల్లగొండ
ఎర్రజెండాలు తోరణాలుగాకట్టి
భూమికోసం, భుక్తి కోసం,విముక్తి కోసం
జరిగిన పోరాటాల చరిత్ర సాక్షిగా
మరొక చారిత్రాత్మక ఘట్టానికి వేదికగా
నల్లగొండ నగారా మ్రోగింది
కదిలింది..కదిలింది
నేడు కర్షక లోకం ఏకంగా!
పోరాటాల పోరుగొండై గర్జిస్తూ,
రైతన్నల రణంగొండై నినదిస్తూ,
హక్కుల సాధనకై
అడుగులు వేయంగా!
మట్టిని నమ్మి
చెమటను చిందించి,
లోకానికంతటికీ అన్నం బెట్టే
అన్నదాతలకు,సముచిత గౌరవం
దక్కేరోజకటి రావాలనీ,
కష్టాల కడలిని దాటే
శక్తిని నింపంగా!
పల్లె పల్లె నుండి కదలి, కదలి
అఖిల భారత రైతు సభలకు
తరలి తరలి
ఐక్యతను చాటిచెప్పగా,
రెడ్ షర్ట్ వాలంటీర్ల కవాతు
సమరమై కర్షకుల తీరుచూడ
రైతుల గళాన్ని ఢిల్లీ పీఠానికి వినిపించగా,
కర్షకులంతా కదలంగా...
జై రైతన్నా! జై కిసాన్
పచ్చని పైరు కలగనే
కండ్లల్లో నీరెందుకనీ?
అన్నం బెట్టే రైతు గుండెకు గాయమెందుకని ..
నాగేటి సాల్లల్లో కారిన నెత్తురు
జాడెవరిదని..ఆలోచించే
వేదికొకటి కావాలి
ఆరుగాలం శ్రమించిన పంటకు
మద్దతు ధరే...భద్రం
దళారుల దందా కుట్రకు
రైతన్నల జీవితమే ఛిద్రం
దొంగచాటుగా తెచ్చిన
నల్లచట్టాలు రైతుగుండెపై వేటు
కష్టజీవిపై కాషాయపాలనకుట్రలు
చర్చించాలంటూ..
నడుం కట్టి జనం అంతా
నడవాలి రైతన్నా .
కాశ్మీర్ నుండి కన్యాకుమార్ దాకా
రైతు సంఘం చేసిన ఏడాది యుద్ధం
నలుదిక్కుల పిక్కటిల్లెలా
బిగించిన పిడికిల్లు
ఆగని అడుగులు కదిలిరాగా
ఎన్నెన్నో కర్షక ఉద్యమాల
త్యాగాల అరుణోదయం నేడే
రైతు బాగుంటేనే
రాజ్యం సుభిక్షంగా ఉంటుంది,
అన్నదాత నవ్వితేనే ఈ పుడమి
పచ్చగా వెలుగుతుంది.

అనిత కృష్ణ గండమళ్ళ



మంజరి

విరితోట వలపుల
విరహపు బాట
సిరి వెన్నల కురిసె
జిగెలుగా తోట
మనసు వికలమైన
మల్లెల తోవ
తనువు విలవిలకు
తామర సేవ
రాలిన విరులవి
రసమయ బతుకు
జాలిగా పుడమికి
సాగిల మొక్కు
అందమైన బతుకు
ఆనంద మయ్యె
సుందర బంధాలు
సొగసుల దండ

రేడియమ్.
9291527757

సుప్రీంకోర్టు బలోపేతానికి - సంస్కరణలు అవసరం!



భారత ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే పునాది. ఆ రాజ్యాంగ పరిరక్షణలో సుప్రీంకోర్టుది అత్యంత కీలకమైన పాత్ర. ప్రభుత్వాల అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవడం, పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడటం, రాజ్యాంగ స్ఫూర్తిని నిలబెట్టడం దాని ప్రధాన బాధ్యతలు. అయితే దేశ అత్యున్నత న్యాయస్థానం నేడు కేసుల భారంతో సతమతమవుతోంది. సాధారణ పౌరులకు సకాలంలో న్యాయం అందించాల్సిన వ్యవస్థే, పెండింగ్ కేసుల సమస్యతో సవాళ్లను ఎదుర్కొంటోంది. ఈ పరిస్థితిని అధిగమించడానికి సుప్రీంకోర్టును రెండు విభాగాలుగా పునర్వ్యవస్థీకరించాలన్న ప్రతిపాదన ఇప్పుడు ప్రాధాన్యం సంతరించుకుంది.

2026 నాటి పరిస్థితిని పరిశీలిస్తే, సుప్రీంకోర్టు ముందున్న సమస్య కేవలం న్యాయమూర్తుల కొరత మాత్రమే కాదు. కేసుల స్వభావం, విచారణ విధానం, న్యాయస్థానాల మధ్య బాధ్యతల విభజనలోనూ లోపాలున్నాయి. రాజ్యాంగపరమైన అత్యంత కీలకమైన అంశాలపై తీర్పులివ్వాల్సిన అత్యున్నత న్యాయస్థానం, సాధారణ అప్పీళ్ల విచారణలోనూ గణనీయమైన సమయాన్ని వెచ్చించాల్సి వస్తోంది. ఫలితంగా రాజ్యాంగ ధర్మాసనాల విచారణలు ఆలస్యమవుతున్నాయి. ప్రజాస్వామ్య వ్యవస్థను ప్రభావితం చేసే కీలకమైన రాజ్యాంగ ప్రశ్నలకు సమాధానాలు లభించడానికి సంవత్సరాలు పట్టడం ఆందోళనకరం.

ఈ సమస్యకు పరిష్కారంగా 2009లోనే 229వ న్యాయ కమిషన్ నివేదిక కీలకమైన సూచన చేసింది. ఢిల్లీలో రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేసి, ఢిల్లీ, చెన్నై లేదా హైదరాబాద్, కోల్‌కతా, ముంబయిలలో ప్రాంతీయ అప్పీళ్ల ధర్మాసనాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. దీనివల్ల దక్షిణ, తూర్పు, పశ్చిమ భారతదేశాల ప్రజలు ప్రతి చిన్న అప్పీల్ కోసం ఢిల్లీకి వెళ్లాల్సిన అవసరం తగ్గుతుంది. ప్రయాణ ఖర్చులు, న్యాయవాదుల ఫీజులు, సమయం ఆదా అవుతాయి. అంతేకాకుండా సాధారణ అప్పీళ్లను ప్రాంతీయ ధర్మాసనాలు పరిష్కరిస్తే, సుప్రీంకోర్టులోని రాజ్యాంగ ధర్మాసనాలు దేశ భవిష్యత్తును ప్రభావితం చేసే కీలకమైన న్యాయపరమైన అంశాలపై ఎక్కువ దృష్టి పెట్టగలుగుతాయి. 2023లో పార్లమెంటరీ స్థాయీ సంఘం కూడా ప్రాంతీయ ధర్మాసనాల ఏర్పాటును సమర్థించింది. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసినప్పటికీ, ఆచరణలో ముందడుగు పడకపోవడం విచారకరం. ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామ్య దేశాల అనుభవాలు కూడా ఈ విధానానికి మద్దతునిస్తున్నాయి. అమెరికాలో ఫెడరల్ అప్పీళ్లకు ప్రత్యేక సర్క్యూట్ కోర్టులున్నాయి. దక్షిణాఫ్రికాలో రాజ్యాంగ న్యాయస్థానం, సుప్రీం అప్పీల్ కోర్టు వేర్వేరుగా పనిచేస్తున్నాయి. జర్మనీలో రాజ్యాంగపరమైన వివాదాలను పరిష్కరించడానికి ప్రత్యేక ఫెడరల్ రాజ్యాంగ న్యాయస్థానం ఉంది. ఈ వ్యవస్థలన్నీ భారతదేశానికి యథా తథంగా వర్తించకపోయినా, న్యాయ బాధ్యతలను విభజించడం ద్వారా అత్యున్నత న్యాయస్థానాల పనితీరును మెరుగుపరచవచ్చనే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి.

ఈ ప్రతిపాదనకు వ్యతిరేకంగా వినిపించే ప్రధాన వాదన సుప్రీంకోర్టు ఏకత్వం దెబ్బతింటుందన్నది. దేశవ్యాప్తంగా ఒకే అత్యున్నత న్యాయస్థానం ఉండాలనే భావనకు ప్రాధాన్యం ఉంది. ప్రాంతీయ ధర్మాసనాలు వేర్వేరు తీర్పులిస్తే న్యాయపరమైన గందరగోళం ఏర్పడవచ్చనే ఆందోళన కూడా సమంజసమే. అయితే దీనికి పరిష్కారం విభజనను పూర్తిగా తిరస్కరించడం కాదు. రాజ్యాంగ వ్యాఖ్యానాలు, ప్రాథమిక హక్కులు, కేంద్ర-రాష్ట్ర సంబంధాలు, సమాఖ్య వ్యవస్థకు సంబంధించిన కీలకమైన అంశాలపై ఢిల్లీలోని రాజ్యాంగ ధర్మాసనానికే తుది అధికారం ఉండాలి. ప్రాంతీయ ధర్మాసనాలు సాధారణ అప్పీళ్లను మాత్రమే విచారించాలి. భిన్నాభిప్రాయాలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే స్పష్టమైన వ్యవస్థ ఉండాలి. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయడం కూడా అవసరం.

పెండింగ్ కేసుల గణాంకాలు ఈ సంస్కరణల ఆవశ్యకతను మరింత స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర న్యాయశాఖ పార్లమెంటుకు సమర్పించిన వివరాల ప్రకారం, 2026 జూలై 30 నాటికి సుప్రీంకోర్టులో 95,954 కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో 9,425 కేసులు పదేళ్లకు పైగా, 14,352 కేసులు ఐదేళ్లకు పైగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. 2026 ఫిబ్రవరి 11 నాటికి సుప్రీంకోర్టులో 34 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, పనిచేస్తున్నది 33 మందే. అంటే న్యాయమూర్తుల సంఖ్య పెంచడం ఒక్కటే సమస్యకు పరిష్కారం కాదని స్పష్టమవుతోంది. కేసుల స్వీకరణ, విచారణ ప్రాధాన్యత, ధర్మాసనాల కేటాయింపు, తీర్పుల వెలువరింపు వంటి అంశాల్లోనూ సమూలమైన మార్పులు అవసరం.

అయితే సుప్రీంకోర్టును విభజించడం అంటే దాని రాజ్యాంగపరమైన అధికారాన్ని బలహీనపరచడం కాదు. ప్రజలకు న్యాయాన్ని మరింత చేరువ చేయడం, అత్యున్నత న్యాయస్థానం తన అసలు బాధ్యతలను సమర్థంగా నిర్వహించేలా చూడటమే లక్ష్యం కావాలి. భారత రాజ్యాంగంలోని 130వ అధికరణం ప్రకారం, రాష్ట్రపతి ఆమోదంతో, ప్రధాన న్యాయమూర్తి సంప్రదింపుల మేరకు ఢిల్లీ వెలుపల కూడా సుప్రీంకోర్టు సమావేశమయ్యే అవకాశం ఉంది. కాబట్టి ప్రాంతీయ ధర్మాసనాల ఏర్పాటు విషయంలో రాజ్యాంగపరమైన అవకాశాలను పరిశీలించి, అవసరమైన పరిపాలనా, శాసనపరమైన చర్యలు చేపట్టాలి.

న్యాయం ఆలస్యమైతే అది న్యాయం నిరాకరించడంతో సమానమన్న న్యాయసూత్రం కేవలం నినాదంగా మిగిలిపోకూడదు. న్యాయస్థానాలపై ప్రజలకు ఉన్న విశ్వాసం వాటి భవనాల గొప్పతనంలోనో, న్యాయమూర్తుల హోదాలోనో ఉండదు. సామాన్యుడికి సకాలంలో న్యాయం అందించగల సామర్థ్యంలోనే ఉంటుంది. సుప్రీంకోర్టు ఏకత్వాన్ని కాపాడుతూనే దాని పనిభారాన్ని శాస్త్రీయంగా విభజించాలి. సంస్కరణలను వాయిదా వేయడం వల్ల పెండింగ్ కేసులు తగ్గవు; ప్రజలకు న్యాయం మరింత దూరమవుతుంది. అందువల్ల సుప్రీంకోర్టు పునర్వ్యవస్థీకరణపై జాతీయ స్థాయిలో విస్తృత చర్చ జరిపి, రాజకీయాలకు అతీతంగా నిర్ణయం తీసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. న్యాయవ్యవస్థ బలోపేతం అంటే ఒకే న్యాయస్థానంపై భారాన్ని పెంచడం కాదు; దేశంలోని ప్రతి పౌరుడికి న్యాయం అందే మార్గాలను విస్తరించడం.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

మనిషికి తరగతి గది ఇచ్చే సర్టిఫికెట్ కంటే జీవితంలో కాలం గొప్పది!



విద్యాసంస్థలు మనిషికి పట్టాలను అందిస్తాయి.. కాలం మాత్రం అనుభవాన్ని, సమాజం అవగాహనను, చరిత్ర వివేకాన్ని, జీవితంలోని సంఘర్షణలు వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి.

మనిషి జీవితాన్ని అంచనా వేయడానికి నేడు సమాజం అనుసరిస్తున్న ప్రధానమైన కొలమానం విద్యార్హతలు, సర్టిఫికెట్లు, హోదాలు, ఉద్యోగ స్థాయిలు. ఒక వ్యక్తి ఎన్ని డిగ్రీలు సంపాదించాడు? ఏ విశ్వవిద్యాలయంలో చదివాడు? ఎంత పెద్ద పదవిలో ఉన్నాడు? ఎంత సంపాదిస్తున్నాడు? అనే ప్రశ్నల ఆధారంగా అతడి సామర్థ్యాన్ని నిర్ణయించే ధోరణి పెరిగింది. అయితే ఒక మనిషి నిజమైన విజ్ఞానం, పరిణతి, సామాజిక అవగాహన, మానవత్వం, నాయకత్వ లక్షణాలను కేవలం తరగతి గదిలో పొందిన సర్టిఫికెట్లతో కొలవడం సాధ్యమా? జీవితమనే విశాలమైన విశ్వవిద్యాలయంలో కాలం నేర్పే పాఠాలకు ఏ విద్యాసంస్థ అయినా ప్రత్యామ్నాయం కాగలదా? అన్నది సమాజం ఆలోచించాల్సిన ముఖ్యమైన ప్రశ్న. తరగతి గది మనిషికి జ్ఞానానికి సంబంధించిన పునాదులు వేస్తే, కాలం ఆ జ్ఞానాన్ని జీవిత వాస్తవాల మధ్య పరీక్షిస్తుంది. విద్యాసంస్థలు పాఠ్యాంశాలను బోధిస్తే, జీవితం అనుభవాల ద్వారా మనిషికి సమాజ స్వరూపాన్ని పరిచయం చేస్తుంది.

మానవ నాగరికత చరిత్రను పరిశీలిస్తే విద్య అనేది కేవలం పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాలకే పరిమితమైన ప్రక్రియ కాదని స్పష్టమవుతుంది. ప్రాచీన సమాజాల్లో మనిషి ప్రకృతిని పరిశీలించడం ద్వారా, వృత్తులను అభ్యసించడం ద్వారా, పెద్దల అనుభవాలను వినడం ద్వారా, సామూహిక జీవన విధానంలో భాగస్వామి కావడం ద్వారా విజ్ఞానాన్ని సంపాదించేవాడు. వ్యవసాయం, వైద్యం, నిర్మాణ రంగం, లోహ పరిశ్రమ, నీటి నిర్వహణ, నక్షత్ర పరిశీలన వంటి అనేక రంగాల్లో తరతరాల అనుభవం జ్ఞానంగా పరిణామం చెందింది. భారతదేశ చరిత్రలో గురుకుల వ్యవస్థ, తక్షశిల, నలంద వంటి విద్యాకేంద్రాలు విజ్ఞాన వికాసానికి దోహదపడ్డాయి. అదే సమయంలో వ్యవసాయదారులు, చేతివృత్తుల వారు, శిల్పులు, వైద్యులు తమ అనుభవ సంపద ద్వారా సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. అంటే పుస్తక విజ్ఞానంతో పాటు ఆచరణాత్మక అనుభవం కూడా మానవ నాగరికత అభివృద్ధికి ప్రధాన ఆధారంగా నిలిచింది.

చరిత్రలో గొప్ప వ్యక్తుల జీవితాలను పరిశీలించినప్పుడు కాలం, అనుభవం, నిరంతర పరిశీలన మనిషి ఆలోచనా విధానాన్ని ఎంతగా మార్చగలవో అర్థమవుతుంది. గౌతమ బుద్ధుడి జీవితం ఇందుకు ఒక చారిత్రక ఉదాహరణ. రాజభవనంలోని సౌకర్యవంతమైన జీవితం నుంచి బయటకు వచ్చి వృద్ధాప్యం, వ్యాధి, మరణం వంటి మానవ జీవిత వాస్తవాలను పరిశీలించిన తర్వాత ఆయనలో ఏర్పడిన ప్రశ్నలు ఒక కొత్త తాత్విక మార్గానికి దారితీశాయి. సమాజంలోని దుఃఖానికి కారణాలను అన్వేషించడం ద్వారా ఆయన మానవ జీవితానికి సంబంధించిన లోతైన ఆలోచనలను ప్రపంచానికి అందించారు. అలాగే అశోకుడి జీవితంలో కళింగ యుద్ధం ఒక కీలక మలుపుగా నిలిచింది. యుద్ధంలో జరిగిన ప్రాణ నష్టం, మానవ విషాదం ఆయన పాలనా దృక్పథంలో మార్పుకు కారణమయ్యాయి. అధికారం, సైనిక విజయం కంటే మానవ సంక్షేమం గొప్పదనే ఆలోచనకు ఆయన ప్రాధాన్యమిచ్చారు. ఈ ఉదాహరణలు జీవితంలో ఎదురయ్యే సంఘటనలు మనిషి ఆలోచనలను, విలువలను, నిర్ణయాలను ఎలా ప్రభావితం చేస్తాయో తెలియజేస్తాయి.

భారతదేశ సామాజిక చరిత్రలో మహాత్మా జ్యోతిరావు ఫూలే, సావిత్రిబాయి ఫూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ వంటి మహనీయుల జీవితాలు విద్యకు సామాజిక పరివర్తనతో ఉన్న సంబంధాన్ని స్పష్టం చేస్తాయి. అంబేద్కర్ ఉన్నత విద్యను అభ్యసించి అనేక విద్యార్హతలు సంపాదించినప్పటికీ, ఆయన ఆలోచనలకు మరింత లోతును అందించింది భారతీయ సమాజంలో ప్రత్యక్షంగా ఎదురైన కులవివక్ష, అసమానతలు, సామాజిక అవమానాలు. వ్యక్తిగత అనుభవాలను విస్తృతమైన సామాజిక విశ్లేషణతో అనుసంధానించి సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం, రాజ్యాంగ హక్కుల కోసం ఆయన పోరాడారు. సావిత్రిబాయి ఫూలే విద్యను మహిళల విముక్తికి సాధనంగా మలిచారు. ఈ జీవితాలు విద్యార్హతలు ఎంత ముఖ్యమైనవో, వాటిని సామాజిక బాధ్యతతో అనుసంధానించినప్పుడే వాటి అసలైన విలువ ఎంత పెరుగుతుందో తెలియజేస్తాయి.

ఆధునిక ప్రపంచ చరిత్రలో పారిశ్రామిక విప్లవం మరో ముఖ్యమైన పాఠాన్ని నేర్పింది. పద్దెనిమిదో శతాబ్దం చివరి నుంచి పంతొమ్మిదో శతాబ్దం వరకు యూరప్‌లో పారిశ్రామికీకరణ వేగం పుంజుకున్నప్పుడు సమాజంలోని వృత్తులు, ఉపాధి అవకాశాలు, కుటుంబ వ్యవస్థలు, ఆర్థిక సంబంధాలు సమూలంగా మారాయి. కేవలం సాంప్రదాయ విద్య ఉన్నవారే కాకుండా యంత్రాల పనితీరును అర్థం చేసుకున్నవారు, కొత్త సాంకేతికతలను నేర్చుకున్నవారు, సమస్యలను పరిష్కరించగలిగినవారు పారిశ్రామిక అభివృద్ధిలో కీలక పాత్ర పోషించారు. అనుభవం, ప్రయోగం, పరిశీలన, సృజనాత్మకత సమాజ పురోగతికి అవసరమైన శక్తులుగా మారాయి. నేడు సమాచార సాంకేతిక రంగం, కృత్రిమ మేధ, డిజిటల్ ఆర్థిక వ్యవస్థల విస్తరణ కూడా ఇదే విషయాన్ని మరోసారి నిరూపిస్తున్నాయి. నిన్నటి విద్యార్హత ఒక్కటే నేటి సామర్థ్యానికి హామీ ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. నిరంతరం నేర్చుకునే వ్యక్తికే మారుతున్న ప్రపంచంలో నిలదొక్కుకునే అవకాశం ఉంటుంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన సామాజిక సమస్యను కూడా గుర్తించాలి. సర్టిఫికెట్ల ఆధారంగా మనుషుల విలువను నిర్ణయించే వ్యవస్థలో అనుభవజ్ఞులైన రైతులు, కార్మికులు, కళాకారులు, చేతివృత్తులవారు, సామాజిక కార్యకర్తలు, సంప్రదాయ వైద్య పరిజ్ఞానం కలిగినవారు తగిన గుర్తింపును పొందలేకపోతున్నారు. ఒక రైతుకు వ్యవసాయంలో నలభై సంవత్సరాల అనుభవం ఉండవచ్చు. నేల స్వభావం, విత్తనాల ఎంపిక, వర్షపాతం మార్పులు, నీటి వినియోగం, పంటల వ్యాధుల గురించి అతడికి అపారమైన ఆచరణాత్మక పరిజ్ఞానం ఉండవచ్చు. అయితే అతడి వద్ద వ్యవసాయ డిగ్రీ లేదనే కారణంతో ఆ జ్ఞానాన్ని తక్కువగా చూడటం సమాజంలోని విద్యా దృక్పథంలోని లోపాన్ని సూచిస్తుంది. ఒక వడ్రంగి, కుమ్మరి, నేత కార్మికుడు, మత్స్యకారుడు తమ వృత్తిలో సంపాదించిన అనుభవం కూడా ఒక ప్రత్యేకమైన విజ్ఞాన సంపదే. ఈ అనుభవాలను ఆధునిక శాస్త్రీయ పరిశోధనతో అనుసంధానించగలిగితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు కొత్త అవకాశాలు ఏర్పడతాయి.

అయితే సర్టిఫికెట్లు అవసరం లేదని, అనుభవమే అన్నింటికంటే గొప్పదని ఏకపక్షంగా వాదించడం కూడా సరైనది కాదు. వైద్యం, ఇంజనీరింగ్, న్యాయశాస్త్రం, శాస్త్రీయ పరిశోధన వంటి రంగాల్లో క్రమబద్ధమైన విద్య, శిక్షణ, అర్హతలు, వృత్తిపరమైన ప్రమాణాలు తప్పనిసరి. అనుభవం పేరుతో శాస్త్రీయ పరిజ్ఞానాన్ని నిర్లక్ష్యం చేయడం సమాజానికి ప్రమాదకరం. అదే విధంగా డిగ్రీలు ఉన్నాయనే కారణంతో ఒక వ్యక్తి సమాజంలోని ప్రతి సమస్యను అర్థం చేసుకోగలడని భావించడం కూడా పొరపాటే. విద్య, అనుభవం రెండూ పరస్పర విరుద్ధమైనవి కావు. అవి ఒకదానికొకటి బలాన్ని అందించాలి. పుస్తక జ్ఞానం జీవితాన్ని అర్థం చేసుకోవడానికి మార్గం చూపాలి. జీవితానుభవం పుస్తక జ్ఞానాన్ని మరింత పరిపక్వం చేయాలి. నేటి విద్యావ్యవస్థ ఎదుర్కొంటున్న మరో ప్రధానమైన సవాలు ఉద్యోగం కోసం మాత్రమే చదివే ధోరణి. విద్యార్థి చదువు పూర్తయిన వెంటనే ఉద్యోగం, జీతం, పదోన్నతి, హోదా వంటి అంశాలకే ప్రాధాన్యత ఇస్తున్నాడు. కానీ సమాజం పట్ల బాధ్యత, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ అవగాహన, మానవ హక్కులు, సామాజిక న్యాయం, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలకు విద్యలో తగిన ప్రాధాన్యం లభించాలి. ఒక వ్యక్తి గొప్ప ఉద్యోగంలో ఉన్నప్పటికీ సమాజంలోని పేదరికం, నిరుద్యోగం, కులవివక్ష, లింగ అసమానతలు, రైతుల సమస్యలు, కార్మికుల కష్టాలను అర్థం చేసుకోలేకపోతే అతడి విద్య సామాజిక ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో నెరవేర్చినట్లు కాదు. సమాజాన్ని చదవగలిగిన వ్యక్తే విద్య యొక్క అసలైన లక్ష్యాన్ని గ్రహించగలడు.

జీవితంలో కాలం మనిషికి నేర్పే గొప్ప పాఠం మార్పును అంగీకరించడం. బాల్యంలో కుటుంబం మనకు విలువలను నేర్పుతుంది. యవ్వనంలో విద్య, ఉద్యోగం, పోటీ ప్రపంచాన్ని పరిచయం చేస్తాయి. మధ్య వయస్సులో బాధ్యతలు, ఆర్థిక ఒత్తిళ్లు, కుటుంబ సమస్యలు, వృత్తిపరమైన సంఘర్షణలు ఎదురవుతాయి. వయస్సు పెరిగేకొద్దీ మనుషుల స్వభావాలు, సంబంధాల విలువ, సమాజంలోని అసమానతలు, అధికార స్వరూపం, కాలం మారుస్తున్న పరిస్థితులు మరింత స్పష్టంగా అర్థమవుతాయి. అయితే ఎక్కువ సంవత్సరాలు జీవించినంత మాత్రాన ప్రతి ఒక్కరూ జ్ఞానవంతులవుతారని చెప్పలేం. అనుభవాన్ని విశ్లేషించగలగడం, తప్పుల నుంచి నేర్చుకోవడం, ఇతరుల బాధలను అర్థం చేసుకోవడం, తన అభిప్రాయాలను అవసరమైనప్పుడు సవరించుకోవడం ద్వారానే కాలం నిజమైన గురువుగా మారుతుంది.

ప్రజాస్వామ్య వ్యవస్థలోనూ ఈ ఆలోచనకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. రాజకీయ నాయకులు, అధికారులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు తమ విద్యార్హతలతోపాటు ప్రజల జీవన వాస్తవాలను అర్థం చేసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో రైతు ఎదుర్కొంటున్న సమస్యను కార్యాలయంలోని నివేదిక ద్వారా మాత్రమే పూర్తిగా తెలుసుకోలేరు. కార్మికుడి జీవన పరిస్థితిని గణాంకాలతో మాత్రమే అంచనా వేయలేరు. పేద కుటుంబం ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను విధాన పత్రాల ద్వారా మాత్రమే అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. ప్రజల మధ్యకు వెళ్లడం, వారి అనుభవాలను వినడం, సమస్యల మూలాలను పరిశీలించడం ద్వారానే సమర్థవంతమైన పరిపాలన సాధ్యమవుతుంది. అధికారిక హోదా కంటే సామాజిక బాధ్యత గొప్పదనే అవగాహన పాలకుల్లో పెరగాలి.

విద్యాసంస్థలు కూడా తమ బోధనా విధానాల్లో మార్పులు తీసుకురావాలి. తరగతి గది బోధనకు క్షేత్రస్థాయి అధ్యయనం, సామాజిక పరిశీలన, గ్రామీణ పర్యటనలు, వృత్తిపరమైన శిక్షణ, పరిశోధన, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణలను జోడించాలి. విద్యార్థులు పరీక్షల్లో మార్కులు సాధించడమే కాకుండా జీవిత సమస్యలను విశ్లేషించే సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి. ఉపాధ్యాయులు పాఠ్యపుస్తకాల్లోని విషయాలను వివరించడానికే పరిమితం కాకుండా విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వం, విమర్శనాత్మక ఆలోచన, మానవీయ దృక్పథం పెంపొందించాలి. అనుభవజ్ఞులైన వృత్తి నిపుణులు, రైతులు, కళాకారులు, సామాజిక కార్యకర్తల జ్ఞానాన్ని విద్యా ప్రక్రియలో భాగం చేయాలి.

ఇదే సందర్భంలో భారతీయ సమాజంలో తరతరాలుగా కొనసాగుతున్న జ్ఞాన సంప్రదాయాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉంది. గ్రామీణ సమాజంలో పెద్దలు అందించే జీవిత పాఠాలు, కుటుంబ వ్యవస్

జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY

మదీనాగూడకు మసి పూస్తున్న అక్రమార్కులు

- ముంబై జాతీయ రహదారిపై నాలుగున్నర ఎకరాల ప్రభుత్వ భూమి
- మార్కెట్ వాల్యూ 400 కోట్ల పై మాటే..
- భారీగా అక్రమ నిర్మాణాలు
- కంచె చేను మేసినట్టుగా అధికారుల వ్యవహారం?



శేరిలింగంపల్లి, నవంబర్ 15 (జనంసాక్షి) :
డబ్బు ఎవరికీ చేదు కాదు.. ఎలాంటి వారినైనా కట్టిపడేస్తూ.. కాదు కాదు తన బుట్టలో పడవేస్తూ... చుట్టూ తిప్పుకునే డబ్బు ఈ రోజుల్లో మనిషిని మన మనిషిగా... విలువలను... నైతికతను... కుటుంబ సంబంధాలనుసైతం తన వ్యామోహంలో పడవేస్తూ... మనిషికి మనిషిని దూరం చేస్తూ... చివరకు ఉనికినే లేకుండా చేసే చరమాంకానికి చేర్చిన ఘనత డబ్బుదే అనడంలో ఆవగింజంతైనా అనుమానం అక్కర్లేదు.

శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ సర్కిల్ పరిధి మదీనాగూడ ప్రాంతం ముంబై జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న విషయం విధితమే. దీంతో ఈ ప్రాంతానికి, ఇక్కడి భూములకు విపరీతమైన డిమాండ్ ఉండడంలో ఆశ్చర్యం లేదు. ఈ మూల సూత్రాన్ని అవపోసన పట్టిన కొంతమంది దళారులు భూకబ్జాల దారిని ఎంచుకొని సులభంగా వందల కోట్లకు ఎదగడానికి రాత్రికి రాత్రే ఆక్రమణ నిచ్చెనలు వేసుకుంటున్నారు. ఈ క్రమంలో అది ప్రభుత్వ భూమైనా, ప్రైవేటుదైనా సామ దాన భేద దండోపాయాలను ఉపయోగిస్తూ భూములను హస్తగతం చేసుకొని తరువాత తమ పలుకుబడిని, కుటిల నీతిని, అధికారులతో బేరసార కుట్రలను పాచికలుగా పారిస్తూ సదరు భూముల్లో భారీ అక్రమ నిర్మాణాలను సృష్టించి కోట్ల రూపాయల పరాయి సొమ్మును పందికొక్కుల్లా బొక్కుతున్నారు. గత దశాబ్దంన్నర కాలంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం అంచనాలకుమించి శరవేగంగా అభివృద్ధి చెందుతూ ఉండడంతో నాటి నుండి నేటి వరకు భూమిధరలలో మార్పులొస్తూ ప్రస్తుతం ఆకాశాన్ని అంటుతుండడం జరుగుతోంది. ఈ క్రమంలో మియాపూర్ సర్కిల్ పరిధి మదీనాగూడలోని సర్వేనెంబర్ 69/పార్ట్ లో నాలుగెకరాల 26 గుంటల ప్రభుత్వ భూమి ధరసైతం చుక్కలను అంటుతుండడంతో ఎలాగైనా సదరు భూమిని మింగేయాలని చూస్తున్న దళారులు చెట్టును చెదలు తొలుస్తున్న మాదిరిగా వందల గజాల చొప్పున కబ్జా చేయడం రాత్రికి రాత్రే భారీ బహులాంతస్తుల భవనాలను నిర్మిస్తుండడం స్పష్టంగా కనిపిస్తుంది.

కొత్త కొత్త భవనాలు.. ఖాళీ ప్లాట్లుగా రూపాంతరం

మియాపూర్ సర్కిల్ లోని మదినగూడ రెవెన్యూ పరిధిలోని ముంబై జాతీయ రహదారిపై ఉన్న సర్వే నెంబర్ 69/పార్ట్ లో ప్రభుత్వ రికార్డుల ప్రకారం 4 ఎకరాల 26 గుంటల భూమి ఉంది. దీని విలువ హీనపక్షాన 450 కోట్ల రూపాయలకు పైమాటే. దీనికి తోడు జాతీయ రహదారి కావడంతో ఇది పూర్తిగా కమర్షియల్ ప్రాంతంగా పరిగణింపబడుతున్నందున సదరు భూమికి విపరీతమైన డిమాండ్ ఉండడంతో ఎలాగైనా దానిని చెరబట్టి సొమ్ము చేసుకోవాలని కొందరు దళారుల అవతారమెత్తి రాజకీయ పలుకుబడి, ఇతర అక్రమ మార్గాలను అమలు చేస్తూ హస్తగతం చేసుకునే ప్రయత్నంలో తప్పుడు ధృవపత్రాలను సృష్టించి భారీ భవనాల నిర్మిస్తూ కోట్ల రూపాయల ప్రభుత్వ ఖజానా ధనాన్ని తమ సొమ్ముగా చేతులు మారుస్తూ ప్రభుత్వ భూమిని దేవుడి ప్రసాదంలా ఎవరికి వారు పంచేసుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దశాబ్దాలుగా అది ప్రభుత్వ భూమి అయినప్పటికీ ఇంతకాలం పూర్వస్థితిని కలిగి ఉండి ఇప్పుడిప్పుడే అందులో కొత్త కొత్త భవనాలు, ఖాళీ ప్లాట్లుగా రూపాంతరం చెందుతుండడం ప్రభుత్వ భూమి విషయంలో కొనసాగుతున్న దురాక్రమణాలను తేటతెల్లం చేస్తోంది.



ప్రభుత్వ భూమిలో రిజిస్ట్రేషన్ ఎలా..?

శేరిలింగంపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో ప్రభుత్వ భూములకు సంబంధించిన స్పష్టమైన రికార్డులు ఉంటాయన్నది జగమెరిగిన సత్యం. ఒకవేళ ఇక్కడ ఏదైనా కారణం చేత కొన్ని రికార్డులు తప్పిపోయినా ఏజి కార్యాలయంలో దీనికి సంబంధించిన సంపూర్ణ సమాచారం రికార్డుల రూపంలో నిక్షిప్తమై ఉండడం మండల రెవెన్యూ అధికారులకు సైతం తెలిసిందే. అయితే నిన్న మొన్నటి వరకు ఇది ప్రభుత్వ భూమిగా గమనంలో ఉన్నప్పటికీ ఈ మధ్యకాలంలో హఠాత్తుగా అక్రమ నిర్మాణాలు, భారీ బహుళ అంతస్తుల భవనాలు, ఓపెన్ ప్లాట్లు హద్దులతో రూపుదిద్దుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. సాక్షాత్తు ముంబై జాతీయ రహదారిపై పట్టపగలే ఇలా అక్రమ నిర్మాణాలు పురుడుపోసుకుంటుంటే అటు రెవెన్యూ అధికారులు, ఇటు సిఎంసి అధికారులు పూర్తిగా చూసి చూడనట్లు వదిలేస్తుండడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే శేరిలింగంపల్లి లో వందల ఎకరాల ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమైపోయి ఓవైపు సామాజిక అవసరాలు, మరోవైపు శేరిలింగంపల్లి ప్రజల భవిష్యత్తుకు తీరని నష్టం వాటిల్లుతుంటే హైడ్రా లాంటి సంస్థలు స్వచ్ఛందంగా అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్న తరుణంలో ఇతర ప్రభుత్వ సంస్థల, న్యాయవిభాగాల సహకారంతో తప్పులను సరిదిద్దుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనవ్రతం వహిస్తున్నారో అర్థంకాని మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగులుతుండడం ఆందోళన కలిగించే అంశం. ప్రభుత్వ అధికారుల పుణ్యమా అని ఇప్పటికే ఎన్నో అపవాదులను మూటగట్టుకున్న శేరిలింగంపల్లిలో తమ్మిడికుంట చెరువు రూపంలో మొన్ననే ముఖ్యమంత్రి చేత ప్రశంసలు అందుకున్న వైనాన్ని అధికారులు పరిగణలోకి తీసుకొని తక్షణమే మదీనాగూడ సర్వే నెంబర్ 69/పార్ట్ లోని అక్రమాలకు చెక్ పెడుతూ ప్రస్తుత నిర్మాణాలను సైతం పూర్తిగా నిర్మూలించి మొత్తం భూమిని ప్రభుత్వపరంగా అందుబాటులోకి తేవాలని సామాజికవేత్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.



మరణంలోనూ ఇద్దరి జీవితాల్లో వెలుగులు

విషాదంలోనూ నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబం

- రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలి మృతి
- తండ్రి అంత్యక్రియలు నిర్వహించిన చిన్నకుమార్తె
- కుమార్తెల మానవీయ నిర్ణయంపై ప్రశంసలు

గోదావరిఖని, నవంబర్ 15 (జనంసాక్షి): కన్నతండ్రి మరణంతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆ కుటుంబం.. విషాదంలోనూ గొప్ప మానవత్వాన్ని చాటుకుంది. తండ్రి నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకొచ్చింది. మరోవైపు కుమారులు లేరనే లోటును తీర్చుతూ చిన్నకుమార్తె తండ్రి అంత్యక్రియలను స్వయంగా నిర్వహించి ఆదర్శంగా నిలిచింది. ఈ హృదయవిదారక ఘటన పెద్దపల్లి జిల్లా మంథని మండలం నాగారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గడ్డం మల్లయ్య (45) వ్యవసాయ కూలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. శనివారం గ్రామంలో రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. దీంతో భార్య దేవమ్మ, కుమార్తెలు రవళి, లక్ష్మీ ప్రసన్న కన్నీరుమున్నీరయ్యారు.తీరని దుఃఖంలోనూ తండ్రి మరణంతో మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఆలోచనతో కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసేందుకు అంగీకరించారు. ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు టెక్నీషియన్ ప్రదీప్ నాయక్ ఆసుపత్రికి చేరుకుని నేత్రాలను సేకరించి హైదరాబాద్‌కు తరలించారు. ఈ దానంతో ఇద్దరు అంధులకు చూపు ప్రసాదించే అవకాశం కలగనుంది.మల్లయ్యకు కుమారులు లేకపోయినా ఆ లోటును కుమార్తెలు అధిగమించారు. చిన్నకుమార్తె లక్ష్మీ ప్రసన్న తండ్రి అంత్యక్రియలను స్వయంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకుంది. ఒకవైపు తండ్రిని కోల్పోయిన బాధను దిగమింగుతూ.. మరోవైపు ఆయనకు అంతిమ వీడ్కోలు పలికిన తీరు గ్రామస్థులను కంటతడి పెట్టించింది. నేత్రదానానికి అంగీకరించిన భార్య దేవమ్మ, కుమార్తెలు రవళి, లక్ష్మీ ప్రసన్న, సోదరుడు చిన్న మల్లయ్యను గ్రామపెద్దలు, సదాశయ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు అభినందించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వనస్థలిపురంలో యువతి అదృశ్యం

హయత్ నగర్, నవంబర్ 15 (జనం సాక్షి) : వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో పులరౌతు భార్గవి (20) అనే యువతి అదృశ్యమైంది. విశాఖపట్నంలో బీటెక్ చదువుతున్న ఆమె నవంబర్ 1న రాత్రి 8.30 గంటలకు వనస్థలిపురంలోని కేఎల్ఎం షాపింగ్ మాల్ సమీపంలో విశాఖపట్నం వెళ్లేందుకు మినీ బస్సు ఎక్కింది. అనంతరం ఆమె ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి శోభారాణి ఫిర్యాదు మేరకు వనస్థలిపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. యువతి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని వనస్థలిపురం ఎస్హెచ్ఓ రవిబాబు తెలిపారు.

రోడ్డు దాటాలంటేనే భయం

ప్రమాదాలకు స్వాగతం పలుకుతున్న ప్రధాన కూడలి

- కొందుర్గు నవాబ్‌పేట్ రోడ్డులో వాహనాల రద్దీ..
- ఆదివారం సంత పార్కింగ్‌కు సరైన స్థలం లేక రహదారిపైనే వాహనాల నిలుపుదల
- ట్రాఫిక్ నియంత్రణ చేపట్టాలని గ్రామస్తుల విజ్ఞప్తి



కొందుర్గు జనంసాక్షి: రంగారెడ్డి జిల్లా కొందుర్గు గ్రామంలోని ప్రధాన కూడలి ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ముఖ్యంగా కొందుర్గు–నవాబ్‌పేట్ రహదారిపై ఆదివారం సంత జరిగే సమయంలో వాహనాల రద్దీ తీవ్రంగా పెరుగుతోంది. సంతకు వచ్చే వ్యాపారులు, కొనుగోలుదారులు తమ వాహనాలను ఎక్కడపడితే అక్కడ నిలిపివేస్తుండటంతో రహదారిపై ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం లేకపోవడంతో రహదారిపైనే ద్విచక్ర వాహనాలు, కార్లు ఇతర వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో ప్రధాన కూడలిలో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా పాదచారులు రోడ్డు దాటాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. వాహనాలు ఎటువైపు నుంచి వస్తాయో తెలియని పరిస్థితిలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండే ఈ ప్రధాన కూడలిలో ఆదివారం సంత సమయంలో పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సంతకు వచ్చే వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, ప్రధాన కూడలిలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. ముఖ్యంగా ఆదివారం సంత సమయంలో పోలీసులను నియమించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తే ప్రమాదాలను నివారించవచ్చని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే అప్రమత్తమై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అమీర్‌పేట ల్యాబ్‌లో యజమాని ఆత్మహత్య

అమీర్‌పేట, నవంబర్ 15 (జనంసాక్షి): ఆర్థిక ఇబ్బందులతో మైక్రోపాత్ ల్యాబ్ యజమాని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అమీర్‌పేటలో కలకలం రేపింది. మల్లంపేటలో నివాసముండే బోనగిరి ఉపేందర్ (40) గత ఎనిమిది నెలలుగా సొంతంగా ల్యాబ్ నిర్వహిస్తున్నారు. ఆయనకు పదో తరగతి చదువుతున్న కుమారుడు, ఎల్‌కేజీ చదువుతున్న కుమార్తె ఉన్నారు. గతంలో బోరబండలో కొన్నేళ్లపాటు భాగస్వాములతో కలిసి ల్యాబ్ నిర్వహించిన ఉపేందర్.. మనస్పర్థల కారణంగా వారితో విడిపోయి సొంతంగా వ్యాపారం ప్రారంభించినట్లు తెలిసింది. ఈ క్రమంలో మాజీ భాగస్వామి ప్రదీప్ వద్ద తనకు రూ.4 నుంచి 5 లక్షల వరకు రావాల్సి ఉందని, మరికొన్ని బీమా సంస్థల నుంచి కూడా డబ్బులు అందాల్సి ఉందని సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు సమాచారం. ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.

పేద రైతు భూమిపై దళారుల కన్ను..!

- కుల సంఘాల నాయకుల అండతో భూమి కబ్జాకు యత్నం
- యాలాల్ మండలం పగిడ్యాల్ గ్రామంలో రైతు ఆవేదన

వికారాబాద్ జిల్లా హీరో నవంబర్ 15 (జనం సాక్షి): పేద రైతు ఎకరం భూమి, కోళ్లఫారం కబ్జా చేసేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని యాలాల్ మండలం పగిడ్యాల్ గ్రామానికి చెందిన బర్ల వెంకటేశం ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కుల సంఘాల నాయకులను అడ్డుపెట్టుకొని తన భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలియ చేశారు.బర్ల వెంకటేశం (44) తెలిపిన వివరాల ప్రకారం.. పగిడ్యాల్ గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 96అ4/1/2లో తనకు ఒక ఎకరం భూమితో పాటు కోళ్ల ఫారం ఉందని తెలిపారు. ఈ భూమిని తన కొడుకు ఆరోగ్యం బాగాలేక పిట్ల నరేష్, మధ్యవర్తిత్వంతో తాండూర్ కు చెందిన దూదల వెంకటేశం గౌడ్ దగ్గర భూమి పెట్టి 9 లక్షల రూపాయలు తీసుకోగా కొంత కాలానీ మిత్తి (ఇంట్రెస్ట్) డబ్బులు ఇచ్చినాను డబ్బులు కొంత కాలానికి ఇస్తాను అని చెప్పగా అందుకు దూదల వెంకటేశం అంగీకరించినాడు, పిట్ల నరేష్ తన భార్య ఐన పిట్ల పద్మపై నాకు తెలియకుండానే దూదల వెంకటేశం నుండి రిజిస్ట్రేషన్ చేసుకొని నా భూమిని, కోళ్లఫారంను ఆక్రమించుకోవాలని చూడగా దీనిపై వికారాబాద్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్ నంబర్ 381/2025 కేసు పెండింగ్‌లో ఉందన్నారు.అయినప్పటికీ, కొందరు వ్యక్తులు తన భూమిలోకి అక్రమంగా ప్రవేశించి కోళ్ల ఫారంలోని పరదాలు, డ్రింకర్లు, ఫీడర్లను తగులబెట్టారని ఆరోపించారు. అంతేకాకుండా కోళ్లను చంపి, ఫారానికి నష్టం కలిగించారని పేర్కొన్నారు. ఈ ఘటనపై నవంబర్ 10న యాలాల్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ విట్టల్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.ఫిర్యాదు స్వీకరణ విషయంలో తొలుత ఇబ్బందులు ఎదురయ్యాయని, రిసీవ్డ్ కాపీ కోరగా ఓన్లీ రిసీవ్డ్ అని రాసి డాక్యుమెంట్స్ సబ్మిట్ చేయాలని ఎస్ఐ విటల్ రెడ్డి బెదిరించాడు.



ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి 14 రోజుల గడువు ఉంటుందని అంతలోపు ఎప్పుడైనా చేస్తా పో అన్నాడు. ఇదిలా ఉండగా, నవంబర్ 12న తన పొలంలోని టేకు, వేప చెట్లను కూడా నరికివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో పిట్ల నరేష్, పిట్ల పద్మమ్మ, హస్తం ఉందని ఆరోపించారు. తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి

యాలాల్ పోలీస్ స్టేషన్ చుట్టూ రోజు తిరుగుతున్నకూడా యాలాల్ ఎస్ఐ విట్టల్ రెడ్డి వారికి సపోర్ట్ చేస్తూ బాధ్యులకు సపోర్ట్ ఎస్ఐ తనను బెదిరింపులకు గురి చేస్తున్నాడు .ఈ భూవివాదంపై న్యాయస్థానంలో కేసు పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో, తన భూమికి రక్షణ కల్పించాలని, కోళ్ల ఫారానికి జరిగిన నష్టంపై విచారణ జరిపించాలని వెంకటేశు కోరారు. ఈ కేసులో యాలాల్ ఎస్ఐ విట్టల్ రెడ్డిని కాకుండా వేరే ఉన్నతాధికారితో నిష్పక్షపాతంగా విచారణ జరిపించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాడు.



పుస్తక పఠనంతోనే విజ్ఞానాభివృద్ధి

- జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా పుస్తక ప్రదర్శన

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనం సాక్షి:
59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిగ్రీ కళాశాల ప్రొఫెసర్ కుమారస్వామి హాజరై పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయాల ప్రాముఖ్యతను, పుస్తక పఠనం ద్వారా కలిగే విజ్ఞానాన్ని ప్రజలకు తెలియజేయడానికి ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. నేటి ఆధునిక సాంకేతిక యుగంలోనూ పుస్తక పఠనానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనాన్ని అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. నిజామాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువత కోసం వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను, ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు అనుగుణంగా అవసరమైన అధ్యయన సామగ్రిని ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచడం అభినందనీయమని ప్రశంసించారు. గ్రంథాలయాలు విద్యార్థులకు, యువతకు విజ్ఞాన భాండాగారాలుగా నిలుస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఏ. రాజిరెడ్డి, అసిస్టెంట్ లైబ్రేరియన్ జి. శ్రావణ్ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ మౌనిక, రికార్డు అసిస్టెంట్లు అభిలాష్, భాగ్యలక్ష్మి, సిబ్బంది పద్మావతి తదితరులతో పాటు గ్రంథాలయ పాఠకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

బొమ్మకల్ బైపాస్ రోడ్డులో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

కరీంనగర్ క్రైమ్ నవంబర్ 15 (జనంసాక్షి) : బొమ్మకల్ బైపాస్ రోడ్డులో గల లారీ అసోసియేషన్ సమీపంలో కొంతమంది వ్యక్తులు డబ్బులు పందెంగా పెట్టి మూడు ముక్కల పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు కరీంనగర్ రూరల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని దాడి నిర్వహించారు.ఈ దాడిలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు.

బావు శ్రీశైలం, మహమ్మద్ మొహినొద్దీన్, హమ్మద్ సాజిద్, మహమ్మద్ అజీమొద్దీన్, మహమ్మద్ పాషా మహమ్మద్ షరీఫ్వారి వద్ద నుండి పేకాటకు ఉపయోగిస్తున్న రూ.15,730 నగదు 52 పేకాట ముక్కలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారిని అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేయడం జరిగింది. తదుపరి చట్టపరమైన చర్యల్లో తదుపరి వారిని న్యాయస్థానంలో హాజరుపరచడం జరుగుతుంది.

కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని ఏ గ్రామంలోనైనా పేకాట లేదా ఇతర జూద కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అవసరమైతే వారిపై హిస్టరీ షీట్లు కూడా తెరవడం జరుగుతుంది. ప్రజలు ఎక్కడైనా పేకాట లేదా ఇతర జూద కార్యకలాపాలు జరుగుతున్నట్లు గుర్తించినట్లయితే వెంటనే కరీంనగర్ రూరల్ పోలీసులకు సమాచారం అందించాలని కోరడమైనది. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుంది.

యాచారాన్ని మరో 'జవహర్ నగర్' చేస్తారా?

- నగర వ్యర్థాల తరలింపుకు ప్రభుత్వ కసరత్తు
- పచ్చని పంట పొలాల మధ్య కాలుష్య భూతం
- మండిపడుతున్న రైతులు, స్థానిక ప్రజలు

యాచారం, నవంబర్ 15(జనం సాక్షి) : ఇప్పటికే ఫార్మా సిటీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుల భూసేకరణతో ఉక్కిరిబిక్కిరవుతున్న యాచారం మండల ప్రజల నెత్తిన మరో పిడుగు పడనుంది. హైదరాబాద్ నగరంలోని జవహర్ నగర్ డంపింగ్ యార్డుపై భారాన్ని తగ్గించేందుకు, నగర చెత్తను శివారు ప్రాంతాలకు తరలించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో భాగంగా యాచారం మండల పరిధిలో డంపింగ్ యార్డు ఏర్పాటుకు అధికారులు స్థల పరిశీలన జరుపుతున్నారనే వార్తలు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతున్నా యి. పచ్చని పంట పొలాలు, ప్రశాంత వాతావరణానికి నిలయమైన యాచా రంలో నగర వ్యర్థాలను డంపింగ్ చేస్తే తమ బతుకులు ఆగమవుతాయని రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డు ఏర్పాటైతే భూగర్భ జలాలు పూర్తిగా విషపూరితమై సాగునీరు, తాగునీటికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు భరించలేని దుర్వాసన, దోమల బెడదతో శ్వాసకోశ మరియు అంటువ్యాధు లు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు భయపడుతున్నారు.



నిరుపయోగంగా స్థానిక యార్డులు

మండలంలోని 24 గ్రామాల్లో గతంలోనే లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన స్థానిక డంపింగ్ యార్డులు నిర్వహణ లేక నిరుపయోగంగా పడి ఉన్నాయి. వాటిని బాగు చేయకుండా, ఇప్పుడు ఏకంగా మహానగర చెత్తను తెచ్చి తమ నెత్తిన వేయాలని చూడటం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

బైక్‌పై వచ్చారు.. గొలుసు లాక్కెళ్లి

- 48 గంటల్లోనే పోలీసులకు చిక్కి
- 3 తులాల పుస్తెలతాడు అపహరించిన నిందితులు
- ఇద్దరు నిందితుల అరెస్టు రిమాండ్..
- పోలీసు బృందానికి ఉన్నతాధికారుల అభినందనలు

రంగారెడ్డి, నవంబర్ 15 (జనం సాక్షి):
నిర్మానుష్య రహదారి.. ఒంటరిగా నడుస్తున్న మహిళ.. రెప్పపాటులో బైక్‌పై దూసుకొచ్చి మెడపై కొట్టి బంగారు గొలుసుతో ఉడాయించిన దుండగులు. అయితే, వారి ఆటలు ఎంతోసేపు సాగలేదు. నేరం జరిగిన కేవలం 48 గంటల్లోనే ఇబ్రహీంపట్నం పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ఇద్దరు చైన్ స్నాచర్లను కటకటాల వెనక్కి నెట్టారు. నిందితుల పద్ద నుంచి చోరీకి గురైన 3 తులాల బంగారు పుస్తెల తాడును పూర్తిస్థాయిలో రికవరీ చేసి బాధితురాలికి ఊరటనిచ్చారు. అందుకు సంబంధించిన ఇబ్రహీంపట్నం సీఐ మహేందర్ రెడ్డి కథనం మేరకు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఇబ్రహీంపట్నం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఒక మహిళ రోడ్డుపై ఒంటరిగా నడుచుకుంటూ వెళ్తోంది. ఇదే అదునుగా భావించిన ఇద్దరు గుర్తుతెలియని దుండగులు బైక్‌పై వేగంగా వచ్చి, ఆమె మెడపై బలంగా కొట్టారు. ఆమె తేరుకునేలోపే మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల తాడును లాక్కొని క్షణాల్లో అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మహేందర్ రెడ్డి, తన క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఘటనా స్థలం పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పరిశీలించారు. సాంకేతిక ఆధారాలు, పాత నేరస్థుల కదలికలపై నిఘా పెట్టారు. పక్కా సమాచారంతో నేరం జరిగిన రెండు రోజుల్లోనే నిందితుల ఆచూకీని గుర్తించి చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా మంచాల గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ ఈర్లపల్లి కరుణాకర్ (28), మంచాల గ్రామానికే చెందిన డ్రైవర్ ఒరుగంటి శివప్రసాద్ అలియాస్ శివ అలియాస్ రజనీకాంత్ గౌడ్ (30) గా గుర్తించారు. వీరి వద్ద నుంచి 3 తులాల బంగారు పుస్తెల తాడును స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులిద్దరినీ అరెస్టు రిమాండ్ కు తరలించారు. కేసు నమోదైన అతి తక్కువ సమయంలోనే నిందితులను పట్టుకుని, బాధితురాలి సొత్తును రికవరీ చేసిన ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డితో పాటు క్రైమ్ సిబ్బంది యాదగిరి, రాజు, బాబు రావు, చంద్రశేఖర్, మధులను ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 నవంబర్ 2026

గుమ్మడిదలలో ఘనంగా ఛట్ పూజ వేడుకలు

- అస్తమిస్తున్న సూర్యుడికి అర్ఘ్యం సమర్పించిన భక్తులు
- 36 గంటల కఠిన ఉపవాసంతో ప్రత్యేక పూజలు



గుమ్మడిదల, నవంబర్ 15 (జనంసాక్షి) : దీపావళి పండుగ ముగిసిన ఆరో రోజున నిర్వహించే పవిత్ర ఛట్ పూజ వేడుకలు గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని బొంతపల్లి వార్డులో శనివారం ఘనంగా జరిగాయి. బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన కుటుంబాలు నాలుగు రోజులపాటు అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పండుగను నిర్వహించారు. సూర్యభగవానుడితో పాటు ఛఠీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించడం ఛట్ పూజ విశిష్టత. కుటుంబ సభ్యుల ఆరోగ్యం, సంతాన సౌభాగ్యం, కుటుంబ సంక్షేమం కోసం మహిళలు సుమారు 36 గంటలపాటు నీరు కూడా తాగకుండా కఠిన ఉపవాస దీక్ష చేపడతారు. నాలుగు రోజుల వేడుకల్లో భాగంగా మొదటి రోజు నహాయ్ ఖాయ్, రెండో రోజు ఖర్నా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో పూర్తి చేశారు. మూడో రోజు సాయంత్రం సంధ్యా అర్ఘ్యం నిర్వహించారు. ఈ సందర్భంగా వెదురు బుట్టల్లో ఠేకువా ప్రసాదం, అరటిపండ్లు, కొబ్బరికాయలు, చెరకు, ఇతర పండ్లను తీసుకొని భక్తులు చెరువు వద్దకు చేరుకున్నారు. నడుములోతు నీటిలో నిలబడి అస్తమిస్తున్న సూర్యభగవానుడికి పాలు, నీటితో అర్ఘ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. ఛఠీ మాత భక్తి గీతాలు ఆలపిస్తూ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉదయించే సూర్యుడితో పాటు అస్తమించే సూర్యుడికి కూడా అర్ఘ్యం సమర్పించడం ఛట్ పూజలోని ప్రత్యేకత అని నిర్వాహకులు తెలిపారు. జీవితంలో కష్టసమయాల్లోనూ కృతజ్ఞతాభావంతో ఉండాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సద్ది జైపాల్ రెడ్డి, వీరేందర్ సింగ్, పప్పు సింగ్, భగవాన్, ఆర్.ఎస్. పాండే, అజయ్ సింగ్, కౌశల్ శర్మతో పాటు మహిళలు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం

- అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలపై బహిరంగ చర్చకు సిద్ధం
- మండల కాంగ్రెస్ నాయకులు

బాలానగర్, నవంబర్ 15 (జనం సాక్షి) : పేదల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని బాలానగర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆదివారం బాలానగర్ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు మాట్లాడుతూ.. గత పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం జడ్చర్ల నియోజకవర్గాన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయిందని విమర్శించారు. అప్పటి పాలకులు శిలాఫలకాలు ఏర్పాటు చేసి, కొబ్బరికాయలు కొట్టి ప్రచారానికే పరిమితమయ్యారని, పనుల పూర్తిపై మాత్రం తగిన శ్రద్ధ చూపలేదని మాజీ మంత్రి లక్ష్మారెడ్డిని ఉద్దేశించి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి నాయకత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం, పారిశుద్ధ్యం, విద్యుత్ సౌకర్యాల మెరుగుదలతో పాటు



పేదలకు సంక్షేమ పథకాలు అందించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

హెచ్ఎండీఏ నిధులతో గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై బీఆర్ఎస్ నాయకులతో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేసే ముందు గత పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిన అభివృద్ధి ఏమిటో బీఆర్ఎస్ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు.

బాలానగర్ నుంచి గంగాపూర్ వరకు డబుల్ బీటీ రోడ్డు నిర్మాణ పనులు త్వరలోనే పూర్తవుతాయని వెల్లడించారు. బాలానగర్ మండలానికి నాలుగు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వీటి పూర్తితో మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా అందించలేకపోయారని, డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన పేదలకు పూర్తిస్థాయిలో పంపిణీ చేయడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు రేషన్ కార్డులు, సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు.

ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనపై అనవసర విమర్శలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. రాబోయే రెండేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శంకర్ నాయక్, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు కుమార్ నాయక్, టీపీసీసీ సమన్వయకర్త దత్తాత్రేయ, ఓబీసీ సెల్ అధ్యక్షుడు పొట్లపల్లి యాదయ్య, ఎస్సీ సెల్ నాయకులు, సర్పంచులు, వెంకటేశ్వర్ రెడ్డి, హరి సింగ్, కుమార్ నాయక్, రాంజీ నాయక్, డీజే శ్రీను, రాజు నాయక్‌తో పాటు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కంసానిపల్లికి గోపాలమిత్ర అధికారిని కేటాయించండి

- పశువైద్య సేవలు అందక మూగజీవాలు మృత్యువాత
- అధికారులకు గ్రామస్తుల విజ్ఞప్తి
- కోడెదూడ మృతితోనైనా స్పందించండి
- మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోండి

ఉప్పునుంతల, నవంబర్ 15 (జనం సాక్షి) : మండల పరిధిలోని కంసానిపల్లి గ్రామానికి గోపాలమిత్ర అధికారిని తక్షణమే కేటాయించి, పశువులకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్తులు పశుసంవర్ధక శాఖ అధికారులను కోరుతున్నారు. గ్రామంలో పశువైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కలమండల లక్ష్మయ్య (రామస్వామి కుమారుడు)కు చెందిన కోడెదూడ సరైన వైద్య సదుపాయం అందక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. పశువులకు అనారోగ్యం వచ్చినప్పుడు సకాలంలో వైద్యం అందకపోవడంతో మూగజీవాల ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.



ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోరా..?

గతంలో కూడా కంసానిపల్లి గ్రామానికి గోపాలమిత్ర అధికారిని కేటాయించాలని సంబంధిత అధికారులకు పలుమార్లు విన్నవించినట్లు గ్రామస్తులు తెలిపారు. సామాజిక మాధ్యమాల ద్వారా కూడా తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎలాంటి స్పందన, పరిష్కారం లభించలేదని అసహనం వ్యక్తం చేశారు. తమ విజ్ఞప్తులు అధికారులకు పట్టడం లేదని, సమస్య మాత్రం యథాతథంగా కొనసాగుతోందని వాపోయారు.

మూగజీవాలకు న్యాయం చేయాలని వేడుకోలు

ఇప్పటికైనా పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు స్పందించి కంసానిపల్లి గ్రామానికి గోపాలమిత్ర అధికారిని కేటాయించాలని, పశువులకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేశారు.

ఫాక్స్‌కాన్ కొలువుల కోసం యువత క్యూ

- ఫాక్స్‌కాన్ ఉద్యోగాల కోసం 1,000 మంది యువత పోటీ
- నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం
- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15 (జనం సాక్షి) : నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సుల్తాన్‌పూర్‌లోని జేఎన్‌టీయూ ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన ఉద్యోగ మేళాను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ప్రారంభించారు. ఫాక్స్‌కాన్ ఎలక్ట్రానిక్స్ సంస్థలో ఉద్యోగ అవకాశాల కల్పన కోసం ఎస్‌కేఎస్ఎస్ సంస్థ సహకారంతో ఈ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. యువత విద్యతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అంతర్జాతీయ స్థాయి సంస్థలు ముందుకు వస్తున్నాయని, ఆయా సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్యం కలిగిన మానవ వనరులు రాష్ట్రంలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఇలాంటి ఉద్యోగ మేళాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ ఉద్యోగ మేళాకు సుమారు వెయ్యి మంది యువతీ యువకులు హాజరై తమ పేర్లను నమోదు చేసుకున్నారు. మేళా నిర్వహణకు సహకరించిన ఎస్‌కేఎస్ఎస్ సంస్థ ప్రతినిధులను మంత్రి అభినందించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

యాదవుల ఆత్మగౌరవానికి ప్రతీక సదర్ సమ్మేళనం

- గుమ్మడిదలలో అట్టహాసంగా సదర్ వేడుకలు..
- దున్నపోతుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణ
- ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి,
- మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్



గుమ్మడిదల, నవంబర్ 15 (జనంసాక్షి) : యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు, ఐక్యతకు ప్రతీకగా నిలిచే సదర్ సమ్మేళనం గుమ్మడిదల మున్సిపల్ పరిధిలో శనివారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. యాదవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు యాదవ సోదరులు పెద్ద సంఖ్యలో హాజరై సందడి చేశారు. ఈ కార్యక్రమానికి సీజీఆర్ ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదర్ వేడుకలు యాదవుల ఆత్మగౌరవానికి, సామాజిక ఐక్యతకు ప్రతీకలని పేర్కొన్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పశుసంపద సంరక్షణతో పాటు వ్యవసాయ రంగానికి యాదవులు అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. వేడుకల్లో నిర్వహించిన దున్నపోతుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వివిధ రకాల అలంకరణలతో ముస్తాబైన దున్నపోతుల విన్యాసాలను తిలకించేందుకు ప్రజలు ఆసక్తి చూపించారు. యాదవ యువత ఉత్సాహం, సంప్రదాయ కళాత్మకతతో వేడుకలు పండుగ వాతావరణాన్ని సంతరించుకున్నాయి. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ చిమ్ముల సంధ్యా గోవర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ పద్మ వెంకటరామ్ రెడ్డి, నాయకులు పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, ఆకుల సత్యనారాయణ, యాదవ సంఘం నాయకులు బీరప్ప, బాల్‌రాజ్, నర్సింలు, బుచ్చయ్య, శ్రీకాంత్ (లడ్డు), బాబు, మురళి, సాయి, యశ్వంత్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

బిర్సా ముండా పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం

- సంగారెడ్డి జిల్లాలో జనజాతీయ గౌరవ దివస్ వేడుకలు
- గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను చాటిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 15 (జనం సాక్షి) : బిర్సా ముండా పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శం అని జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరీ దేవి పేర్కొన్నారు. భగవాన్ బిర్సా ముండా 151వ జయంతి, జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను ఆదివారం సంగారెడ్డి జిల్లా చౌట్కూర్ మండలం బొమ్మారెడ్డిగూడెం ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రామేశ్వరీ దేవి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వార్డు సభ్యురాలు భవాని అధ్యక్షత వహించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్థులు వీక్షించారు. అనంతరం విద్యార్థులు ఆదివాసీ గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కళలను ప్రతిబింబించేలా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా రామేశ్వరీ దేవి మాట్లాడుతూ.. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవం, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ కోసం బిర్సా ముండా చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. ఆయన త్యాగాలు, పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శమని పేర్కొన్నారు. గిరిజన వీరుల చరిత్రను, వారి గొప్ప వారసత్వాన్ని యువతకు తెలియజేయడమే జనజాతీయ గౌరవ దివస్ వేడుకల ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ అధికారి కార్యాలయ సిబ్బంది స్వాతి, రవీందర్, గ్రామ సర్పంచ్ జైపాల్ నాయక్, ఉపసర్పంచ్ రజనీబాయి, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, గిరిజన నాయకులు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

కుల మత బేధం లేకుండా అందరి సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

- నీలం మధు ముదిరాజ్
- పఠాన్‌చెరు ఛట్ పూజలో పాల్గొన్న నీలం



పటాన్‌చెరు, నవంబర్ 15 (జనం సాక్షి) : కులమత బేధం లేకుండా అందరూ సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్ నీలం మధు అన్నారు. ఆదివారం పటాన్చెరు సాకి చెరువు వద్ద నిర్వహించిన చట్ పూజ వేడుకల్లో ఆయన పాల్గొని ఉత్తర ప్రాంత ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరాగాంధీ హయాంలో పటాన్‌చెరు ప్రాంతంలో పరిశ్రమల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వడంతో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎంతోమందికి ఇక్కడ ఉపాధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. ఉపాధి కోసం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు పటాన్‌చెరును తమ సొంత ప్రాంతంగా భావిస్తూ ఇక్కడే స్థిరపడ్డారని అన్నారు. వారి కష్టం, శ్రమతోనే నేడు పటాన్‌చెరు పారిశ్రామికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతోందని గుర్తు చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని కొనియాడారు.ఛట్ పూజ సందర్భంగా ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రజలందరికీ సూర్యభగవానుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయుసి జిల్లా అధ్యక్షులు, పటాన్ చెరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కొల్కురి నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ ఫోటోకాల్ చైర్మన్ పట్లోళ్ల ఆదిత్య రెడ్డి, జలగరి ఎట్టయ్య, నిర్వాహకులు మున్నా యాదవ్, కిషన్, నేతాజీ, బలం సింగ్, షారుక్, లాలన్,ప్రమోద్, వికాస్, గౌతమ్, సాగర్, నాయకులు రవి, వెంకటేష్, శ్రీను, రాజు, సాయి, భక్తులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

- బాలికలు నిర్భయంగా ఫిర్యాదు చేయాలి
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 15 (జనం సాక్షి) : జిల్లాలో మహిళలు, యువతులు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని,వారి రక్షణ కోసం షీ టీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా పనిచేస్తున్నారని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, బాలికలు ఈవ్ టీజింగ్,ఆకతాయిల వేధింపులు, ర్యాగింగ్, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర అన్యాయాలకు గురైతే భయపడకుండా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని ఎస్పీ సూచించారు.పాఠశాలలు, కళాశాలలు, బస్టాండ్లు, పార్కులు, కార్యాలయాలు, గ్రామాలు, కాలనీలు తదితర ప్రాంతాల్లో ఎలాంటి వేధింపులు ఎదురైనా వెంటనే షీ టీమ్స్‌కు సమాచారం అందించాలని కోరారు. మైనర్ బాలికలను వేధించడం, అసభ్యంగా ప్రవర్తించడం,సోషల్ మీడియా ద్వారా అసభ్య సందేశాలు పంపడం, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలతో



బ్లాక్‌మెయిల్ చేయడం, వెంటాడటం వంటి చర్యలకు పాల్పడితే నిందితులపై పోక్సో తదితర సంబంధిత చట్టాల కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలపై జరిగే ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో స్వీకరించి విచారణ చేపడతామని స్పష్టం చేశారు.గృహహింసకు గురవుతున్న మహిళలు కూడా మౌనంగా బాధపడకుండా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులకు న్యాయం అందించేందుకు పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాలు, పాఠశాలలు, కళాశాలల్లో మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో అపరిచితులతో వ్యక్తిగత వివరాలు పంచుకోవద్దని,వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు పంపేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు,ఖాతాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు.మహిళలు, బాలికలు నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లలేని పరిస్థితుల్లో షీ టీమ్స్ హెల్ప్‌లైన్ నంబర్ 8712670398 లేదా డయల్ 100 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ భరోసా ఇచ్చారు.

గ్రీన్ రన్ ఫెస్ట్‌లో జడ్చర్ల రన్నర్ల సత్తా



జడ్చర్ల, నవంబర్ 15 (జనంసాక్షి) : చేగూర్‌లోని కన్హా శాంతివనంలో ఆదివారం నిర్వహించిన గ్రీన్ హెల్త్ అండ్ వెల్‌నెస్ రన్ ఫెస్ట్--2026 5వ ఎడిషన్ ఉత్సాహభరితంగా ముగిసింది. వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2 వేల మంది పాల్గొన్న ఈ పోటీల్లో (1కే, 5కే, 10కే, 21కే) జడ్చర్ల రన్నర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. యువకులతో పాటు వృద్ధులు సైతం వయసును లెక్కచేయకుండా పరుగెత్తి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. 21 కిలోమీటర్ల విభాగంలో రన్నర్లు 2 గంటల 45 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నారు. విజేతలకు రామకృష్ణ, గోపాల్ మెడల్స్ అందజేసి అభినందించారు.



పెరిగిన బియ్యం ధరలను అదుపు చేయాలి

- రేషన్ దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలి
- 17న హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ధర్నాలు
- సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు

హనుమకొండ జిల్లా ప్రతినిధి, నవంబర్ 15 (జనంసాక్షి) : రాష్ట్రంలో విపరీతంగా పెరిగిపోయిన బియ్యం, నిత్యావసర సరుకుల ధరలను ప్రభుత్వం తక్షణమే అదుపు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ బాలస ముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జరిగిన హనుమకొండ జిల్లా, సిపిఐ శాఖ కార్యదర్శుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశానికి నెడినూరి రాజమౌళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ.. మార్కెట్లో బియ్యం ధరలు ఆకాశాన్ని అంటడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరల వల్ల పేద ప్రజల బతుకు భారంగా మారిందని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి బియ్యం ధరల నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాలని, బ్లాక్ మార్కెటింగ్‌ను అరికట్టాలని కోరారు.బియ్యం తదితర నిత్యవసర వస్తువులను అక్రమంగా నిలువ చేసిన వ్యాపారస్తులపై పిడి ఆక్ట్ పెట్టి అరెస్టు చేసి చట్టప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. బియ్యం ధరలు నియంత్రించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 17న హనుమకొండ జిల్లా వ్యాప్తంగా తహసిల్దార్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపట్టనున్నట్లు సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి తెలిపారు ఈ సమావేశంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు అధరి శ్రీనివాస్,జిల్లా సహాయ కార్యదర్శి మధేల యెల్లేష్ వివిధ మండలాల మరియు పట్టణ శాఖ కార్యదర్శులు, అశోక్ స్టాలిన్,మాలోతు శంకర్, బత్తిని సదానందం,దుప్పటి సాంబయ్య, కొట్టిపాక రవి,జక్కు రాజు గౌడ్,వేల్పుల సారంగపాణి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న పేదలకు ఆత్మబంధువు ఎల్‌వోసీ

- రూ.2,50,000 లక్షల ఎల్ఓసి అందజేసిన భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



టేకుమట్ల నవంబర్ 15 (జనంసాక్షి) : భూపాలపల్లి నియోజకవర్గం, టేకుమట్ల మండలంలోని ఆశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన జెట్టి రాజేందర్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టేకుమట్ల మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు తిప్పిరెడ్డి కృష్ణారెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు మోతే రాజమౌళి, బాధిత కుటుంబానికి సహాయం అందించాలని భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ను సంప్రదించారు. ఈ విషయంపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, మానవతా దృక్పథంతో బాధిత కుటుంబానికి అండగా నిలుస్తూ అత్యవసర వైద్య చికిత్సల నిమిత్తం రూ. 2,50,000 (రెండున్నర లక్షల రూపాయల) విలువైన ఎల్ ఓ సి మంజూరు చేయించారు. ప్రజలకు కష్టం వచ్చినప్పుడు నేనున్నానంటూ భరోసా కల్పిస్తూ, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే తన బాధ్యతగా భావిస్తూ ఎమ్మెల్యే తీసుకున్న ఈ తక్షణ నిర్ణయం అభినందనీయం. అధిక ఖర్చుతో కూడిన వైద్యం చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేయడం ద్వారా ప్రజాప్రతినిధిగా తన బాధ్యతను నిర్వర్తించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొయ్యల చిరంజీవి, సర్పంచ్ జక్కుల కుమార్, ఉపసర్పంచ్ మారం రామచంద్రారెడ్డి, వేషాల కృష్ణ, కొట్టే సంపత్, పలువురు నాయకులు, పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం



- నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి
- చెన్నారావుపేటలో లబ్ధిదారులకు నూతన పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ

చెన్నారావుపేట, నవంబర్ 15 (జనం సాక్షి) : అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చెన్నారావుపేట మండలంలోని 691 మంది నూతన పెన్షన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. నర్సంపేట నియోజకవర్గ పరిధిలో మొత్తం 4900 మంది లబ్ధిదారులకు నూతన పెన్షన్లను మంజూరు చేసినట్లు తెలిపారు.పరిశీలన దశలో మరొక 400 ఉన్నట్లు పేర్కొన్నారు. పెన్షన్లు రానివారు ఎవరు ఆందోళన చెందవద్దని విడతల వారీగా అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తామని తెలిపారు. ఈ

కార్యక్రమంలో నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, తహసిల్దార్ మహమ్మద్ ఆబిద్ అలీ, ఎంపీడీవో వెంకట సాయి శివానంద్, చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, చెన్నారావుపేట, అమీనాబాద్ సొసైటీ చైర్మన్ లు భూక్య గోపాల్ నాయక్, మొగిలి వెంకట్ రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరా రెడ్డి, జిల్లా కార్యదర్శి కంది క్రిష్ణ చైతన్య రెడ్డి, స్థానిక సర్పంచ్ కంది శ్వేత క్రిష్ణ చైతన్య రెడ్డి, యూత్ మండల అధ్యక్షులు బండి హరీష్, గిర్దావర్ మహమ్మద్ రషీద్, మండల కమిటీ నాయకులు, సొసైటీ డైరెక్టర్ లు, మార్కెట్ డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, ఆయా గ్రామాల కాంగ్రెస్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్లు, కాంగ్రెస్ అనుబంధ సంఘాల నాయకులు, యువజన

భక్తులతో కోలాహలంగా మారిన హేమాచల క్షేత్రం





- హరినామస్మరణతో మార్మోగిన ఆలయ ప్రాంగణం

మంగపేట, నవంబర్ 15(జనంసాక్షి) : మండలంలోని మల్లూరు శ్రీ హేమాచల కొండలపై స్వయంభుగా వెలసిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి ఆదివారం కావడంతో భక్తులు హేమాచల క్షేత్రానికి అధిక సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం అంతా భక్తులతో కోలాహలంగా మారి హేమాచల క్షేత్రమంతా హరి నామస్మరణతో మార్మోగింది. స్వామివారిని దర్శించుకోవడం కొరకు భక్తులు సుదూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనార్థమై వివిధ జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో వచ్చారు. భక్తులు ముందుగా చింతామణి జలధారల వద్ద పుణ్య స్నానాలు ఆచరించి జలాంజనేయస్వామిని, పంచముఖాంజనేయ స్వామిని, రమ సత్యనారాయణ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై స్వయంభుగా వెలసి విరాజిల్లుతున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామిని పక్కనే కొలువుదీరిన ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి మూలవిరాటకు అర్చకులు ముక్కామల రాజశేఖరశర్మ, కారంపూడి పవన్ కుమారాచార్యులు, ఏడునూతన ఈశ్వరచంద్ రామానుజన్ శర్మ, ముక్కామల వెంకటనారాయణ శర్మ, అనిపెద్ది రాజీవ్ నాగశర్మ లు తిలా తైలాభిషేకాలు చేసి నూతన పట్టు వస్త్రాలు, గజమాలతో సుందరంగా అలంకరించి భక్తులకు దైవ దర్శనం గావించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను ఈవో వీరాస్వామి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సీతారాములు, శేషు, అజయ్, నాగార్జున్, మహేష్, పుల్లయ్య లు పాల్గొన్నారు.

విద్యారంగ సంస్కరణలపై సీఎం విద్యార్థి సంఘాలతో చర్చించాలి

- విద్యారంగంలో సంస్కరణలపై ఏకపక్ష నిర్ణయాలు సరికాదు
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్



హనుమకొండ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 (జనంసాక్షి) : విద్యారంగ సంస్కరణలపై సీఎం విద్యార్థి సంఘాలతో చర్చించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. ఆదివారం ఏఐఎస్ఎఫ్ హన్మకొండ జిల్లా సమితి సమావేశం బాలసముద్రంలోని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు ప్రణీత్ గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించగా. ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. ఈ సందర్బంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై విద్యారంగంలో తీసుకువస్తున్న సంస్కరణలపై విద్యాశాఖ మంత్రి , సీఎం రేవంత్ రెడ్డి విద్యార్థి సంఘాలు, విద్యావేత్తలు, మేధావులు, ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో సమావేశం నిర్వహించి అభిప్రాయ సేకరణ నిర్వహించాలని, రాష్ట్రంలో విద్యారంగం పై ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందని అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోను ఎన్నికల మ్యానిఫెస్టోలో మండలానికో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని చెప్పి నేడు ఇంటర్ బోర్డును రద్దు చేసి పాఠశాల విద్యలో విలీనం చేస్తున్నట్లు హఠాత్తుగా ఎలాంటి అభిప్రాయాలు చర్చ లేకుండా ప్రకటించడం వల్ల విద్యార్థులు గందరగోళానికి గురవుతున్నారని, ఇప్పటికే పాఠశాల విద్యా గందరగోళంగా ఉందని సరిపడ తరగతి గదులు, మౌలిక సదుపాయాలు లేవని ఇప్పుడు పాఠశాల విద్యలో ఇంటర్ ను విలీనం చేయడం వల్ల సమస్యలు పెరిగే అవకాశం ఉందని,ఇంటర్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయడం ద్వారా ఉన్న ప్రభుత్వ కళాశాల భవనాలల్లో ఏ విద్య ఉంటుంది? ప్రభుత్వ పాఠశాలల్లో ఏ విధంగా ఇంటర్ తరగతుల నిర్వహణ చేస్తారు? ఒకే చోట 1నుండి 12వ తరగతి వరకు తరగతుల నిర్వహణ కాబట్టి బోధన సిబ్బంది అర్హతలు ఎలా ఉండాలి ఈ విధానం హడావుడిగా తీసుకోవడం ద్వారా ప్రైవేట్ కార్పొరేట్ వారికి మేలు జరుగుతుందని తప్ప ప్రభుత్వ విద్యకు నష్టం జరిగే అవకాశం ఉందని అన్నారు.

ప్రతి ధాన్యపు గింజకు మద్దతు ధర కల్పిస్తాం

- రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..
- బుర్రకాయలగూడెంలో వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం..



జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి): ప్రతి ధాన్యపు గింజకు మద్దతు ధర కల్పిస్తామని, రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం బుర్రకాయలగూడెం గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించేలా చర్యలు తీసుకుంటుందన్నారు. రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని, రైతుల కష్టానికి తగిన గౌరవం, గిట్టుబాటు ధర అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. వరి కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ధాన్యం తేమ శాతం, తూకం, నాణ్యత పరిశీలనలో పూర్తి పారదర్శకత పాటించాలని, రైతుల నుంచి ఎలాంటి అక్రమ వసూళ్లకు తావులేకుండా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో చెల్లింపులు జరిగేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పిఎసిఎస్ చైర్మన్లు, వ్యవసాయ శాఖ అధికారులు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మండల పార్టీ అధ్యక్షుడు, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో సరైన దారి చూపించేవి పుస్తకాలే

- జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్రప్రసాద్



మహబూబాబాద్, నవంబర్ 15(జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ,59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి పసునూరి రాజేంద్ర ప్రసాద్ రిబ్బన్ కట్ చేసి పుస్తక ప్రదర్శన ప్రారంభించారు. ఈ సందర్భంగా డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ స్పర్ధయ వర్ధతే విద్య, అని చిరిగిన చొక్కా అయినా వేసుకో కానీ ఒక మంచి పుస్తకాన్ని మాత్రం కొనుక్కోవాలనే మహానుభావుల మాటలను గుర్తు చేస్తూన్నారు, జీవితంలో సరైన దారి చూపించే పుస్తకాలు మాత్రమే అని అన్నారు. ప్రసార మాధ్యమాలు వేగవంతంగా సమాచారాన్ని క్షణకాలంలో అందిస్తున్నప్పటికీ, మానవుని మేధో వికాసానికి పుస్తకమే పునాది అని అంటూ, చిన్నతనం నుంచి పిల్లలలో పుస్తక పఠనం అలవాటు పెంపొందిస్తే వారు కేవలం పరీక్షలో మార్కులు సాధించే విద్యార్థులుగా కాకుండా ప్రశ్నించే, ఆలోచించే, సృజనాత్మకంగా స్పందించే పౌరులుగా ఎదుగుతారు అని అంటూ పుస్తక పఠన సంస్కృతి పెరిగితేనే విజ్ఞాన సమాజ నిర్మితమవుతుంది, విజ్ఞాన సమాజమే దేశాభివృద్ధికి నిజమైన పునాది కాబట్టి ప్రపంచాన్ని మార్చే శక్తి పుస్తకానికి మాత్రమే ఉంది, మంచి వ్యక్తిత్వం ,మంచి సమాజం పుస్తకాల ద్వారానే ఏర్పడుతుందని అన్నారు. కావున పుస్తక పఠనానికి గ్రంథాలయాలే పునాదులు అని అన్నారు, ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్లు జి. విజేందర్, రుద్రారపు వీరేందర్, సిబ్బంది బొడ్డుపల్లి భూలక్ష్మి, బి. యాదమ్మ గ్రంథాలయ పాఠకులు హరిలాల్, ఆర్ సి. విజ్ఞాన్, అనూప్ సూరజ్, మౌనిక ,కవిత, సరిత పుస్తక ప్రియులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కార్తీక దీపోత్సవం నిర్వహణకు కలెక్టర్ ప్రశంసలు

- ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం: కలెక్టర్ రాజర్షి షా



గుడియత్నూర్ నవంబర్ 15 (జనంసాక్షి): సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో హిందూ ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం కార్తీక మాసాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న కార్తీక దీపోత్సవం కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లు, వివరాలను కలెక్టర్‌కు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ ధార్మిక, సాంస్కృతిక సంప్రదాయాలను పరిరక్షిస్తూ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సమితి కోశాధికారి సంతోష్ అగర్వాల్ పాల్గొన్నారు.

23 కిలోల బెల్లం, 4 కిలోల పటిక పట్టివేత

- 26 లీటర్ల గుడుంబా స్వాధీనం...
- ముగ్గురి పై కేసు నమోదు...
- చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్...

చెన్నారావుపేట, నవంబర్ 15 (జనం సాక్షి): 27 కిలోల బెల్లం, 4 కిలోల పటికను పట్టుకొని 26 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకొని ముగ్గురి పై కేసు నమోదు చేసినట్లు చెన్నారావుపేట ఎస్సై పొన్నాల గోవర్ధన్ ఆదివారం తెలిపారు. చెన్నారావుపేట మండలంలోని లింగాపురం గ్రామ శివారు మేఘ్య తండాలో గుడుంబా విక్రయిస్తున్నారన్న నమ్మదగిన సమాచారముతో అదే తండాకు చెందిన అజ్మీర శ్రీను వద్ద 5 లీటర్ల గుడుంబా, 23 కిలోల బెల్లం, 4 కిలోల పటిక, అజ్మీర కిషన్ వద్ద 15 లీటర్ల గుడుంబా, లావుద్య లక్ష్మి వద్ద 6 లీటర్ల గుడుంబాను పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గుడుంబా తయారు చేస్తూ అమ్మకాలు చేపడుతున్న అజ్మీర శీను, కిషన్, లావుద్య లక్ష్మీల పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోవర్ధన్ తెలిపారు.

జిల్లా అధ్యక్షుడిగా ఇస్లావత్ లచ్చిరాం నాయక్

- జిల్లా గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం



మహబూబాబాద్,నవంబర్ 15(జనంసాక్షి): మహబూబాబాద్ జిల్లా గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఇస్లావత్ లచ్చిరాం నాయక్ వరుసగా ఐదవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సంఘం కౌన్సిల్ సమావేశంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ప్రస్తుత జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ లచ్చిరాం నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందుల శ్రీరాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడిగా ఐదవసారి ఎన్నికైన ఇస్లావత్ లచ్చిరాం నాయక్ మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన జిల్లా ప్రధానోపాధ్యాయులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరికీ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. సంఘ ఐక్యతను మరింత బలోపేతం చేస్తూ ప్రధానోపాధ్యాయుల హక్కులు, సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు. నూతన కమిటీలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా తానంచెర్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనితా దేవి, కోశాధికారిగా తాళ్లపూసపల్లి ప్రధానోపాధ్యాయులు కనకయ్య, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా కల్వాల ప్రధానోపాధ్యాయులు నరేందర్, చిట్యాల ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ ఎన్నికయ్యారన్నారు. ఈ సమావేశంలో సంఘం నాయకు తుమ్మ వెంకటేశ్వర్లు, సమ్మెట వెంకటేశ్వర్లు, వాంకుడోత్ బాలాజీ, వెంకటేశ్వర్లు, వివిధ మండలాల విద్యాశాఖ అధికారులు, జిల్లాలోని పలువురు గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 నవంబర్ 2026

చెరువు బోర్ల సీజ్ ఎప్పుడు..?

- అధికారుల హడావుడి కంటితుడుపేనా!
- పత్రికల్లో వార్తలు రాగానే తూతూమంత్రంగా విచారణ
- సీజ్ చేస్తామని చెప్పి రోజులు గడుస్తున్నా కానరాని చర్యలు
- తాజాగా చెరువు వద్ద ఇరువర్గాల మధ్య పంచాయతీ
- క్షేత్రస్థాయిలో అక్రమార్కులకు వత్తాసు పలుకుతున్నారా..?
- గ్రామస్తుల నిలదీత

మాడుగులపల్లి, నవంబర్ 15 (జనం సాక్షి) : నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కోయలపాడు గ్రామంలోని చెరువు శిఖం భూముల కబ్జా, అక్రమ బోర్ల తవ్వకం వ్యవహారం రోజురోజుకూ తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తోంది. చెరువు భూములను ఆక్రమించి అక్రమంగా బోర్లు వేశారంటూ గ్రామస్తుల ఆరోపణల నేపథ్యంలో గతంలో పత్రికల్లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. వార్తలు రాగానే హడావుడిగా రంగంలోకి దిగిన సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి అక్రమ బోర్లను తక్షణమే సీజ్ చేస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధికారులు హామీ ఇచ్చి రోజులు గడుస్తున్నా నేటికీ ఒక్క బోరును కూడా సీజ్ చేయకపోవడం వెనక అంతర్యమేంటని గ్రామస్తులు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.

చర్యలు శూన్యం.. పంచాయతీల తంతు!

అధికారుల ఉదాసీనత కారణంగా అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు బోర్లను సీజ్ చేసి ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటంతో, తాజాగా ఈ వివాదంపై చెరువు వద్ద ఇరు వర్గాల మధ్య పంచాయతీ జరిగినట్లు సమాచారం పత్రికల్లో వార్తలు వచ్చినప్పుడు హడావుడి చేయడం, ఆ తర్వాత చర్యలను గాలికొదిలేసి తెరవెనుక పంచాయతీలకు ఆస్కారం కల్పించడంపై



సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉన్నతాధికారుల జోక్యానికి డిమాండ్

చెరువు శిఖం భూములు ఆక్రమణకు గురైతే పశువుల మేతకు, సాగునీటి వనరులకు తీవ్ర విఘాతం కలుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కేవలం విచారణల పేరుతో కాలయాపన చేయకుండా, జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి కోయలపాడు చెరువులోని అక్రమ బోర్లను వెంటనే సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కిందిస్థాయి సిబ్బంది తీరుపై విచారణ జరిపి, కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పూసలపాడు, గాజులాపురం పరిధిలో ఆగని వరి కొయ్యల దహనం

- పొగతో వాహనదారులకు ప్రాణసంకటం

మాడుగులపల్లి, నవంబర్ 15 (జనం సాక్షి) : మండలంలోని పూసలపాడు మరియు గాజులాపురం రెవెన్యూ పరిధిలో వరి కోతల అనంతరం కొయ్యలను తగలబెట్టడం యథేచ్ఛగా కొనసాగుతోంది పంట వ్యర్థాలు కాల్చవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వ్యవసాయ రెవెన్యూ శాఖల అధికారులు పలుమార్లు అవగాహన



కార్యక్రమాలు నిర్వహించినా కొందరు రైతులు పట్టించుకోవడం లేదు పొలాలకు ఒకేసారి నిప్పు పెట్టడంతో దట్టమైన పొగ సమీప రహదారులపైకి వ్యాపించి వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ప్రయాణికులు పొగ కారణంగా ఊపిరి పీల్చుకోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు ఏ క్షణమైనా భారీ రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు మంటల వల్ల తీవ్ర వాయు కాలుష్యంతో పాటు భూసారం కూడా దెబ్బతింటోంది. నిబంధనలను బేఖాతరు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై అధికారులు వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు "పిల్లల ప్రజావాణి" కార్యక్రమం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



ఖమ్మం కార్పొరేషన్, నవంబర్ 15 (జనం సాక్షి) : నేడు (సోమవారం) పిల్లలు, ముఖ్యంగా బలహీన, వెనుకబడిన వర్గాలకు చెందిన పిల్లలు తమ సమస్యలు, ఫిర్యాదులు, వారి హక్కులకు సంబంధించిన అంశాలను జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకువచ్చేందుకు పిల్లల ప్రజావాణి కార్యక్రమం ఒక ప్రత్యేక వేదికగా ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లల ప్రత్యేక ప్రజావాణి సందర్భంగా పిల్లల భద్రత, రక్షణ, విద్య, ఆరోగ్యం, పోషణ, అభివృద్ధి, బాలల హక్కులకు సంబంధించిన సమస్యలు స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపి సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. పిల్లల ప్రజావాణి కార్యక్రమం కోసం ప్రత్యేక డెస్క్ ఏర్పాటు చేయబడుతుందని, కార్యక్రమంలో పిల్లలకు సురక్షితమైన, స్నేహపూర్వకమైన వాతావరణం కల్పిస్తూ, వారి గౌరవం, గోప్యత కు పూర్తి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. సంబంధిత అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పిల్లలకు సంబంధించిన సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, తమ ఫిర్యాదులు, సమస్యలను నేడు కలెక్టరేట్, ఖమ్మంలో నిర్వహించే పిల్లల ప్రజావాణిలి ప్రత్యేక డెస్క్‌లో తెలియజేయవలసిందిగా జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కల్లూరు ఎన్ఎస్పి క్రాస్ రోడ్‌లో వాహనాల తనిఖీ

కల్లూరు, నవంబర్ 15 (జనం సాక్షి) : కల్లూరు ఎన్ఎస్పి తిరువూరు క్రాస్ రోడ్ సమీపంలో లో పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్న సందర్భంలో అనుమానాస్పదంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న బంగారం వెండి ఆభరణాలు దొంగను పోలీసులు ఆదివారం చాకచక్యంగా పట్టుకున్నట్లు సిఐ సర్వయ్య తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కల్లూరు మున్సిపాలిటీ ఖాన్ ఖాన్ పేట సమీపాన ఎన్ఎస్పీ తిరువూరుక్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక వ్యక్తి అనుమానస్పదంగా పోలీసులను చూసి పారిపోతుండగా వెంటపడి పట్టుకున్నారు. నిందితుని ప్రశ్నించగా ఖాన్ ఖాన్ పేట లోని అజ్మీర నరసింహ ఇంటి తాళం చేయి తీసుకొని తాళం తీసి లోపలకు చొరపడి సుమారు 12 గ్రాముల బంగారు ఆభరణాలు, 230 గ్రాముల వెండి ఆభరణాలు చోరీ చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. నిందితుడు చోరీ చేసిన ఆభరణాలతో పాటు నేరానికి



ఉపయోగించిన హీరో గ్లామర్ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటల సమయంలో కల్లూరులో ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో సిబ్బంది ఎన్.ఎస్.పి. ఎక్స్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా, ఒక వ్యక్తి ద్విచక్ర వాహనంపై తిరువూరు వైపు వెళ్తూ పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా సిబ్బంది వెంబడించి పట్టుకున్నారు. పంచుల సమక్షంలో అతన్ని విచారించగా తన పేరు భరోతు నాగ వెంకటేశ్వర్లు అలియాస్ చంటి రెస్టారెంట్ సప్లయర్‌గా పనిచేస్తున్నట్లు నిందితుడు తెలియజేశారని పేర్కొన్నారు. చోరీ చేసిన సొత్తులో ఒక జత బంగారు జూకాలను కల్లూరు విజయకృష్ణ ఫైనాన్స్ లో తనఖా పెట్టి రూ. 30,000/- తీసుకున్నట్లు, మిగిలిన ఆభరణాలను ద్విచక్ర వాహనం ట్యాంక్ కవర్లో దాచి తిరువూరులో అమ్ముకునేందుకు తరలిస్తుండగా పట్టుబడినట్లు వెల్లడించారు. పోలీసులు ఫైనాన్స్ బంగారం రికవరీ చేసినట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ నంబర్ లేని హీరో గ్లామర్ బైక్ ను బంగారం వెండి నగలు స్వాధీనం చేసుకొని. నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు సిఐ పంజాల సర్వయ్య తెలిపారు. చాకచక్యంగా దొంగను పట్టుకున్న ఎస్సై నాగరాజు, పోలీస్ సిబ్బందిని సిపి సునీల్ దత్, సీఐ సర్వయ్య అభినందించారు.

నీటి పొదుపు భవిష్యత్తుకు మదుపు

- ప్రతి ఇంటికీ 'ఇంకుడు గుంత' తప్పనిసరి
- కఠిన నిబంధనలు, ప్రజల భాగస్వామ్యంతోనే మార్పు సాధ్యం

మణుగూరు, నవంబర్ 15 (జనం సాక్షి) : చలికాలములో వేసవి కాలం తలపిస్తోంది. ఏదైనా సమస్య వస్తే ముందస్తు చర్యలు తీసుకోవాలని మనమే అంటాము కానీ భవిష్యత్తు లో నీరు లేక గొంతు ఎండిపోతే అప్పుడు గుర్తుకొస్తాయి. ఎవరికి వారు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు.. భవిష్యత్తులో బోర్లు ఎండిపోయి, నీటి ట్యాంకర్ల కోసం జనం పడిగాపులు కాయడం ఖాయం. వర్షాకాలంలో కురిసే ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టకపోతే భవిష్యత్తులో నీటి యుద్ధాలు తప్పవని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. నాయకుల ప్రసంగాలు,



అధికారుల ప్రకటనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్న వేళ, ప్రతి ఇంట్లో 'ఇంకుడు గుంత' ఏర్పాటును ఒక ఉద్యమంలా, కఠిన నిబంధనలా అమలు చేయాల్సిన సమయం ఆసన్నమైంది.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత

కేవలం అవగాహన సదస్సులతో ప్రజల్లో మార్పు రాదని ఇప్పటికే రుజువైంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, స్థానిక సంస్థలు ప్రజలు కలిసికట్టుగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. కొత్తగా ఇల్లు కట్టుకునేవారు ప్లాన్ అప్రూవల్ సమయంలోనే ఇంకుడు గుంత నిర్మాణాన్ని తప్పనిసరి చేయాలి.

ఉపాధి హామీ పథకం అనుసంధానం

గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పేద, మధ్యతరగతి ఇళ్ల వద్ద ప్రభుత్వమే ఉచితంగా ఇంకుడు గుంతలను తవ్వించి ఇవ్వాలి. పెద్ద అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు, పాఠశాలలు ప్రభుత్వ కార్యాలయాల్లో కచ్చితంగా ఇంకుడు గుంతలు ఉండేలా గడువు విధించాలి. గడువు లోపు నిర్మించకపోతే భారీ జరిమానాలు విధించాలి.

ఎల్‌నినో ప్రభావంతో గోదావరిలో తగ్గుతున్న నీటి ప్రవాహాలు

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



అశ్వాపురం, నవంబర్ 15 (జనంసాక్షి) : ఎల్‌నినో ప్రభావంతో గోదావరి నదిలో నీటి ప్రవాహాలు తగ్గుతున్న నేపథ్యంలో రానున్న వేసవిలో తాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగా దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, ఇరిగేషన్ శాఖ అధికారులతో కలిసి మంత్రి సందర్శించారు. ఈ కార్యక్రమంలో అమ్మగారి పల్లి సర్పంచ్ కవిత ఇరిగేషన్ శాఖ ఎస్ఈ మహేశ్వరరావు, ఈఈ రాంబాబు, ఇతర అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పాల్వంచ కేటీపీఎస్ ఏడవ దశలో విషాదం

- విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తూ ఆర్టిజన్ కార్మికుడు మృతి



కొత్తగూడెం క్రైమ్, నవంబర్ 15 (జనం సాక్షి) : పాల్వంచ కేటీపీఎస్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. విధుల్లో భాగంగా కోల్ ప్లాంట్ వద్ద పనిచేస్తున్న వెంకటేశ్వర్లు అనే ఆర్టిజన్ కార్మికుడు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక పోలీసులకు బాధితురాలైన భార్య చేసిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి... పాల్వంచ వెంకటేశ్వర హిల్స్ కాలనీకి చెందిన పెంబల వెంకటేశ్వర్లు (50) కేటీపీఎస్‌లో ఆర్టిజన్ గ్రేడ్-2గా గత 8 సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. కాగా, ఆదివారం ఉదయం యథావిధిగా డ్యూటీకి వెళ్లిన ఆయన, మధ్యాహ్నం సుమారు 12:40 గంటల సమయంలో కేటీపీఎస్ 7వ స్టేజ్ కోల్ ప్లాంట్ వద్ద విధులు నిర్వహిస్తుండగా.ట్రక్ ఆఫర్ టైప్ డీఆడీ= వ్యాగన్స్ ద్వారా వచ్చిన కోల్ ఆన్ లోడ్ చేసే క్రమంలో, తన తోటి ఉద్యోగికి ఎయిర్ పైప్ అందించి. మరో వ్యాగన్ బాక్స్ వద్దకు ప్లాట్‌ఫాం పైనుంచి నడుచుకుంటూ వెళ్తుండగా ప్రమాదవశాత్తూ ఆయనకాలుజారింది. ప్లాట్‌ఫాంకు ఉన్న గ్రిల్ కు, టైస్ వ్యాగన్ బాక్స్ మధ్యలో పడి ఇరుక్కుపోవడంతో ఆయన కుడి చేయికి, తుంటి భాగంలో బలమైన గాయాలయ్యాయి. అది గమనించిన తోటి ఉద్యోగులు కాకారాల సుబ్బారావు, గడ్డం సత్యనారాయణ, బోడ రాములు వెంటనే ఆయన్ను బయటకు తీసి, చికిత్స నిమిత్తం పాల్వంచలోని కేటీపీఎస్ హాస్పిటల్‌కు తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ అకస్మిక ప్రమాదంపై కుటుంబ సభ్యులకు ఎవరిపైనా ఎలాంటి అనుమానం లేదని, విచారించి తగినన్యాయం చేయాలని ఫిర్యాదులో కోరారు. కార్మికుడి మృతితో కేటీపీఎస్ కార్మిక వర్గంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.

పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ, నవంబర్ 15 (జనంసాక్షి) : పేదల సంక్షేమమే ప్రజా ప్రభుత్వం ప్రధాన లక్ష్యం అని శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఆదివారం నాడు మిర్యాలగూడ మున్సిపాలిటీ పరిధిలో నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం, అభ్యున్నతికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ పాలన కొనసాగిస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజా ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటోందని అన్నారు. సన్న బియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, నూతన రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, మహిళా



సంఘాలకు వడ్డీ లేని రుణాలులి వంటి అనేక సంక్షేమ పథకాల ద్వారా అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు.ఈ కార్యక్రమంలో ఆర్డివో రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిలుకూరు సుధా బాలకృష్ణ, వైస్ చైర్మన్ గుడిపాటి శిరీషా నవీన్, మున్సిపల్ర కమీషనర్ నర్రా శ్రీజారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు , మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటీ మంత్రి పర్యటన ను విజయవంతం చేయండి



శివ్వంపేట, నవంబర్ 15 (జనంసాక్షి) : ఈనెల 16న నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణానికి రాష్ట్ర కార్మిక గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి రానున్నట్లు మండల కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శివ్వంపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అలాగే మహిళ నాయకురాళ్లు, కార్యకర్తలు, లబ్ధిదారులు, సోమవారం ఉదయం 10 గంటలకు నర్సాపూర్ లోని సాయి కృష్ణ గార్డెన్ లో జరిగే వృద్ధాప్య, వితంతు, ఒంటరి మహిళ పెన్షన్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర, జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకటస్వామి హాజరవుతున్న నేపథ్యంలో నాయకులు, కార్యకర్తలు ఈ సమావేశానికి సకాలంలో విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నవీన్ గుప్తా కోరారు.

నేరాల నియంత్రణకు విస్తృత నాకాబందీ

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి) : శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ లక్ష్యంగా కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో శనివారం రాత్రి పోలీసులు విస్తృతంగా నాకాబందీ, వాహన తనిఖీలు నిర్వహించారు. ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాల్లో వాహనాల పత్రాలు, నంబర్ ప్లేట్లు తనిఖీ చేయడంతో పాటు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై



చట్టప్రకారం చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి నాకాబందీ తనిఖీలను పరిశీలించారు. తనిఖీల సందర్భంగా పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి నిరంతర తనిఖీలు చేపట్టాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సీపీ ఆదేశించారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పద కార్యకలాపాలు గమనిస్తే వెంటనే డయల్ 112 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని సీపీ తెలిపారు. ఈ తనిఖీల్లో ఏసీపీలు, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చేయూత పింఛన్లు మహిళలకు ఆసరా

- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

పినపాక, నవంబర్ 15 (జనం సాక్షి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మహిళా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. పినపాక మండల కేంద్రంలో చేయుత పింఛన్ల లబ్ధిదారులకు అనుమతి పత్రాలను ఎంపీడీవో సంకీర్త్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందజేయడం జరిగింది. ఈ సమావేశంలో మండల వ్యాప్తంగా ఎంపికైన 91 మంది ఒంటరి మహిళలకు, 335 వితంతువులకు, 115 వికలాంగులకు అర్హత పత్రాలను అందజేయడం జరిగింది. అనంతరం సభను ఉద్దేశించి మాట్లాడుతూ అనుమతి పత్రాలు పొందిన లబ్ధిదారులకు ఈనెల 19వ తేదీ నుంచి పింఛన్ వారి ఖాతాలలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, ఇందిరమ్మ ఇండ్లు, చేయుత పింఛన్ లబ్ధిదారులుగా నమోదు కాని వారు అధైర్య పడకుండా ఎంపీడీవో కార్యాలయం నందు తగు పత్రాలను అధికారులకు అందజేయాలని సూచించారు.

ప్రతి ఒక్కరు ఇందిరమ్మ జీవిత బీమా చేయించుకోవాలి

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈనెల 19న జరగబోవు భారీ బహిరంగ సభ నందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని ప్రవేశ పెట్టబోతున్నారని, ఈ పథకాన్ని 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఈనెల 19వ తేదీ నుంచి నెల చివరి వరకు అవసరమైన పత్రాలను అధికారులకు అందించి జీవిత బీమాకు అర్హులు కావాలని ఈ జీవిత భీమా ద్వారా అనుకొని సంఘటనలు ప్రమాదవశాత్తు మరణాలు సంభవిస్తే ఐదు లక్షల జీవిత బీమా సొమ్ముని కుటుంబ సభ్యులకు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ వెంకటేశ్వరరావు, ఏఎంసీ మార్కెట్ చైర్మన్ తోలేం కళ్యాణి, పంచాయతీల సెక్రటరీలు, జిల్లా డిసిసి ఉపాధ్యక్షుడు గోడిశాల రామనాథం, జిల్లా సెక్రటరీ బోడా



రమేష్, ,జిల్లా దిశా కమిటీ సభ్యుడు మద్దెల సమ్మయ్య, ఉప సర్పంచ్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అచ్చా నవీన్,పినపాక కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పేరం వెంకటేశ్వర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లు, పార్టీ కార్యకర్తలు,చేయూత పింఛన్ లబ్ధిదారులు, అభిమానులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16.11.2026



మనస్థాపంతో చెరువులో దూకి ఆత్మహత్య

ఎడపల్లి, నవంబర్ 15 (జనంసాక్షి) :
ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన కాశిగొల్ల పెద్ద గంగాధర్ అలియాస్ సుబ్బు (43) అనే వ్యక్తి మనస్థాపంతో చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎడపల్లి ఎస్సై ముత్యాల రమ ఆదివారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం కాశిగొల్ల పెద్ద గంగాధర్ ఈ నెల 12వ తేదీ రాత్రి సుమారు 11 గంటల సమయంలో ఇంటి నుండి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదు. కాగా, ఆదివారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో గ్రామంలోని పులి చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఉన్నట్లు సమాచారం అందడంతో, కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించగా తమ పెద్ద కుమారుడు గంగాధర్‌గా గుర్తించారు. మృతుడి తమ్ముడు సుమారు నెల రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా, అప్పటి నుండి గంగాధర్ తన తమ్ముడి మరణాన్ని తలుచుకుంటూ బాధపడేవాడని, ఆ మనస్తాపంతోనే చెరువులో దూకి ఆత్మహత్య చేసుకొని ఉండవచ్చని మృతుడి తల్లి కాశిగొల్ల మల్లవ్వ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు ఎడపల్లి పోలీసులు ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ రమ వివరించారు.

ఇటు విధ్వంసం.. అటు నిరసనలు

ద్వంద్వవైఖరిని అనుసరిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

- భారత్‌సమ్మిట్‌లో అంతర్జాతీయ అంశాలపై పరిశోధన, విధానపరమైన చర్చలు జరిగాయి
- రాహుల్ గాంధీ పిలుపు మేరకు బీజేపీ దురాగతాలను ప్రజలలో ఎండగడతాం
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి) :
ఒక వైపు అన్ని వ్యవస్థలను విధ్వంసం చేస్తూ ప్రజాసౌమ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ భారత్ సమ్మిట్ లో రాహుల్ గాంధీ పాల్గొనడం పై నిరసన వ్యక్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. స్థానిక ముకరంపుర లోని ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... అంతర్జాతీయ అంశాలపై పరిశోధన, విధానపరమైన చర్చలు జరిపి ప్రపంచంలో జరుగుతున్న అనేక అంశాలపై దృష్టి సారించడానికి వేదికగా భారత్ సమ్మిట్ నిర్వహిస్తే కేవలం కొంతమంది ఫాసిస్టులకు మాత్రమే కొమ్ముకాస్తూ 12 సంవత్సరాల క్రితం సంపన్నుల జాబితాలో 600వ స్థానంలో ఉన్న ఆదానీ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 12 ఏండ్లలో 2 వ స్థానానికి ఎదిగాడని, వ్యాపారానికి, రాజకీయానికి మధ్య ఉన్న గీత చెరిపేసిన ఘనత బీజేపీ సొంతం అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాహుల్ గాంధీ ప్రజల సమస్యలు తెలుసుకొంటూ బీజేపీ దురాగతాలను ఎండగడుతూ ఒక నిర్మాణాత్మకమైన మార్పుకోసం కృషి చేస్తుంటే తట్టుకోలేక బీజేపీ పీటలు కదులుతున్నాయని నిరసనలు చేస్తున్నారని నరేందర్ రెడ్డి ప్రశ్నించారు. సమ్మిట్ లో పాల్గొన్న రాహుల్ గాంధీ వివిధ దేశాల ప్రతినిధుల ప్రసంగాలు శ్రద్ధగా విని అనంతరం సుదీర్ఘంగా ప్రసంగించి దిశా నిర్దేశం చేసి ఢిల్లీ వెళ్తే రాహుల్ గాంధీ మధ్యలోనే వెళ్లిపోయారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని నరేందర్ రెడ్డి విమర్శించారు. గతంలో వీరు గెలవడం కోసం దొంగ ఓట్లను నమోదు చేపించేవారని ఇప్పుడేమో ఎస్ఐఆర్ పేరుతో అనుకూలంగా లేని ఓట్లను తొలగిస్తున్నారని నరేందర్ రెడ్డి ఆరోపించారు. ఈ విలేకరుల సమావేశంలో దండి రవీందర్, జీడి రమేష్, కుర్ర పోచయ్య, దన్నా సింగ్, మామిడి సత్యనారాయణ రెడ్డి, నాగుల సతీష్, సాయిరాం, భారీ, లక్కిరెడ్డి కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సైలెంట్ కిల్లర్‌గా మధుమేహం

కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్

కరీంనగర్ బ్యూరో, నవంబర్ 15 (జనంసాక్షి) :
ప్రపంచ మానవాళికి, ముఖ్యంగా భారతీయులకు మధుమేహ రుగ్మత నిశ్శబ్ద హంతకిగా మారుతున్న వేళ ప్రజలు దీని పట్ల అప్రమత్తంగా ఉంటూ జీవనశైలి మార్పులను చేసుకోవాలని కరీంనగర్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ అన్నారు. భారత్‌లో దాదాపు 100 మిలియన్ల మధుమేహ ప్రజలు ఉండడం ఒక హెచ్చరికగా తీసుకోవాలన్నారు. ఆదివారం రోజు మన కరీంనగర్ పట్టణంలో లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 320జి నిర్వహించిన డయాలబెటిస్ ర్యాలీ ప్రారంభంలో మాట్లాడుతూ... ప్రజలు శారీరక వ్యాయామంతో పాటు ఆహార నియమాలను పాటించాలని కోరారు. జిల్లా గవర్నర్ మోరె భద్రేశం మాట్లాడుతూ... జిల్లా 320జి పరిధిలోని వందకు పైగా లయన్స్ క్లబ్బులు నవంబరు మాసంలో మధుమేహ పరీక్షలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్యక్రమ సమన్వయకర్త లయన్ గుండోజు లక్ష్మయ్య నాయకత్వంలో తెలంగాణ కూడలిలో మేయర్ శ్రీనివాస్, లయన్ మోరె భద్రేశం జెండా ఊపి ప్రారంభించిన డయాబెటిస్ ర్యాలీలో పాల్గొన్న లయన్ సభ్యులు నినాదాలు చేస్తూ, ప్లెకార్డులను ధరించి నగర పౌరుల దృష్టిని ఆకర్షిస్తూ బస్ స్టాండ్ మీదుగా టవర్ సర్కిల్ వరకు చేరుకున్నారు. ఈ డయాబెటిస్ అవేర్నెస్ ర్యాలీలో పిడిజీ హెచ్ రాజిరెడ్డి, సీనియర్ లయన్స్ కెప్టెన్ బుర్ర మధుసూదన్ రెడ్డి, కరీంనగర్ లోని పరిసర ప్రాంతాలలో ఉన్న అన్ని లయన్స్ క్లబ్ ల సభ్యులు పి.ఎస్.టి లు, జడ్సీలు, ఆర్సిలు, పిఆర్సి లు, పిజెడ్సీలు పాల్గొని ప్రోగ్రాంను గ్రాండ్ సక్సెస్ గా నిర్వహించడంలో సహకరించినారు. టవర్ సర్కిల్ వద్ద గుమిగూడిన ప్రజలకు మధుమేహం పట్ల అవగాహన కల్పించారు.

గంజాయి పట్టివేత

ముగ్గురు వ్యక్తులు అరెస్ట్..!



మంథని, నవంబర్ 15, (జనంసాక్షి) :
రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు నిర్వహించిన తనిఖీల్లో మంథని మండలం ఖాన్సాయిపేట వద్ద టాస్క్‌ఫోర్స్ పోలీసులు కిలో గంజాయిని పట్టుకున్నారు. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి గంజాయితో పాటు మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు .. ఖాన్సాయిపేట గ్రామ సమీపంలో తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా వారి వద్ద కిలో గంజాయి లభ్యమైనట్లు సమాచారం. పట్టుబడిన వారిలో అదే గ్రామానికి చెందిన ఒకరు, ముత్తారం మండలం స్తంభంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు ఉన్నట్లు తెలిసింది. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు గంజాయి సరఫరా వెనుక ఎవరెవరు ఉన్నారు? ఎక్కడి నుంచి తీసుకొస్తున్నారు? ఎవరికి సరఫరా చేస్తున్నారు? అనే కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడికానున్నాయి.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నిజాంసాగర్(జనంసాక్షి):నిజాంసాగర్ మండల పరిధిలోని గాలిపూర్ గేటు వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ షేక్ హుస్సేన్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న ఆయన తమ్ముడు షేక్ ఖాదర్ గాయపడ్డాడు. హైదరాబాద్ నుంచి బాన్సువాడకు వెళ్తున్న ఆటో గాలిపూర్ గేటు వద్దకు చేరుకోగా, బాన్సువాడ నుంచి మహమ్మద్ నగర్ వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో నడుపుతున్న షేక్ హుస్సేన్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న ఆయన తమ్ముడు షేక్ ఖాదర్‌కు గాయాలయ్యాయి.ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

జాతీయ మహాసభలకు తరలిన రైతులు,కార్మికులు..

- రైతాంగ పోరాటాలకు భవిష్యత్తు కార్యాచరణ దిశానిర్దేశం చేయనున్న జాతీయ మహాసభలు.
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చెల్పూరి రాము



జమ్మికుంట(జనంసాక్షి):
నల్లగొండలో పట్టణంలో నిర్వహించే అఖిల భారత రైతు సంఘం (ఏ ఐ కె ఎస్) 36వ జాతీయ మహాసభల సందర్భంగా భారీ బహిరంగ సభ విజయవంతానికై జమ్మికుంట నుంచి అధిక సంఖ్యలో రైతులు,కార్మికులు బయలు దేరారని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చెల్పూరి రాము తెలిపారు.ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ నవంబర్ 15 నుంచి 18 వరకు నల్లగొండ పట్టణంలో జరిగే 36వ జాతీయ మహాసభల్లో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 2,000 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారని తెలిపారు.ఈ మహాసభలొ ఇప్పటివరకు నిర్వహించిన రైతాంగ పోరాటాలు, ఉద్యమ కార్యక్రమాలను సమీక్షించడంతో పాటు, దేశవ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్తులో చేపట్టాల్సిన రైతాంగ పోరాటాలకు దిశానిర్దేశం చేస్తూ కార్యాచరణ రూపొందిస్తారని అన్నారు. అలాగే రైతాంగ హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.జాతీయ మహాసభలను విజయవంతం చేయడానికి రైతులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారన్నారు.ఈ కార్యక్రమానికి రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు బాసిర సంపత్ రావు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్, రైతు సంఘం జిల్లా నాయకులు,శీలం అశోక్,కాయిత లింగారెడ్డి,కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి వడ్లూరి కిషోర్,సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కదిరె రమేష్, నాయకులు కొంకట చంద్రయ్య, ప్రతాప శ్రీనివాస్, బండ సురేష్,మోరే మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రన్న సంతాప సభను జయప్రదం చేయండి

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి జనంసాక్షి:ఏఐకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు ప్రజల మనిషి అమరుడు అగ్గ ఎర్రన్న సంతాప సభను ఈనెల 22న ఆదివారం రోజు మధ్యాహ్నం 12:00 గంటలకు మోపాల మండల కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఆనాడు జరిగే సభకు అధిక సంఖ్యలో రైతు కూలీలు ప్రజలు హాజరుకావాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య కోరారు.ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎన్ ఆర్ భవన్లో ఎర్రన్న సంతాప సభ పోస్టర్లను ఆవిష్కరించామని వారన్నారు.ఇట్టి సంతాప సభకు ఏఐకేఎంఎస్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు, వి. కోటేశ్వరరావు, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, గౌని ఐలయ్య, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి, ఆకుల పాపయ్య హాజరవుతున్నారని భూమయ్య అన్నారు.అగ్గ ఎర్రన్న బతికున్నంత కాలం రైతాంగ ఉద్యమాలలో, ప్రజా ఉద్యమాలలో, పనిచేశారని ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తెచ్చిన నల్ల చట్టాలను రద్దు చేయాలని రైతు పంటలకు గిట్టుబాటు ధరలు రావాలని ఎంఎస్పి మద్దతు ధరల గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంటులో తీసుకురావాలని జరిగిన పోరాటంలో ప్రత్యక్షంగా ఎర్రన్న పాల్గొన్నారు.రైతులపై ప్రజలపై ముక్కు పిండి కరెంటు చార్జీలను పెంచుతూ అమలు చేయ చూస్తున్న విధానాలను విరమించుకోవాలని పోరాడిన గొప్ప నాయకుడని వారన్నారు.తానున్న ప్రాంతానికి సాగు తాగునీరుకై మధ్యలో ఆగిపోయిన మంచి 21 ప్యాకేజీ పనులకు తగిన నిధులు కేటాయించి పనులు పూర్తి చేయాలని ఉద్యమించిన గొప్ప రైతు నాయకుడు ఎర్రన్న అని భూమయ్య అన్నారు.ఎర్రన్న జరిపిన పోరాటాలను మననం చేసుకొని రాబోయే రోజుల్లో బలమైన రైతు ఉద్యమ ఉద్యమాలు నిర్మించినప్పుడే ఆయనకు అర్పించే ఘనమైన నివాళులని ఆయన అన్నారు.అందుకని ఈ నెల 22న నిర్వహించే సంతాప సభకు ఎర్రన్న అభిమానులు, శ్రేయోభిలాషులు, ఆత్మీయులు, బంధువులు, ప్రజలు, అధిక సంఖ్యలో హాజరుకావాలని భూమయ్య కోరారు ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దేశెట్టి సాయి రెడ్డి, డివిజన్ కార్యదర్శి, దేదావత్ బన్సీ, జిల్లా నాయకులు, బి. సాయిలు, శ్రీనివాసరెడ్డి, సూర్య విట్టల్, లక్ష్మణ్ ,గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ..

ఇద్దరు బాధితులకు పదహారు వేల ఆర్థిక సహాయం చేసిన వాకర్స్ అసోసియేషన్

సుల్తానాబాద్,నవంబర్ 15(జగన్ సాక్షి):
ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, మానవతా విలువలను చాటుతూ సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సేవా కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని, ప్రమాదాల బారినపడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారిని ఆదుకోవాలనే సంకల్పంతో ముందుకు వచ్చి తమ వంతు సహాయాన్ని అందించారు.సుల్తానాబాద్ పట్టణంలోని శాస్త్రినగర్‌కు చెందిన మంగళ రాము క్యాన్సర్ వ్యాధితో బాధపడుతుండగా, ఇటీవల రోడ్డు ప్రమాదంలో వాలీబాల్ క్రీడాకారుడు, హర్ష హైస్కూల్ కరస్పాండెంట్ ఇక్బాల్ గాయపడ్డారు.వీరి పరిస్థితిని తెలుసుకున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించి, ఇరువురికీ కలిపి పదహారు వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ,సమాజంలో ఎవరైనా ఆపదలో ఉన్నప్పుడు వారికి అండగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.అనారోగ్యం ,ప్రమాదాలు వంటి ఊహించని పరిస్థితుల్లో బాధిత కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటాయని, అలాంటి సమయంలో చిన్నపాటి ఆర్థిక సహాయం కూడా వారికి ఎంతో ఊరటనిస్తుందని తెలిపారు.సేవాభావంతో ఇలాంటి కార్యక్రమాలను చేపడుతూ, అవసరమైన వారికి తమ వంతు సహాయ సహకారాలు అందించేందుకు వాకర్స్ అసోసియేషన్ ఎల్లప్పుడూ ముందుంటుందని స్పష్టం చేశారు.సమాజంలో మానవత్వం, పరస్పర సహకారం, సేవా దృక్పథం పెంపొందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చొప్పరి సుమన్, ప్రధాన కార్యదర్శి నిట్టూరి శ్రీనివాస్,కోశాధికారి కామిని శ్రీకాంత్,సభ్యులు కొమురవెల్లి భాస్కర్, పల్స సురేష్, రాజేంద్రప్రసాద్,ఉల్లంగుల శ్రీనివాస్,ఎనగందుల మల్లేశం,కోడెం అజయ్, వల్స మల్లేశం,పైద ఆంజనేయులు, కట్ల రాజమౌళి, సుంక వేణు, మహమ్మద్ ఖాసీం,దూడం లింగమూర్తి,శ్రీగిరి సుధాకర్,కామిని వెంకటేశం, రామకృష్ణ, దేవరకొండ ప్రకాష్, రాఘవులు, జగన్, గెల్లు మధుకర్,బూడిద స్వామి, ఎలగందుల ఎల్లయ్య,కోయ్యడ సంతోష్,ఎం డి ముస్తఫా,సిరిపురం రమేశ్,రాజు,తిరుపతి,సలకం శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు..



గంజాయి విక్రేత అరెస్టు



కరీంనగర్, క్రైమ్ (జనంసాక్షి) :గత అక్టోబర్ నెలలో నగునూరు గ్రామ శివారులో గంజాయిని చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి విక్రయించేందుకు సిద్ధమవుతున్న ఇద్దరు వ్యక్తుల గురించి పోలీసులకు సమాచారం అందింది.వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకోగా, పోలీసులను చూసిన ఇద్దరు వ్యక్తులు పారిపోవడానికి ప్రయత్నించారు. వారిని వెంబడించగా శ్రీరామ్ అనే వ్యక్తి పోలీసులకు పట్టుబడగా, మరొక వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు.పట్టుబడిన శ్రీరామ్‌ను విచారించగా, పరారైన వ్యక్తి పకీర్పేట గ్రామానికి చెందిన అడప వంశీ అని, ఇద్దరూ కలిసి ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నామని వెల్లడించాడు. ఈ క్రమంలో శ్రీరామ్ వద్ద ఉన్న సుమారు 1 కిలో 100 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని, అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగింది.ఈ కేసులో పరారీలో ఉన్న రెండో నిందితుడు అడప వంశీ కోసం పోలీసులు ప్రత్యేకంగా గాలింపు చర్యలు చేపట్టి, అతని కదలికలపై నిరంతరం నిఘా ఉంచారు. ఈ క్రమంలో పకీర్పేట గ్రామంలో అతను ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందడంతో, కరీంనగర్ రూరల్ పోలీసులు సిబ్బందితో కలిసి వెళ్లి అతనిని అదుపులోకి తీసుకున్నారు. అతను పారిపోయేందుకు ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి, చట్టపరమైన చర్యలు చేపట్టి రిమాండ్‌కు తరలించడం జరుగుతుంది. అడప వంశీ గత కొన్ని సంవత్సరాలుగా ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి చుట్టుపక్కల గ్రామాల్లో విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. ఇతనిపై కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌తో పాటు చొప్పదండి పోలీస్ స్టేషన్‌లో, పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ తదితర పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదై ఉన్నాయి. గతంలో పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినప్పటికీ తన ప్రవర్తనలో మార్పు రాకుండా తిరిగి గంజాయి విక్రయాలకు పాల్పడుతున్నాడు.ఇతని నేర కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకొని కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇప్పటికే రౌడీ షీట్ తెరవడం జరిగింది.గంజాయి ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగానికి పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాము. నేరాలకు పాల్పడుతూ పదేపదే పోలీసులకు పట్టుబడుతున్న వారిపై చట్టప్రకారం మరింత కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, అవసరమైన చట్టపరమైన ప్రక్రియను అనుసరించి పీడీ యాక్ట్ అమలుకు కూడా చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నాము.

అంబేద్కర్ ఆలోచనలే దేశానికి మార్గదర్శకం

అంబేద్కర్ ఆలోచనలే భారతదేశానికి మార్గదర్శకం.

ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొరివి వేణుగోపాల్



కరీంనగర్, క్రైమ్ నవంబర్ 15 (జనంసాక్షి):
కరీంనగర్ కోర్టు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇది గత నవంబర్ ఒకటో తేదీ నుండి ఈ కార్యక్రమం కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాట్ అశోకుని కాలం తర్వాత మళ్లీ మహా భారతదేశం బ్రిటిష్ కాలంలో ఏర్పడ్డది రెండింటి మధ్యలో భారతదేశం విభిన్న రాజుల కింద ఎన్నో రాజ్యాలుగా కొనసాగింది బ్రిటిష్ తదుపరి భారతదేశం ఒక మహా దేశంగా ఎలా కొనసాగాలనే ఆలోచన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తీవ్రంగా ఆలోచన చేసి దేశ ఐక్యతను,సమగ్రతను ఈ విధంగా చారిత్రాత్మకమైన టువంటి అంశాలను కాపాడే విధంగా భారత రాజ్యాంగాన్ని తీర్చిదిద్దడం వలన ఏ రాజ్యాంగ సంక్షోభం లేకుండా భారతదేశం ఇవాళ ఒక బలమైన గణతంత్ర దేశంగా కొనసాగుతుంది కావున అంబేద్కర్ అనునిత్యం స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అభిమానులు ప్రజలు అందరూ పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో గజ్జల ఆనందరావు, కొంపెల్లి రవీందర్, తాళ్ల వెంకటేష్,సిగిరి శ్రీధర్,కడపల విజయకుమార్,క్యాద్యాసి ప్రభాకర్,మాడెపు నరసయ్య, గాదం రవీందర్ పాటకుల భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా నిలిచిన మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది

సుల్తానాబాద్,నవంబర్ 15(జనంసాక్షి) :
మండలం లోని చిన్న కల్వల గ్రామానికి చెందిన ముదురుకోళ్ల రాజ్ కుమార్ దివ్యాంగుడు గత వారం రోజుల క్రితం అనారోగ్యంతో మరణించాడు.తన కుటుంబ పరిస్థితి తెలిసిన సుల్తానాబాద్ మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం సిబ్బంది ఆదివారం చిన్న కల్వల గ్రామానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి,వారికి బియ్యం,నిత్యవసర వస్తువులు అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు.కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేని ఆ కుటుంబానికి ఎవరో ఒకరు వచ్చి సహాయం చేసి అండగా నిలవాలని సెంటర్ ఇన్చార్జి శ్రీనివాస్,సామాజిక కార్యకర్త దేశెట్టి రమేష్ కోరారు.తను మరణించినప్పుడు కనీసం అంతక్రియలు చేయడానికి కూడా ఆర్థిక ఇబ్బందులు ఉండడంతో తలో ఒక చెయ్యి వేసి అంత్యక్రియలు నిర్వహించడం జరిగిందని,వారికి కనీసం ఒక్క పూట తినడానికైనా అన్నం కూడా లేని పరిస్థితిలో ఉన్నారని వారి ఇంటిలో ప్రతి ఒక్కరూ దివ్యాంగులేనని వీరికి ప్రభుత్వంతో పాటు మనసున్న మహారాజులు అండగా నిలవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో సెంటర్ సిబ్బంది సరస్వతి,కళ్యాణి,మృతుని కుటుంబ సభ్యులు ఉన్నారు.




కష్టపడి చదివితే విజయం తథ్యం

- నిరుద్యోగ యువతకు మంత్రి శ్రీధర్ బాబు అండ ఎస్ఐ, కానిస్టేబుల్
- అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



మంథని, నవంబర్ 15 (జనంసాక్షి) :
మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో శ్రీ విశ్వ అకాడమీ సహకారంతో నిర్వహిస్తున్న ఉచిత మన ఊరు – మన కోచింగ్ సెంటర్ కార్యక్రమంలో భాగంగా పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఆదివారం మంథని పట్టణంలోని శివకిరణ్ గార్డెన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న దుద్దిళ్ల శ్రీను బాబు అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను స్వయంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల సాధనలో మెరుగైన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఉచిత కోచింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారని అన్నారు. అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందించడంతో పాటు, ప్రతిరోజూ మధ్యాహ్నం భోజన సదుపాయాన్ని కూడా కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అభ్యర్థులపై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా ఉచిత కోచింగ్, భోజన సదుపాయాలు కల్పిస్తూ వారి పోలీస్ ఉద్యోగాల సాధనకు మంత్రి శ్రీధర్ బాబు అండగా నిలుస్తున్నారని అన్నారు. దాదాపు 120 రోజులు పూర్తి కావస్తున్నందున ఈ శిక్షణ కార్యక్రమాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకొని, క్రమశిక్షణతో కష్టపడి చదివి పోలీస్ ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. యువతకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలు నిరుద్యోగ యువతకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని పేర్కొన్నారు. శిక్షణ పొందిన ప్రతి ఒక్కరూ మంచి ఫలితాలు సాధించి తమ కుటుంబాలకు, ప్రాంతానికి గర్వకారణంగా నిలవాలని దుద్దిళ్ల శ్రీను బాబు ఆకాంక్షించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 నవంబర్ 2026



- ఓటరు కార్డు లేకపోతే లబ్ధి బంద్
- సంక్షేమానికి కొత్త కొలమానంగా ఓటరు గుర్తింపు కార్డు
- కోట్లాది మంది లబ్ధిదారుల్లో ఆందోళన

సంక్షేమ పథకాలకు ఆధార్ గండి..

ఓటరు కార్డు లేకపోతే లబ్ధి బంద్

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలపై కేంద్ర ప్రభుత్వం తీసుకోబోతున్న నిర్ణయం తీవ్ర కలకలం రేపుతోంది. ఇప్పటి వరకు అన్ని సంక్షేమ పథకాలకు ప్రామాణికంగా ఉన్న 'ఆధార్' స్థానంలో ఇకపై 'ఓటరు కార్డు'ను తప్పనిసరి చేయాలన్న ప్రతిపాదన తెరపైకి వచ్చింది. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి లలన్ సింగ్ చేసిన ఈ ప్రకటనతో దేశవ్యాప్తంగా లబ్ధిదారుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నిబంధన కనుక అమలైతే, ఓటరు జాబితాలో పేర్లు లేని లేదా మార్పులు చేర్పులు జరిగే కోట్లాది మంది అర్హులు ప్రభుత్వ సహాయాన్ని కోల్పోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమగ్ర సర్వే (సర్) ప్రక్రియ లో భాగంగా ఇప్పటికే దేశవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు, వ్యతిరేకత వెల్లువెత్తుతున్న తరుణంలో, కేంద్ర మోదీ సర్కార్ తీసుకువస్తున్న ఈ తాజా ప్రతిపాదన పేద వర్గాల్లో గుబులు పుట్టిస్తోంది. కిసాన్‌సమ్మాన్ యోజన, ఫసల్‌బీమా యోజన, ఆయుష్మాన్ భారత్, పీఎం కృషి సించాయ్ యోజన, పీఎం మాతృ వందన యోజన, పీఎం ఆవాస్ యోజన, జనధన్ యోజన తదితర కీలక పథకాల తో పాటు రేషన్ బియ్యం పంపిణీపై కూడా ఈ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని స్పష్టమవుతోంది.

ఓటరు గుర్తింపు ప్రక్రియపై అస్పష్టత.

ఓటరు కార్డును లబ్ధిదారుల గుర్తింపునకు ఆధారంగా తీసుకోవాలన్న ప్రకటన గందరగోళానికి దారితీసింది. సర్వే చేపట్టిన ప్రాంతంలో సుమారు 13 కోట్ల ఓటర్ల పేర్లు తొలగింపు తదితర వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయి. మే నెలలో ఓటర్ల జాబితా సవరణ చట్టబద్ధతను సమర్థించి నప్పటికీ, ఒక వ్యక్తి భారత పౌరుడా కాదా అనే విశ్వాసపు నిర్ణయం తీసుకునే అధికారం ఎన్నికల సంఘానికి ఈ కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ప్రామాణికంగా తీసుకోవాల్సి కేంద్ర మంత్రి లలన్ సింగ్ ప్రకటన ప్రాధాన్యం సంతరించ ుకుంది. ఆధార్ కార్డులు జారీ చేసిన సంస్థలు దాదాపు ప్రతి ప్రాంతంలో అందుబాటులో ఉన్నాయని, ఐదు నిమిషాల్లోనే ఎవరికైనా ఆధార్ కార్డు సృష్టించే అవకాశం ఉందని ఆయన చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. అందుకే లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ కు బదులుగా ఓటరు నంబర్, బయోమెట్రిక్ వివరాలను ఉపయోగించాలని ఆయన సూచించారు. ఇప్పటి వరకు ఆధార్ ఆధారంగా జరుగుతున్న నగదు చెల్లింపులకు బదు లు ఇకపై ఓటరు కార్డుతో పాటు బయోమెట్రిక్ ధృవీకరణ ను తప్పనిసరి చేయాలని కేంద్రం ప్రతిపాదిస్తోంది. నకిలీ లబ్ధిదారులను ఏరివేసి, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అర్హులకే అందించడమే లక్ష్యమని చెబుతున్నారు. అయితే ఓటరు జాబితాలపై రాజకీయ వివాదాలు కొనసాగుతున్న వేళ ఈ ప్రతిపాదన కొత్త చర్చకు తెరలేపుతోంది. ఏపీకే నంబర్‌తో బయోమెట్రిక్ వివరాలను జతచేయడం ద్వారా నిజమైన లబ్ధిదారులను గుర్తించవచ్చని, అనర్హుల పేర్లను తొలగించి ప్రభుత్వ సాయం అర్హులకి అందించవచ్చని పేర్కొంటు న్నారు. ఇదే సమయంలో ఓటరు జాబితాలో పేర్ల తొలగింపుపై ప్రతిపక్షాలు చేస్తున్న ఓటు చోరీ ఆరోపణల నేపథ్యంలో ఈ ప్రతిపాదన అమలుపైన రాజకీయంగా ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

కరీంనగర్‌లో బిర్లా ఓపెన్ మైండ్స్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్

- 5 దక్షిణాది రాష్ట్రాల విద్యార్థుల భాగస్వామ్యం - ఓవరాల్ ఛాంపియన్‌గా కరీంనగర్ బిర్లా ఓపెన్ మైండ్స్
- బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ దాసరి ప్రశాంత్ రెడ్డి



కరీంనగర్ బ్యూరో , నవంబర్ 15 (జనంసాక్షి) : బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు నిర్వహించిన బిర్లా ఓపెన్ మైండ్స్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్ - 2026 ఆదివారం రోజు అట్టహా సంగా ముగిసింది. 5 దక్షిణాది రాష్ట్రాల నుంచి 13 బ్రాంచ్‌లకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను చాటుకున్నారు. ఈ క్రీడా మహోత్సవంలో వివిధ విభాగాల్లో పోటీపడి అద్భుత ప్రతిభ కనబరిచిన బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి ఘన విజయాన్ని సొంతం చేసుకుంది. నవంబర్ 13న ప్రారంభమైన ఈ క్రీడా వేడుక నవంబర్ 15 వరకు 3 రోజుల పాటు కొనసాగింది. ఆర్చరీ, చెస్, టేబుల్ టెన్నిస్, లాన్ టెన్నిస్, స్కేటింగ్, ఫుట్‌బాల్, క్రికెట్, తైక్వాండో, స్విమ్మింగ్ తదితర మొత్తం 13 క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించారు. వివిధ రాష్ట్రాలు, బ్రాంచ్‌ల నుంచి వచ్చిన విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో పోటీల్లో పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. ముగింపు వేడుకలో బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ దాసరి ప్రశాంత్ రెడ్డి విద్యార్థులందరినీ ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఉందని తెలిపారు. క్రీడలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, పట్టుదల, జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా వివిధ క్రీడా విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు పతకాలు, ట్రోఫీలు అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అత్యధిక విజయాలు సాధించిన బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, కరీంనగర్ ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ విజయం పాఠశాల విద్యార్థుల కృషి, కోచ్‌ల శిక్షణ, ఉపాధ్యాయుల ప్రోత్సాహం, యాజమా న్యం అందించిన సహకారానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన అన్ని బ్రాంచ్‌ల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, క్రీడా కోచ్‌లు, రిఫరీలు, నిర్వాహకులు, వాలంటీర్లు, సహాయక సిబ్బందికి, పాఠశాల యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.

రైతు, కార్మిక హక్కుల పరిరక్షణకు ఐక్య పోరాటాలు

- సీపీఎం మేడ్చల్ జిల్లా కార్యదర్శి పి.సత్యం
- మేడ్చల్ జిల్లా నుండి నల్లగొండ
- ఎఐకె ఎస్ మహాసభలకు 100 కార్లతో భారీగా కాన్వాయ్



కీసర, నవంబర్ 15 (జనంసాక్షి) : రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని సీపీఎం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం పిలుపు నిచ్చారు. అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభల సందర్భంగా నల్గొండ పట్టణంలో నిర్వహించే బహిరంగ సభకు తరలివెళ్లేందుకు ఏర్పాటు చేసిన 100 కార్ల భారీ కాన్వాయ్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా పి.స త్యం మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలు, వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న చట్టాలు ప్రజల హక్కులకు భంగం కలిగిస్తున్నాయని విమర్శించారు. రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి నిరంతర పోరాటాలు అవసరమన్నారు. గత ఉద్యమాల అనుభవాలను సమీక్షించుకు ని, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు అఖిల భారత కిసాన్ సభ 36వ జాతీయ మహాసభలు దిశానిర్దేశం చేయనున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలు, పట్టణ ప్రాంత కార్మికులు సంఘటితమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలపై ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ పోరాటాల్లో యావత్ ప్రజానీకం భాగస్వాములై తమ వంతు కృషి చేయాలని కోరారు.

ఈ ర్యాలీలో సుమారు 100 కార్లతో 500 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోమటి రవి, రాజశేఖర్, సిఐటియు మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్, కోశాధికారి గణేష్, ఉపాధ్యక్షుడు రాథోడ్ సంతోష్, మేడ్చల్ జిల్లా యంగ్ వర్కర్స్ కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ కె ఎస్ ఎస్ మణికంఠ, చర్లపల్లి ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు బివి సత్యనారాయణ, తోట నర్సింహా, కుషాయిగూడ ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు కొండల్ రెడ్డి, ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి సృజన, బిల్డింగ్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకన్న, అశోక్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

నిజామాబాద్‌లో విషాదం

- వివాహేతర సంబంధమే ప్రాణం తీసిందా?
- సహజత్ ఖాన్ హత్య కేసులో పోలీస్‌ల అదుపులో భార్య, ప్రియుడు ?
- పోలీసుల దర్యాప్తు ముమ్మరం

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి నవంబర్ 15 జనం సాక్షి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో తీవ్ర కలకలం రేపిన ఓ దారుణ హత్యోదంతం స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది. నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధికి చెందిన కోజా కాలనీలో ఓ వ్యక్తి అనుమానాస్పద రీతిలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది.కోజా కాలనీకి చెందిన సహజత్ ఖాన్ (40) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో విగతజీవుడిగా పడి ఉన్నాడు.తొలుత ఇది సాధారణ మృతిగా భావించినప్పటికీ, మృతదేహాన్ని పరిశీలించిన తర్వాత పోలీసులు, స్థానికుల్లో అనుమానాలు బలపడ్డాయి. దుండగులు సహజత్ ఖాన్‌ను అత్యంత దారుణంగా గొంతుకు ఉరివేసి హత్య చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు.

ఈ హత్య వెనుక వివాహేతర సంబంధాల వ్యవహారమే ప్రధాన కారణమై ఉండవచ్చన్న కోణంలో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. మృతుడు సహజత్ ఖాన్‌కు భార్యతో పాటు నలుగురు పిల్లలు ఉన్నట్లు సమాచారం. అయితే, కుటుంబ కలహాలు లేదా వివాహేతర సంబంధం నేపథ్యంలోనే భార్య, ఆమె ప్రియుడు కలిసి పథకం ప్రకారమే సహజత్ ఖాన్‌ను హతమార్చి ఉండవచ్చని పోలీసులు గట్టిగా అనుమానిస్తున్నారు.ఈ కోణంలోనే కూపీ లాగిన పోలీసులు, మృతుడి భార్యతో పాటు ఆమె ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల సమగ్ర దర్యాప్తులో తేలాల్సి ఉంది. నలుగురు పిల్లల తండ్రి ఈ విధంగా దారుణ హత్యకు గురికావడంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి.



జీవిత కాలం ఒకే జెండా మోయడం
కమ్యూనిస్టు కార్యకర్తలకే సాధ్యం

- సీపీఐ సీనియర్ నాయకులు మధునయ్య సంస్మరణ సభ
- నివాళులు అర్పించిన సీపీఐ శ్రేణులు

గోదావరిఖని, జనంసాక్షి :సిపిఐ భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకులు, మాజీ లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి ఆసాల మధునయ్య సంస్మరణ సభ సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శి సిరిసిల్ల మల్లేష్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం,సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య మధునయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.అనంతరం పలువురు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ సీనియర్ నాయకులు లెనిన్‌నగర్ శాఖ కార్యదర్శిగా పనిచేసిన ఆసాల మధునయ్య మరణం పార్టీకి తీరనిలోటని,ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.లెనిన్‌నగర్ శాఖ నిర్మాణంలో ముందు నుండి పనిచేయడం గాక ఆ బస్తీకి లెనిన్‌నగర్ అనే పేరును పెట్టి కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఎంతగానో కృషిచేసిన నాయకుడు అని అన్నారు.పూటకు ఒక జెండా పూటకో కండువా మారుస్తున్న కాలంలో నీతినిజాయితీలకు కట్టుబడి, కడవరకు కమ్యూనిస్టు పార్టీ జెండాను భుజానమోసిన మధునయ్య సేవలను స్మరించారు. జీవితకాలం ఒకే జెండా మోసేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అని అన్నారు.ఈ కార్యక్రమంలో కే.స్వామి, మాటేటి శంకర్, రాజారత్నం, ఆసాల రమ, రేణిగుంట్ల ప్రీతం, ఆసాలా నవీన్, శనిగరపు చంద్రశేఖర్, అబ్దుల్‌కరీం, తోడుపునూరి రమేష్‌కుమార్, ఆసాల కొమురయ్య, కొండ్రా రాజయ్య, మధునయ్య కుటుంబ సభ్యులు, ఆసాల లెనిన్, ఆసాల కిషోర్ ఉన్నారు.

శ్రద్ధానందుడి జీవితం ఎంతో ఆదర్శం

- హిందువుల ఐక్యతకు కృషిచేసిన మహానుభావులు
- అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ



నిజామాబాద్ జిల్లా ప్రతినిధి, జనంసాక్షి: స్వామి శ్రద్ధానందుడి జీవితం అందరికీ ఆదర్శమని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. స్వామి శ్రద్ధానందుడు స్వయంగా రచించిన " కళ్యాణ మార్గ పతికుడు " గ్రంధాన్ని తెలుగు అనువాద పుస్త కాన్ని ఆదివారం నగరంలోని ఆర్యసమాజంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... స్వామి దయానంద సరస్వతి ప్రభావంతో ఆర్య సమాజంలో చేరి అనేక సంస్కరణలను చేపట్టారని తెలిపారు. తన జీవితాన్ని దేశం ధర్మం సమాజ సేవకు అంకితం చేశారని గుర్తు చేశారు. ప్రధానంగా హిందూ సమాజ ం ఐక్యతకు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజల్లో జాతీయ చైతన్యం, స్వాభిమానం పెంపొందించారన్నారు.స్వామి శ్రద్ధానందుని స్ఫూర్తిగా తీసుకొని ఇందూరులో శ్రద్ధానంద్ గంజ్ గా నామకరణం చేయడం ఎంతో గర్వకారణం అన్నారు. అలాగే పుస్తకాన్ని తెలుగులో అనువాదం చేసిన మర్రి కృష్ణారెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్య సమాజా అధ్యక్షులు విజయ్, ఉపాధ్యక్షులు శ్రావణ్, మంత్రి తిరుమల శ్రీనివాస్, ఆచార్య ప్రణవ కుమార్, పండిత వేద మిత్ర తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో సీపీఐ పోటీ

- ప్రజా సమస్యల పరిష్కారమే ఎజెండాగా ఉద్యమాలు చేపట్టాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్



జవహర్ నగర్:నవంబర్ 15 (జనంసాక్షి): రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని డివిజన్లలో సీపీఐ అభ్యర్థులను బరిలో నిలుపుతామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాప్రా మండల సీపీఐ కౌన్సిల్ సమావేశం మండల కార్యదర్శి దర్శనం యాదగిరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమామహేష్ మాట్లాడుతూ, కార్మికులు, పేదలు, సామాన్య ప్రజల సమస్యలపై సీపీఐ నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందన్నారు. జవహర్ నగర్‌లో పలు బస్తీల ఏర్పాటు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం గతంలో సీపీఐ కీలకంగా పనిచేసిందని గుర్తుచేశారు. డంపింగ్ యార్డ్ ఎత్తివేత, తెలంగాణ పబ్లిక్ స్కూల్ సాధన కోసం కొనసాగుతున్న ఉద్యమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

జాతీయస్థాయి అవార్డులు అందుకున్న వికారాబాద్ జిల్లా కళాకారులు

- శోభారాణి అంబేద్కర్ అవార్డు
- కృష్ణయ్య మహాత్మ జ్యోతిబాపూలే అవార్డు
- తులసి ఉత్తమ గాయని అవార్డు





బొంరాస్ పేట, నవంబర్ 15 (జనంసాక్షి): వికారాబాద్ జిల్లా నుండి ముగ్గురు కళాకారులు జాతీయస్థాయిలో అవార్డులు అందుకున్నారు. దేశ రాజధాని న్యూఢిల్లీ కరోల్ బాగ్ లోని గద్వాల్ భవన్ లో జరిగిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్ 2026 జాతీయస్థాయి అవార్డుల ప్రధానోత్సవం బి. ఎస్.ఏ జాతీయ అధ్యక్షులు నల్లా రాధాకృష్ణ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. దోమ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన బల్లూరి శోభారాణి బొంరాస్ పేట మండలం నందర్పూర్ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ అంబేద్కర్ జాతీయ అవార్డును అందుకున్నారు.బొంరాస్ పేట మండలం రేగడి మైలారం గ్రామానికి చెందిన మంగలి కృష్ణయ్య గత 20 ఏళ్లుగా జానపద సంగీతంలో చేస్తున్న కృషికి మహాత్మ జ్యోతిరావు పూలే అవార్డు అందుకున్నారు.బంట్వారం మండ లం యాచారం గ్రామానికి చెందిన తులసి ఉత్తమ గాయనిగా జాతీయస్థాయి అవార్డు అందుకుంది.ఈ సందర్భంగా ఉత్తమ అవార్డు పొందిన వారు మాట్లాడుతూ జాతీయస్థాయిలో అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. మారుమూల గ్రామా ల నుండి కళా రంగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి అవార్డులు అందుకోవడం పట్ల ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు వారిని అభినందించారు.

మహిళా సమస్యల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలి

- బాధితులకు తక్షణ న్యాయం అందించాలి..
- ఓట్లు తొలగిస్తున్న ఎస్ఐఆర్‌ను పూర్తిగా రద్దు చేయాలి..
- ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి..

గోదావరిఖని, జనంసాక్షి : స్థానిక ఐఎఫ్‌టీయు కార్యాలయంలో ప్రగతిశీల మహిళా సంఘం (పిఓడబ్ల్యు) పెద్దపెల్లి జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సమావేశా నికి ముఖ్యఅతిథిగా ప్రగతిశీల మహిళా సంఘం పిఓడబ్ల్యు పెద్దపెల్లి జిల్లా అధ్యక్షురాలు కోడిపుంజుల జ్యోతి హాజరై మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో సగభాగంగా ఉన్న మహిళలు నేటికీ అనేక రకాల భద్రత,ఆర్థిక, సామాజిక సమస్యలను ఎదుర్కొంటున్నారని తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.మహిళల హక్కుల పరిరక్షణ, సాధికారత కోసం ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.పని ప్రదేశాలు, విద్యా సంస్థలు,బహిరంగ ప్రదేశా లలో మహిళలపై జరుగుతున్న వేధింపులు, హింసను అరికట్టడానికి కఠినమైన చట్టాలను అమలు చేయాలని, ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ద్వారా బాధితులకు తక్షణ న్యాయం అందించాలని కోరారు.దేశంలో బిజెపి కనుసన్నల్లో నడుస్తున్న ప్రధాన ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఎస్ఐఆర్‌ను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఎస్ఐఆర్ మూలంగా అత్యధికంగా ఏడు కోట్లకు పైగా మహిళా ఓట్లను తొలగించే కుట్ర జరుగుతుందన్నారు.దీనిని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.అసంఘటిత రంగంలో,ప్రైవేట్ సంస్థల్లో పనిచే స్తున్న మహిళా కార్మికులకు పురుషులతో సమానంగా వేతనాలు అందేలా చూడాలన్నారు. పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయా లు, ప్రసూతి సెలవులను పక్కాగా అమలు చేయాలని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని పేద మహిళల్లో రక్తహీనత, పోషకాహార లోపాలను నివారించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు,ఉచిత మందులు అందుబాటులో ఉంచాల న్నారు. బాలిక ల డ్రాపౌట్లను తగ్గించడానికి ఉన్నత విద్య వరకు ఉచిత విద్యను అందించాలని ప్రభుత్వాన్ని ఆమె డిమాండ్ చేశారు. మహిళలు ఆర్థికంగా, స్వతంత్రంగా ఎదగడానికి నైపుణ్యాభివృద్ధి శిక్షణ,వడ్డీలేని రుణాలను విస్తృతం చేయాలన్నారు. సోషల్ మీడియా వేదికగా మహిళలపై జరుగుతున్న వేధింపులు,సైబర్ నేరాలను అరికట్టడానికి ప్రత్యేక సైబర్ సెల్ విభాగాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు.మహిళలకు గౌరవం, భద్రత లేని సమాజం అభివృద్ధి చెందలేదని,ప్రభుత్వం తక్షణమే స్పందించి తగిన కార్యాచరణ ప్రకటించాలని కోరారు. ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకు రాలు బుచ్చమ్మ, కనకలక్ష్మి, రజిత, సంధ్య, ఈ.మంగ, పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచనలే దేశానికి మార్గదర్శకం

- అంబేద్కర్ ఆలోచనలే భారతదేశానికి మార్గదర్శకం.
- ప్రజామిత్ర ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు కొలివి వేణుగోపాల్

కరీంనగర్, క్రైమ్ నవంబర్ 15 (జనంసాక్షి) : కరీంనగర్ కోర్టు వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఇది గత నవంబర్ ఒకటో తేదీ నుండి ఈ కార్యక్రమం కొనసాగుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామ్రాట్ అశోకుని కాలం తర్వాత మళ్లీ మహా భారతదేశం బ్రిటిష్ కాలంలో ఏర్పడ్డది రెండింటి మధ్యలో భారతదేశం విభిన్న రాజుల కింద ఎన్నో రాజ్యాలుగా కొనసాగింది బ్రిటిష్ తదుపరి భారతదేశం ఒక మహా దేశంగా ఎలా కొనసాగాలనే ఆలోచన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తీవ్రంగా ఆలోచన చేసి దేశ ఐక్యతను,సమగ్రతను ఈ విధంగా చారిత్రాత్మకమైనటువంటి అంశాలను కాపాడే విధంగా భారత రాజ్యాంగాన్ని తీర్చిదిద్దడం వలన ఏ రాజ్యాంగ సంక్షోభం లేకుండా భారతదేశం ఇవాళ ఒక బలమైన గణతంత్ర దేశంగా కొనసాగుతుంది కావున అంబేద్కర్ అనునిత్యం స్మరించుకోవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమంలో అంబేద్కర్ అభిమానులు ప్రజలు అందరూ పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో గజ్జల ఆనందరావు, కొంపెల్లి రవీందర్, తాళ్ల వెంకటేష్,సిగిరి శ్రీధర్,కడపల విజయకుమార్,క్యాద్యాసి ప్రభాకర్,మాడెపు నరసయ్య, గాదం రవీందర్ పాటకుల భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.



భిన్న సంస్కృతులు.. సంప్రదాయాలకు పటాన్‌చెరు వేదిక

- భక్తి పారవశ్యంలో ఛట్ పూజా వేడుకలు
- అన్ని వర్గాలను గౌరవించడం తెలంగాణ సంస్కారం
- ఉత్తర భారతీయుల సంక్షేమానికి ప్రత్యేక కృషి
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి



పటాన్‌చెరు, నవంబర్ 15 (జనంసాక్షి): భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలకు సముచిత గౌరవం కల్పిస్తూ పటాన్‌చెరు నియోజకవర్గం సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నా రు. అన్ని వర్గాల ప్రజలను ఆదరించడం, వారి ఆచార సంప్రదాయాలను గౌరవించడం తెలంగాణ ప్రజల గొప్ప సంస్కారమని పేర్కొన్నారు. ఉత్తర భారతీయులు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే ఛట్ పూజా మహోత్సవాలు ఆదివారం సాయంత్రం పటాన్‌చెరులోని సాకి చెరువు వేదికగా వైభవంగా ప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మైత్రి మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి, జాగరణ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రముఖ భోజ్‌పురి గాయకుడు రితేష్ పాండే, గాయని కావ్య తమ సంగీత ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. వేలాది మంది ఉత్తర భారతీయులు వేడుకల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్‌చెరు అభివృద్ధిలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని, ఇక్కడ నివసించే వారందరినీ కుటుంబ సభ్యులుగా భావిస్తామని తెలిపారు. కుల, మత, భాష, ప్రాంతీయ భేదాలు లేకుండా అందరికీ సమాన గౌరవం కల్పించడమే లక్ష్యమన్నారు. ఉత్తర భారతీయుల సంక్షేమం, అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఛట్ పూజ ప్రకృతి ఆరాధనకు, సూర్యభగవానుడిపై భక్తికి, కుటుంబ క్షేమం, ఆరోగ్యం, సుఖసంతోషాల ఆకాంక్షకు ప్రతీకగా నిలుస్తుం దని పేర్కొన్నారు.

నాగసముద్రాల మోడల్‌స్కూల్ వద్ద రోడ్డు అలైన్‌మెంట్‌ను వెంటనే మార్చాలి

కోహెడ, నవంబర్ 15 (జనంసాక్షి) : మండలంలోని నాగసముద్రాల తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆదర్శ పాఠశాల వద్ద నుండి వేసే నూతన రోడ్ అలైన్ మెంట్ వెంటనే మార్చి విద్యార్థుల చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని బీజేపీ కోహెడ మండల శాఖ అధ్యక్షులు జాలిగాం రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల ను బీజేపీ నాయకులు సందర్శించి రోడ్ అలైన్ మెంట్ ను మార్చాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం కార్యక్రమం లో బీజేపీ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఖమ్మం వెంకటేశం మాట్లాడుతూ రోడ్ అలానే వేస్తె పాఠశాల కు సంబందించిన క్రీడ ప్రాంగణం రెండు ముక్కలు అయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ ల మంత్రి పొన్నం ప్రభాకర్ మోడల్ స్కూల్‌ను సందర్శించి వాస్తవాలు తెలుసుకోవాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆస్తిని కాపాడేందుకు రాజకీయాలకు అతీతంగా అఖిలపక్ష నాయకులు ఏకం కావాలి అని ఆయన కోరారు. విద్యార్థులు చదువుకోవాల్సిన విద్యాలయ ప్రాంగణాన్ని రహదారి కోసం ముక్కలు చేయడం ఎంతవరకు సమంజసమని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. బీజేపీ మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ అలాగే స్థానిక బీజేపీ నాయకులతో కలిసి నాగ సముద్రాల మోడల్ స్కూల్‌ను సందర్శించి రహదారి అలైన్‌మెంట్ వల్ల పాఠశాలకు కలుగుతున్న నష్టాన్ని పరిశీలించారు. అనంతరం ఖమ్మం వేంకటేశం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కోహెడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సుమారు 700 నుంచి 800 మంది విద్యార్థులు ఈ స్కూల్‌లో విద్యనభ్యసిస్తున్నారని సర్వే నంబర్ 263.లో ఐదు ఎకరాల విస్తీర్ణంలో కాంపౌండ్ వాల్‌తో సహా పాఠశాల నిర్మాణం జరిగిందని తెలిపారు. అయితే కొంతమంది వ్యక్తులకు చెందిన రెండో, మూడో బిట్ల భూములకు ప్రధాన రహదారి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో కేవలం మోడల్ స్కూల్ పరిధిలోనే రహదారి అలైన్‌మెంట్‌ను మార్చడం అనేక



అనుమానాలకు తావిస్తోందని ఆయన అన్నారు. ఈ అలైన్‌మెంట్ అమలైతే పాఠశాల ప్రాంగణం రెండుగా విడిపోవడమే కాకుండా పాఠశాలలోని సగభాగం రహదారిలో కలిసిపోయే ప్రమాదం ఉందని, చివరకు వాలీబాల్ కోర్టు వరకు రహదారి విస్తరించే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల విద్యార్థులకు ఆటస్థలం, విద్యా వాతావరణం, భద్రతకు తీవ్ర విఘాతం కలుగుతుందని, భవిష్యత్తులో పాఠశాల మనుగడకే ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఒక విద్యాసంస్థకు సంబంధించిన రహదారి అలైన్‌మెంట్‌ను పదేపదే మార్చడం వెనుక ఉన్న కారణాలేమిటి అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటివరకు మూడుసార్లు సర్వే నిర్వహించినప్పటికీ విద్యార్థులకు నష్టం కలిగించే విధంగానే అలైన్‌మెంట్ ఎందుకు రూపొందించారు. గత ఏడాది మోడల్ స్కూల్‌కు సంబంధం లేకుండా పాఠశాల ఖాతాలో సుమారు రూ.62 లక్షలు జమ చేయడం వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి. ఈ అంశాలన్నింటిపై సమగ్ర విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలు వెల్లడించాలని వేంకటేశం డిమాండ్ చేశారు.

స్కూల్ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ వెంటనే స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. నేడు కోహెడ మండలంలో పర్యటించనున్న మంత్రి పొన్నం ప్రభాకర్ నాగ సముద్రాల మోడల్ స్కూల్‌ను స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని వేంకటేశం కోరారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వివాదాస్పద రహదారి అలైన్‌మెంట్‌ను వెంటనే నిలిపివేసి, ప్రత్యామ్నాయ మార్గాన్ని పరిశీలించాలని, అలైన్‌మెంట్ రూపొందించిన అధికారుల బాధ్యతను నిర్ధారించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల ఆస్తి పరిరక్షణకు అఖిలపక్షం ముందుకు రావాలి

విద్యార్థుల భవిష్యత్తు విద్యాసంస్థల పరిరక్షణ అనేది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించిన అంశం కాదని ఇది సమాజం మొత్తం బాధ్యత అని అన్నారు. అందువల్ల రాజకీయ విభేదాలను పక్కనపెట్టి అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు ఏకతాటి పైకి వచ్చి మోడల్ స్కూల్ ఆస్తిని కాపాడేందుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. రోడ్డు అలైన్‌మెంట్ మార్చే వరకు విద్యార్థుల పక్షాన నిలబడి అవసరమైతే ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించేందుకు సిద్ధం కావాలని కోరారు. అన్ని పార్టీలు కలిసి వస్తే అఖిలపక్షం ఆధ్వర్యంలో, లేనిపక్షంలో బీజేపీ నాయకులు, విద్యార్థులతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని కొనసాగించి మోడల్ స్కూల్ ఆస్తిని కాపాడుతామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో తీగలకుంట పల్లి మాజీ సర్పంచ్ మ్యాకల చంద్రశేఖర్ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు సామల గిరిధర్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కంది సత్యనారాయణ రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు నాగ అజయ్, బీజేపీ నాయకులు చిగురు రాజిరెడ్డి, మారెల్లి కరుణాకర్, దానవేని రమేష్, ఎడమల రాజు రెడ్డి, వేముల రమేష్, గుంటి బాలయ్య, తాటిపాముల శంకరయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లి జరగాల్సిన ఇంట్లో విషాదఛాయలు..

- యువకుడి మృతి
- ఆటో కారు ఢీకొని ఇద్దరు వ్యక్తుల మృతి ఏడుగురికి గాయాలు
- కారు టైరు పేలి ప్రమాదం జరిగినట్లు గుర్తించిన పోలీసులు
- బొంరాస్‌పేట మండలం అనంతపూర్ గేటు వద్ద ఘటన

బొంరాస్‌పేట, నవంబర్ 15 (జనం సాక్షి) : కారు ఆటో ఢీకొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెంది మరో ఏడుగురికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం ఉదయం మండల పరిధిలోని అనంతపురం గేటు వద్ద చోటు చేసుకుంది. ఎస్సై బాల వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం దుద్యాల మండలం లగచర్ల గ్రామానికి చెందిన బుడత శ్రీశైలం(23) తన కారు టీజీ 36 ఏ 2406 లో తుంకిమెట్ల నుండి హకింపేట వైపు వెళుతుండగా అదే సమయంలో హకీంపేట నుండి తుంకిమెట్లకు 8 మంది ప్యాసింజర్లతో కలిసి వెళుతున్న ఆటో టీఎస్ 34 టీ 6535 నంబరు గల ఆటోను కారు



అతివేగంగా వెళుతూ ఎడమవైపు ముందు టైరు పేలిపోవడంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయి ఢీకొట్టడం జరిగిందన్నారు. ప్రమాదంలో లగచర్ల వాసి కారు డ్రైవర్ శ్రీశైలం, ఆటోలో ప్రయాణిస్తున్న పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన శుభంకర్ కార్జె (20) మృతి చెందినట్లు వెల్లడించారు. ఆటోలో ప్రయాణిస్తున్న మిగిలిన ఏడుగురు వ్యక్తులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించడం జరిగిందని, మృతులను కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించామన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లగచర్లలో విషాదఛాయలు

కారు డ్రైవర్ శ్రీశైలం స్వగ్రామం లగచర్లలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈనెల 18న ఆయన వివాహము ఉండడంతో హైదరాబాదులో పెళ్లి బట్టలు కొనుగోలు చేసి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఘటన జరగడంతో పెళ్లి ఇంట్లో కుటుంబ సభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయాలి

- అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య



బోడుప్పల్, నవంబర్ 15 (జనంసాక్షి) : మల్కాజ్‌గిర మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్‌లో అంబేద్కర్ ఆశయ సాధన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నత్తి మైసయ్య ఆధ్వర్యంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి 404వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయ సాధన సంఘం సభ్యులు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి జ్ఞానమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నత్తి మైసయ్య మాట్లాడుతూ నవంబర్ 14 బాలల దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, నేటి బాలలే రేపటి పౌరులు కాబట్టి బడుగు బలహీన వర్గాలు, దళిత,బహుజనులు తమ పిల్లలను తప్పకుండా చదివించాలని, ఈ ప్రపంచంలో మన తలరాతను మార్చే ఒకే ఒక ఆయుధం చదువు అని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించే సమాజానికి ఉత్తమ పౌరులను అందించాలని నత్తి మైసయ్యవిజ్ఞప్తి చేశారు. అదేవిధంగా తరగతి గదిలోనే సమాజ నిర్మాణం జరుగుతుందని పెద్దలు చెప్పినట్లు గురువులు అంకితభావంతో అత్యుత్తమ విద్యను అందించాలని ఆయన సూచించారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్య రంగాన్ని మరింత బలోపేతం చేయాలని, మారుమూల పల్లెలో కూడా విద్యార్థులకు సరైన వసతులు కల్పించాలని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో నిర్మించి బడ్జెట్లో విద్య రంగానికి అధిక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసయ్య, బోడుప్పల్ అరుంధతి మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గరుగుల యాకయ్య,చిల్ల అంజయ్య, మల్లేష్, గుంజే శ్రీనివాస్, కంచి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ శిలాఫలకాల ధ్వంసం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలి..
- మాజీ ప్రజాప్రతినిధుల డిమాండ్

కల్వకుర్తి, నవంబర్ 15 (జనంసాక్షి) : నాగర్ కర్నూలు జిల్లాకల్వకుర్తి మండలంజిల్లెల్లగ్రామ శివారులోని దేవి చెరువు సమీపంలో ఉన్న శ్రీశ్రీశ్రీ పోచమ్మ దేవి ఆలయంలో శిలాఫలకాలను ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని మాజీ సర్పంచ్ ఎముక జంగయ్య, మాజీ ఉపసర్పంచ్ పి.పాండు గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. సుమారు రూ.35 లక్షల వ్యయంతో ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు.నిర్మాణానికి సహకరించిన జిల్లెల్ల,యంగంపల్లి గ్రామాల దాతలతో పాటు పలువురి పేర్లను శిలాఫలకాలపై పొందుపరిచినట్లు పేర్కొన్నారు.ఆలయంలో మొత్తం నాలుగు శిలాఫలకాలు ఉండగా, గుర్తుతెలియని వ్యక్తులు రెండు పలకలను తొలగించి బయట పడేసి ధ్వంసం చేశారని తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే ఈ ఘటనకు



పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ శిలాఫలకాలను ధ్వంసం చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయడమేనని వారు పేర్కొన్నారు.

ఆలయ భూమిలో మళ్లీ చెత్త డంపింగ్

- గతంలో వార్తలు వచ్చినా మారని అధికారుల తీరు..
- అదే స్థలంలో యథేచ్ఛగా చెత్త పారబోత
- వివరణ కోరితే పొంతనలేని సమాధానాలు చెబుతున్న పంచాయతీ కార్యదర్శి



కొండుర్గు, నవంబర్ 15 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ పరిసరాల్లో చెత్త డంపింగ్ సమస్య మళ్లీ మొదటికొచ్చింది. గతంలో ఇదే అంశంపై పత్రికల్లో వార్తలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారుల్లో మాత్రం చలనం కనిపించడం లేదు. గతంలో చెత్తను తొలగించిన స్థలంలోనే తిరిగి చెత్తను పారబోస్తుండటంతో స్థానికులు, తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆలయ భూములను కాపాడాల్సిన అధికారులే బాధ్యతను విస్మరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెత్తను తొలగించి శాశ్వత పరిష్కారం చూపాల్సి ఉండగా, తాత్కాలికంగా తొలగించి చేతులు దులుపుకోవడం వల్ల సమస్య మళ్లీ మొదటికొస్తోందని గ్రామస్థులు అంటున్నారు. పేరుకుపోతున్న చెత్తతో దుర్వాసన వెదజల్లడంతో పాటు పరిసర ప్రాంతాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ సమస్యపై వార్తలు వచ్చిన నేపథ్యంలో అధికారులు స్పందించి చెత్తను తొలగించినప్పటికీ, మళ్లీ అదే ప్రాంతంలో చెత్తను వేస్తుండటం వారి పర్యవేక్షణ లోపాన్ని స్పష్టం చేస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత అధికారి పంచాయతీ కార్యదర్శి ని వివరణ కోరినప్పుడు సమస్యకు సంబంధం లేకుండా పొంతన లేని సమాధానాలు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టేస్తున్నారనే అసహనం వ్యక్తమవుతోంది. ఇప్పటికైనా గ్రామపంచాయతీ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో స్పందించి ఆలయ భూముల్లో పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించాలని, మళ్లీ అక్కడ చెత్త వేయకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని భక్తులు, గ్రామస్థులు కోరుతున్నారు.

కాలనీల సమస్యల పరిష్కారమే లక్ష్యం



జవహర్‌నగర్, నవంబర్ 15 (జనంసాక్షి) : జవహర్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మాజీ మేయర్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ పర్యటించి స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి పలు సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కాలనీల్లో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధి దీపాలు, పారిశుద్ధ్యం వంటి మౌలిక వసతుల సమస్యలపై ప్రజలతో చర్చించారు. ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రతి కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించి, జవహర్ నగర్ డివిజన్‌ను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు.

అక్రమ బెల్ట్ షాపులపై పోలీసుల మెరుపు దాడులు

- 42 లీటర్ల మద్యం స్వాధీనం

శంకర్‌పల్లి, నవంబర్ 15 (జనం సాక్షి) : అక్రమ మద్యం విక్రయాలపై ఫ్యూచర్ సిటీ పోలీసులు ఉక్కుపాదం మోపారు. శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని పర్వేద గ్రామంలో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక దాడుల్లో 8 అక్రమ బెల్ట్ షాపులపై కేసులు



నమోదు చేయటంతో పాటు141 మద్యం సీసాలు (42 లీటర్ల మద్యం) స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడులు శంకర్ పల్లి సీ.ఐ రుద్వీర్ కుమార్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని అక్రమ మద్యం విక్రయాలపై నిరంతర నిఘా ఉంటుందని తెలిపారు.

హెచ్‌సీఎల్ హైదరాబాద్ సైక్లోథాన్

- 2500 మంది సైక్లిస్టులు హాజరు

శేరిలింగంపల్లి, నవంబర్ 15 (జనంసాక్షి) : హెచ్‌సిఎల్ హైదరాబాద్ సైక్లోథాన్ – సైక్లింగ్ రెవల్యూషన్'కి సంబంధించి 3వ ఎడిషన్ లో భాగంగా నిర్వహించిన సైక్లోథాన్ పోటీలలో ఉత్సాహికులు భారీగా పాల్గొనడం హర్షించదగ్గ విషయమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం నిర్వహించిన ఈ సైక్లోథాన్ ప్రైమ్ ఎరీనాలో విజయవంతంగా కొనసాగడం విశేషమని ఆయన అభివర్ణించారు. మాదాపూర్ సహా పరిసర ప్రాంతాల నుండి ఎంత ఉత్సాహంగా ఉదయమే సైక్లోథాన్ ప్రదేశానికి 2 వేల 5 వందల మందికి పైగా చేరుకొని సైక్లింగ్ లో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమం సైక్లింగ్ ఔత్సాహికులు, అమెచ్యూర్ సైక్లిస్టులు మరియు ఫిట్‌నెస్ ప్రచారకులను ఒకచోటకు చేర్చి ఆరోగ్యం, ఫిట్‌నెస్ మరియు సుస్థిర పట్టణ రవాణా సంస్కృతిని ప్రోత్సహించిందన్నారు. గ్రీన్ రేస్ మరియు ఇతర సైక్లింగ్ విభాగాల జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ తోపాటు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్(ట్రాఫిక్) సున్‌ప్రీత్ సింగ్ సీనియర్ ట్రాఫిక్ పోలీస్ అధికారులు, ఎస్‌సిఎస్‌సి సిఈఓ నవీద్ ఆలం ఖాన్ మరియు హెచ్‌సిఎల్ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సమావేశాన్ని ఉద్దేశించి సిపి రమేష్ మాట్లాడుతూ మహిళా ఔత్సాహిక సైక్లిస్టుల భాగస్వామ్యాన్ని మరింతగా



ప్రోత్సహించడం, సైక్లింగ్ ఈవెంట్లను మరింత సమ్మిళితంగా, ప్రభావవంతంగా మార్చాల్సిన అవసరం ఉందని, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా సైక్లింగ్ ప్రాముఖ్యతను సిపి నొక్కి చెప్పారు. సైక్లింగ్ వ్యవస్థను బలోపేతం చేయడానికి, ఈ క్రీడను విస్తృత స్థాయిలో ప్రోత్సహించడానికి సైక్లింగ్ ఫెడరేషన్ మరియు ఒలింపిక్ అసోసియేషన్‌ను ఏకతాటిపైకి తీసుకురావాల్సిన ఆవశ్యకతనుకూడా ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. పౌర భాగస్వామ్యం, సామాజిక నిమగ్నత మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించే మరిన్ని ప్రజా కేంద్రీకృత కార్యక్రమాలు, చొరవలను నిర్వహించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటిస్తూనే హైదరాబాద్ 'భారతదేశ ఈవెంట్ రాజధాని'గా ఆవిర్భవించాలని కాంక్షించారు. నగరాన్ని 'మొబిలిటీ-కాన్షియస్ హైదరాబాద్'గా పేర్కొంటూ సైబరాబాద్‌లో పెరుగుతున్న పట్టణ రవాణా సవాళ్లను కూలంకషంగా ప్రస్తావిస్తూ, ప్రతిరోజూ సైబరాబాద్ రోడ్లపై కోటికి పైగా వాహనాలు తిరుగుతున్నాయని, ఇది ట్రాఫిక్ రద్దీని విపరీతంగా పెంచుతుందని కమిషనర్ అభిప్రాయపడ్డారు. వ్యక్తిగత వాహనాల వాడకానికి స్థిరమైన ప్రత్యామ్నాయాలుగా ప్రజా రవాణా, కార్‌పూలింగ్ మరియు సైక్లింగ్‌ను ఎక్కువగా అవలంబించాలని ప్రయాణికులను కోరారు. సైక్లింగ్ కార్యక్రమాలు దేహదారుడ్ఢి పెంపొందించడంతోపాటు బాధ్యతాయుతమైన రవాణా పద్ధతులపై మరింత అవగాహనను కల్పిస్తాయని సిపి స్పష్టం చేశారు. ఆయన మరింతగా నొక్కి చెప్పారు. నవంబర్ 26 నుండి 28 తేదీ వరకు టి-హబ్ మరియు టి-వర్క్స్‌లో జరగనున్న 3 రోజుల ఇమ్మర్సివ్ అర్బన్ మొబిలిటీ సింపోజియం అయిన 'సైబరాబాద్ మూవ్స్' పై దృష్టి సారించాలని నొక్కి చెప్పారు. వినూత్న పరిష్కారాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి మరియు పట్టణ రవాణా భవిష్యత్తుపై చర్చించడానికి ఈ వేదిక వివిధ ప్రభుత్వ విభాగాలు, ప్రజా సంస్థలు, పరిశ్రమల నాయకులు మరియు ఇతర భాగస్వాములను ఏకతాటిపైకి తెస్తుందన్నారు. రవాణా భవిష్యత్తును తీర్చిదిద్దడం లక్ష్యంగా సైబరాబాద్ మూవ్స్ భారతదేశంలో 'మొట్టమొదటి' లీనమయ్యే పట్టణ రవాణా వేదిక అని పోలీస్ కమిషనర్ అభివర్ణించారు.

మహనీయుల విగ్రహాలకు అడ్డుగా పంచాయతీ భవన నిర్మాణం ఆపాలి

- ఆగిర్యాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రావాలి
- తొమ్మిది రోజులుగా యువకుల దీక్ష

కొండుర్గు, నవంబర్ 15 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లాల్లోని ఆగిర్యాల గ్రామంలో మహనీయుల విగ్రహాలకు అడ్డుగా చేపడుతున్న గ్రామపంచాయతీ భవన నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసి, ప్రత్యామ్నాయ స్థలంలో నిర్మించాలని ఎంఆర్‌పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు పెంటనోళ్ల నర్సింహా మాదిగ డిమాండ్ చేశారు. చెవుల బిక్షపతి ఆధ్వర్యంలో గ్రామ యువకులు తొమ్మిది రోజులుగా దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందించినప్పటికీ పరిష్కారం లభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్వయంగా ఆగిర్యాల గ్రామాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించాలని కోరారు. మహనీయుల విగ్రహాల గౌరవం, దళితుల ఆత్మగౌరవం, జాతరల నిర్వహణకు ఆటంకం కలగకుండా గ్రామ ప్రజలు సూచించిన ప్రత్యామ్నాయ స్థలంలో భవన నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే మండలంలోని మాదిగ పల్లెలను ఏకం చేసి ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ కొందుర్గు మండల మాజీ అధ్యక్షులు ఆనేగాళ్ళ ఆనంద్ మాదిగ, అధ్యక్షులు గూడెం చెన్నయ్య మాదిగ, ప్రధాన కార్యదర్శి గోపి అనంత రాములు మాదిగ తదితర నాయకులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
సోమవారం
16 నవంబర్ 2026

‘ఖేలో ఇండియా’ మైలురాయిగా నిలవాలి

క్రీడల నిర్వహణకు రూ.203.13 కోట్ల రాష్ట్ర బడ్జెట్

- శాశ్వత మౌలిక వసతుల కల్పనే లక్ష్యం
- రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి



హైదరాబాద్ (జనంసాక్షి) :తెలంగాణ క్రీడా చరిత్రలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 ఒక మైలురాయిగా నిలవాలని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. తెలంగాణ వేదికగా డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న 8వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026కు సంబంధించిన లోగో, మస్కట్‌ను కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, క్రీడల ప్రభుత్వ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్, సాట్స్ ఎండీ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మీడియాతో మాట్లాడుతూ.. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు తెలంగాణను ఎంపిక చేసిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఈ క్రీడా సంబరాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించామని, ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం కేటాయించిన రూ.21 కోట్లకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం రూ.203.13 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులను కేవలం క్రీడల నిర్వహణకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని స్టేడియాల్లో శాశ్వత మౌలిక వసతుల కల్పనకు వినియోగిస్తామని పేర్కొన్నారు. తద్వారా భవిష్యత్తులోనూ క్రీడాకారులకు మెరుగైన శిక్షణ, సాధనకు అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని అన్నారు. ఈసారి ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మొత్తం 27 క్రీడాంశాలు ఉండగా, తెలంగాణ సంప్రదాయ క్రీడ అయిన కర్రసామును కూడా చేర్చడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని మంత్రి తెలిపారు. దేశవ్యాప్తంగా 7 వేల మందికి పైగా క్రీడాకారులతో పాటు సుమారు 1,200 మంది కోచ్‌లు, సహాయక సిబ్బంది ఈ పోటీల్లో పాల్గొననున్నారని వెల్లడించారు. హైదరాబాద్‌తో పాటు హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పోటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేస్తున్నామని చెప్పారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మత్తు వదలండి.. మైదానాలు చేరండి అనే నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టిన నశా ముక్త్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచి, క్రీడలు, వ్యాయామం వైపు మళ్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ద్వారా తెలంగాణ క్రీడా ప్రతిభ దేశవ్యాప్తంగా చాటడంతో పాటు, రాష్ట్రాన్ని క్రీడా రంగంలో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లు

అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పెన్షన్లు

- మహిళల ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం పెద్దపీట
- రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల 50,000 మందికి పింఛన్లు మంజూరు చేసాం
- మెదక్ జిల్లాలో 11వేల మందికి నూతన పింఛన్లు మంజూరు
- రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



మెదక్ (జనంసాక్షి) : ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర అర్హులైన వర్గాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నూతన చేయూత పింఛన్ల కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహఅన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పార్టీలకతీతంగా పింఛన్లు మంజూరు చేస్తున్నామని అయన స్పష్టం చేశారు. మెదక్ జిల్లా టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు చెందిన లబ్ధిదారులకు నూతన చేయూత పింఛన్ ల మంజూరు ఉత్తర్వులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల నూతన పింఛన్లు మంజూరు చేయగా, ఒక్క మెదక్ జిల్లాలోనే 11 వేల పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. ఇందులో టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు కలిపి 1,400 పింఛన్లు అందజేస్తున్నట్లు వెల్లడించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం మహిళా సంఘాలకు పెద్దఎత్తున ప్రోత్సాహం అందిస్తోందన్నారు. బ్యాంకు లింకేజీ లేకుండానే లక్షల రూపాయల రుణాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ క్యాంటీన్లు, పెట్రోల్ బంకులు, డ్రోన్ల నిర్వహణ వంటి రంగాల్లో మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు.రాష్ట్రంలో గుడిసెలు లేని సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రతి నియోజకవర్గానికి ఏటా 3,800 ఇళ్ల మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్ మండలాలకు 1,400 ఇళ్లు కేటాయించగా, ఇప్పటివరకు 400 ఇళ్ల నిర్మాణం పూర్తయిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తామని, ఇళ్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు, ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, అందోల్, బొడ్మాట్ పల్లి వంటి వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే స్థానిక నిరుద్యోగ యువతకు, నైపుణ్యం కలిగిన యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.

కొత్తగా మంజూరైన పింఛన్లలో రేగోడు అల్లాదుర్గ్, టేక్మాల్ మండలాల్లో వితంతువులు,965 ఒంటరి మహిళలు166 , దివ్యాంగులు 195 గీత కార్మికులు 60 మంది ఉన్నారని తెలిపారు .కుటుంబ పెద్దను కోల్పోయి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎందరో మహిళలకు పింఛన్ ఆత్మగౌరవంతో జీవించే భరోసానిచ్చింది. అని వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, మెదక్ ఇంచార్జ్ ఆర్డీవో రామకృష్ణ, టేక్మాల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పట్లోళ్ల విష్ణువర్ధన్ రెడ్డి, అల్లాదుర్గ్, రేగోడు, టేక్మాల్ మండలాల ఎంపీడీవోలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో అగ్రగామిగా తెలంగాణ

డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధనపై ప్రత్యేక దృష్టి

- హైదరాబాద్ లో ఎన్ డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సానుకూలం
- ‘ఎన్‌డీఈ-2026’ జాతీయ సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ (జనంసాక్షి) : ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా... డిజైన్, ఇంజినీరింగ్, నాణ్యతా పరీక్షలు, ధ్రువీకరణ, పరిశోధన తదితర విభాగాలనూ రాష్ట్రంలో మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఐఎస్ఎన్‌టీ) ఆధ్వర్యంలో ఆదివారం హైటెక్స్ లో నిర్వహించిన ‘నాన్ డిస్ట్రక్టివ్ ఎవాల్యుయేషన్ అండ్ ఎనేబ్లింగ్ టెక్నాలజీస్ (ఎన్‌డీఈ--2026)’ జాతీయ సదస్సులో ఆయన విశిష్ఠ అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... గ్లోబల్ సప్లై చైన్‌లో ‘మేడ్ ఇన్ తెలంగాణ’ బ్రాండ్‌కు మరింత గుర్తింపును తీసుకొచ్చేందుకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందన్నారు. ఆ దిశగా తయారీ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునేలా స్థానిక పరిశ్రమలను గ్లోబల్ మార్కెట్ తో అనుసంధానం చేస్తున్నామన్నారు. విమానాలు, హెలికాప్టర్లు, ఇతర ఏరోస్పేస్, డిఫెన్స్ పరికరాల నాణ్యత, భద్రత, విశ్వసనీయతను నిర్ధారించడంలో ఎన్ డీఈ నిపుణుల పాత్ర కీలకమన్నారు. అడ్వాన్స్‌డ్ మెటీరియల్స్, ఎమర్జింగ్ టెక్నాలజీలు అందుబాటులోకి వస్తున్న కొద్దీ వాటిని పరీక్షించే విధానాలు కూడా మారాలన్నారు. మరింత కచ్చితమైన ఫలితాల కోసం ఏఐ, డిజిటల్ ట్విన్స్, అడ్వాన్స్‌డ్ ఇన్ స్పెక్షన్ పద్ధతుల వినియోగం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. రాబోయే రోజుల్లో ఎన్ డీఈ నిపుణులకు మరింత డిమాండ్ ఉండనుందని, ఆ దిశగా తెలంగాణ యువతను ‘రెడీ టూ వర్క్ ఫోర్స్’ గా తీర్చిదిద్దేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ఐఎస్ఎన్ టీ, పరిశ్రమలు, యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలు ముందుకు రావాలని కోరారు. హైదరాబాద్‌లో ఎన్ డీఈ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయాలన్న ఐఎస్ఎన్ టీ విజ్ఞప్తిపై మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఐఎస్ఎన్ టీ ప్రెసిడెంట్ డా.జైతీష్ ఆర్ జోషి, ఎన్ డీ ఈ 2026 ఛైర్మన్ సూర్య ప్రకాష్ గజ్జల, కన్వీనర్ మోహన్ పి నాయర్, మిధాని సీఎండీ డా.ఎస్వీఎన్ నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.



సమాజ శ్రేయస్సు సాహిత్య సాంస్కృతిక రంగాలతోనే..

- దత్త సాయి అవార్డుల ప్రదానోత్సవంలో జూలూరు గౌరీశంకర్

హైదరాబాద్ (జనంసాక్షి) : సమాజాన్ని సరైన దారిలో నడిపించగల శక్తి సామర్థ్యాలు సాహిత్య, సాంస్కృతిక రంగాలకే ఉన్నాయని తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ ప్రముఖ కవి జూలూరు గౌరీ శంకర్ తెలిపారు. తెలుగు సమాజంలో భక్తి, రక్తి ,ముక్తి ,అనురక్తి కలిగించింది సాహిత్యమేనని, ఎన్నెన్నో సామాజిక ఉద్యమాలకు ప్రాణం పోసింది సాహిత్యమేనన్నారు. సామాజిక దురాగతాలను ఎండగడుతూ ప్రజాస్వామిక స్పృహను కాపాడటంలో కీలక పాత్రను పోషించింది సాహిత్యమేనని పేర్కొన్నారు. రవీంద్రభారతిలో ఆదివారం శ్రీ దత్త సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన జీవన సాఫల్య, సాహిత్య పురస్కార ప్రదాన ఉత్సవ కార్యక్రమానికి జూలూరు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రముఖ సాహితీవేత్తలు విహారి (జే ఎస్ మూర్తి), శ్రీ రంగాచార్య లకు జీవన సాఫల్య పురస్కారాలు, ప్రముఖ సాహితీ వేత్త పూర్వ రిజిస్ట్రార్ టి గౌరీ శంకర్ కు సాహిత్య పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జూలూరు మాట్లాడుతూ ప్రతి నిత్యం సమాజాన్ని మేలుకొలుపుతూ సాహిత్య సృష్టి చేసే బాధ్యత సాహిత్య సాంస్కృతిక రంగాలదే నన్నారు. మాలపల్లి, కన్యాశుల్కం నుంచి నేటి అస్తిత్వ సాహిత్యం వరకు, గురజాడ నుంచి గద్దర్ వరకు సమాజాన్ని మేలుకొలిపే పనినే చేశారన్నారు. ఈ కార్యక్రమానికి వంశీ సంస్థల వ్యవస్థాపకులు వంశీ రామా రాజు అధ్యక్షత వహించగా గౌరవ అతిథులుగా ప్రముఖ సాహితీవేత్తలు సుధామ, ధోనిపూడి చక్రపాణి, దత్త సాంస్కృతిక సంస్థ ప్రధాన కార్యదర్శి కామరాజు గడ్డ వాసవ దత్త రమణలు ప్రసంగించారు.



వ్యాపారులకు ఇబ్బందులు కలిగించేలా

పన్నుల విధింపు ఉండదు

మంత్రి సీతక్క హామీ

ములుగు ప్రతినిధి, నవంబర్ 15(జనంసాక్షి) : ములుగు జిల్లా కేంద్రంలోని వర్తక, వాణిజ్య వ్యాపార సంస్థల యజమానులు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ములుగు మున్సిపాలిటీ పరిధిలో పన్నుల చెల్లింపులకు సంబంధించి వ్యాపార స్తుల్లో నెలకొన్న సందేహాలు, అపోహలను మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి సీతక్క స్పందిస్తూ, మున్సిపాలిటీ పరిధిలో పన్నుల చెల్లింపు విషయంలో వ్యాపారస్తులు ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. వ్యాపారులకు ఆర్థికంగా ఇబ్బందులు కలిగించేలా లేదా వారి వ్యాపార కార్యకలాపాలకు ఆటంకం కలిగించేలా ఎలాంటి నిర్ణయాలు తీసుకోబోమని హామీ ఇచ్చారు. వ్యాపారుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, తమ పరిధిలో ఉన్నంతవరకు పన్నుల విధింపు, చెల్లింపుల వ్యవహారంలో వ్యాపారస్తులకు సానుకూలంగా వ్యవహరి స్తామని తెలిపారు. పట్టణ అభివృద్ధితో పాటు వ్యాపారుల సంక్షేమం కూడా ముఖ్యమని, ఇరువర్గాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని సమన్వయంతో ముందుకు సాగుతామని పేర్కొన్నారు. వ్యాపారస్తులు ఎలాంటి అందోళన చెందకుండా తమ వ్యాపార కార్యక లాపాలను యథావిధిగా కొనసాగించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ కౌన్సిలర్లు, పట్టణంలోని వర్తక, వాణిజ్య వ్యాపార సంస్థల యజమానులు, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని అంగీకరించని ఆర్ఎస్ఎస్, బీజేపీ

సీపీఐ(ఎం) కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్

- నల్లగొండలో ఏఐకేఎస్ జాతీయ మహాసభలు
- మోడీ ప్రభుత్వ విధానాలపై ధ్వజం





నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 15,(జనం సాక్షి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ సహకారంతో కొనసాగుతోందని, ఈ రెండు సంస్థలు దేశ రాజ్యాంగాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేవని సీపీఐ(ఎం) కేంద్ర పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందా కారత్ విమర్శించారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో నిర్వహించిన ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ మహాసభకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతు సంఘాల ప్రతినిధులు, నాయకులు భారీగా తరలివచ్చారు. ఈ సందర్భంగా బృందా కారత్ మాట్లాడుతూ.. మోడీ ప్రభుత్వం తమను మానసిక నక్సలైట్లుగా అభివర్ణిస్తోందని, అయితే రైతులు, కార్మికులు, పేదల హక్కుల కోసం పోరాడేవారే నిజమైన దేశభక్తులని పేర్కొన్నారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని హిందూ, ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని బృందా కారత్ ఆరోపించారు. రజాకార్లకు వ్యతిరేకంగా సాగిన పోరాటాన్ని మతపరమైన ఘర్షణగా చూపించడం సరికాదన్నారు. నిజాం పాలనకు మద్దతుగా నిలిచిన వారిలో హిందూ భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు కూడా ఉన్నారని గుర్తుచేశారు. తెలంగాణ పోరాట చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరీ విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సుమారు 3 వేల గ్రామాలను విముక్తి చేసిందని, అనేక గ్రామాల్లో భూమిని పంచిందని తెలిపారు. దొడ్డి కొమురయ్య, చాకలి ఐలమ్మ, పుచ్చలపల్లి సుందరయ్య, మల్లు స్వరాజ్యం తదితర పోరాట యోధుల సేవలను స్మరించుకున్నారు. నాలుగు వేల మంది అమరవీరుల త్యాగాలను గుర్తుచేస్తూ నల్లగొండ గడ్డకు విప్లవ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీలో రైతులు సాగించిన పోరాటాన్ని బృందా కారత్ ప్రస్తావించారు. ఏఐకేఎస్ తో పాటు పలు రైతు సంఘాలు ఐక్యంగా ఉద్యమించి ఆ చట్టాలను వెనక్కి తీసుకునేలా చేశాయని పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. నల్ల చట్టాలను మరో రూపంలో తీసుకొచ్చే ప్రయత్నాల పట్ల రైతు సంఘాలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

ఆదివాసీ రైతుల హక్కులను కాపాడాలి

మోడీ ప్రభుత్వం ఆదివాసీ రైతుల భూమి, హక్కులకు నష్టం కలిగిస్తోందని బృందా కారత్ ఆరోపించారు. ఆదివాసీలను వారి భూముల నుంచి దూరం చేసే విధానాలను వ్యతిరేకించాలని కోరారు. బిర్సా ముండా జయంతి సందర్భంగా జల్, జమీన్, జంగల్ నినాదంతో ఆదివాసీ హక్కుల పరిరక్షణకు ప్రతినబూనాలని పిలుపునిచ్చారు.దేశంలో 80 శాతం మంది సన్న, చిన్నకారు రైతులు ఉన్నప్పటికీ వారి సంక్షేమానికి తగిన విధానాలు అమలు కావడం లేదన్నారు. భూ గరిష్ఠ పరిమితి చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని, కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేయాలని కోరారు. వ్యవసాయంలో కీలక పాత్ర పోషిస్తున్న మహిళా రైతులకు తగిన గుర్తింపు, హక్కులు కల్పించాలని అన్నారు.రైతులు, వ్యవసాయ కార్మికులు, నిరుపేదలు, అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడే జెండా ఏఐకేఎస్ అని బృందా కారత్ పేర్కొన్నారు. 90 ఏళ్ల కిసాన్ సభ పోరాట చరిత్ర భవిష్యత్తు ఉద్యమాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు.ఈ మహాసభలో మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, ఏఐకేఎస్ అధ్యక్షుడు దవులయ్య, ప్రధాన కార్యదర్శి బిజు కృష్ణతో పాటు జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370